

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 329

సోమవారం 19-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మంచిమాట

సన్నిధి



బుద్ధి కుశలత

కుశలత అంటే నేర్పరితనం. ఏ పని చేయటానికైనా ఒక నేర్పరితనం అవసరం. ఏదో ఒక తీరులో తోచిన విధంగా చేయటం కాక, సులువైన పద్ధతిలో సునాయాసంగా చేయగలగటం నేర్పరితనం. బుద్ధిని దాని సామర్థ్యాన్ని తగిన విధంగా ఉపయోగించటమే బుద్ధి కుశలత.

సాధారణంగా మనస్సుని, బుద్ధిని సమానార్థకాలుగా వాడుతూ ఉంటాం. కాని రెండింటికీ తేడా ఉంది. ఆలోచన చేసేది, పంచేంద్రియాలని ప్రేరేపించేది, వాటిపై పెత్తనం చేసేది, తనకి నచ్చినట్టు, కావలసినట్టు ఊహ చేసేది, కలలు కనేది, ఆశపడేది, రాగద్వేషాలకి నిలయమైనది మనస్సు. బుద్ధిలో కూడా మనోవ్యాపారం ఉన్నా, దానిలో విచక్షణా, సహేతుకతా ఉంటాయి.

ఒక మంచిపని, తనకి, కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఉపయోగపడేది చేద్దామని నిర్ణయం తీసుకున్నప్పుడు పని చేసింది బుద్ధి. తీరా ఆ పని మొదలుపెట్టిన తరువాత ఏవేవో పనికిరాని కారణాలతో సమర్థించుకుని వాయిదా వేసుకుంటూ వచ్చినప్పుడు పని చేసింది మనస్సు. మనస్సు శారీరిక, మానసిక సుఖాన్ని అపేక్షిస్తుంది. మంచి చెడులను వేర్పరచి విచక్షణతో నిర్ణయం తీసుకునేది బుద్ధి. అయితే ఎన్నో సందర్భాలలో మనసు బుద్ధి వేషం వేసుకుని వస్తుంది. పని వాయిదా వేయటానికి కారణాలు వెదకినట్టుగా మనోవ్యాపారమైన ఆలోచనల సహకారంతో ఏది మంచి ఏది చెడు ఏది శాశ్వతం, ఏది తాత్కాలికం, ఏది తనకి, సమాజానికి ఉపయోగ పడుతుంది, ఏది ఉపయోగ పడదు అనే అంశాలను విడదీసి, విమర్శించి, వేర్పరచి సరైన నిర్ణయం తీసుకునేందుకు సహకరించే శక్తి బుద్ధి.

ఒకప్పుడు గురుకులాల్లో గురువులు శిష్యులకి విద్యాబుద్ధులు నేర్పేవారు. విద్యావంతులు బుద్ధిమంతులుగా ఉండేవారు. విద్య అంటే విషయ సేకరణ మాత్రమే కాదు. సేకరించిన విషయాలను, సముపార్జించిన జ్ఞానాన్ని జీవితానికి అన్వయం చేసి, ఆచరణలో పెట్టగలగటం, ఆ జ్ఞానాన్ని ఎప్పుడు ఎంత అవసరమో నిర్ణయించగల మెలకువ కలిగి ఉండటం. అదే బుద్ధికుశలత.

ఒక పండితుడికి, శాస్త్రవేత్తకి తమ తమ రంగాలకి సంబంధించిన జ్ఞానం చాలా ఉండవచ్చు. దానిని సందర్భానుసారంగా ఎట్లా ఉపయోగించుకోవాలో తెలియక నలుగురిలోనూ నవ్వుల పాలు కావటం చూస్తూ ఉంటాం. మెదడు బాగా ఎదిగింది కాని, విచక్షణ లేదు అని అర్థం. గొప్ప మేధావులు కూడా జీవితంలో సరయిన నిర్ణయం తీసుకోక నష్టపోవటానికి ఎంతోమంది శాస్త్రవేత్తల జీవితాలని ఉదాహరణలుగా గమనించవచ్చు. కారణం విద్యతో పాటు బుద్ధి గరపిన వారు లేకపోవటమే. ప్రస్తుత విద్యావిధానంలో చదువులు నేర్పి అక్షరాస్యులని తయారు చేయటం మాత్రమే కనిపిస్తోంది. కాని, బుద్ధివికాసం ఎంతవరకు జరుగుతోంది? అన్నది ప్రశ్నార్థకమే. ఈ కారణంగానే పెద్ద పెద్ద విద్యార్హతలు ఉన్న వారు కూడా సంఘవిద్రోహశక్తులుగా మారటం, దేశద్రోహులుగా మారటం కుటుంబ దేశ పరువు ప్రతిష్ఠలను దెబ్బ తీసే విధంగా ప్రవర్తించటం చివరికి తమకే హాని చేసుకోవటం గమనించవచ్చు.

ఆకలి దహించుతోంది, నిద్ర ముంచుకు వస్తోంది. తినటం, పడుకోటంలలో ఏది ముందు చేయాలి? అని నిర్ణయించుకుని మేలు పొందటానికి కావలసినది విచక్షణ మాత్రమే కాని చదువులు కాదు.

కార్యసాధకుల లక్షణాలలో ప్రధానమైనది బుద్ధికుశలత. జీవితంలో గొప్ప విజయాలు సాధించి అత్యున్నత స్థానానికి చేరుకున్నవారందరు బుద్ధికుశలురే. చదువులు సహాయం చేసి ఉండవచ్చు.

– డా.ఎన్.అనంతలక్ష్మి

కుశలత... విచక్షణ

ప్రతి మనిషికి మనసు ఉన్నట్టే బుద్ధి కూడా ఉంటుంది. కాని, అందరూ బుద్ధిని సరిగా ఉపయోగించరు. దానిని ఉపయోగించటంలోని మెలకువలు తెలియటమే బుద్ధి కుశలత. ఏ పని ఎట్లా చేయాలో తెలిసి ఉండటమన్న మాట. దీనినే ఒడుపు అని కూడా అనవచ్చు. ఏ పనినైనా గుడ్డెద్దు చేలో పడ్డట్టు అడ్డదిడ్డంగాను చేయవచ్చు. ఎక్కువమంది చేసేది ఆ విధంగానే. లేదా క్రమపద్ధతిలోనూ చేయవచ్చు. ఇది నేర్పరులు చేసే పద్ధతి. బుద్ధిని ఉపయోగించటంలో ఇటువంటి నేర్పరితనం ఉంటే దాన్నే బుద్ధి కుశలత అనవచ్చు. అంటే చురుకుగా పని చేసే విచక్షణాజ్ఞానం అన్నమాట.

బౌద్ధవాణి



అంధత్వం తొలగితే..!

అది కురుదేశం. అందులో 'కమ్మాసధమ్మం' అనే పట్టణం. మంచి వ్యాపార కేంద్రం. ఆ పట్టణానికి సమీపంలో భారద్వాజ మహర్షి ఆశ్రమం. బుద్ధుడు ఒకానొక సమయంలో ఆ ఆశ్రమంలో ఉంటున్నాడు. బుద్ధుడు భిక్ష కోసం వెళ్ళాడు. మధ్యాహ్న సమయంలో మాగందియుడు అనే పరివ్రాజకుడు ఆ ఆశ్రమానికి వచ్చాడు. అగ్నిశాలలో నేల మీద పరచి ఉన్న పడకను చూశాడు.

"నేను ఇక్కడ ఉండొచ్చా;" అని అడిగాడు.

"లేదు.. అది భగవాన్ బుద్ధునిది" అన్నాడు.

"అగ్నిశాలలో పడక ఏర్పాటు చేసేంత గొప్పవాడా ఆ శాక్య గౌతముడు?"

"అవును మాగందియా! అతను తథాగతుడు. దుఃఖ నివారణ ఎరిగినవాడు. అష్టాంగ మార్గం చూపినవాడు" అన్నాడు భారద్వాజుడు.

"భారద్వాజా! నేను గౌతమునికి మించిన వాడినే. మా ఇరువురినీ ఒకేచోట చూస్తే ఆ గౌతముడు వృద్ధి నాశకుడని మీరే అంగీకరిస్తారు" అన్నాడు అహంకారంతో మాగందియుడు.

"ఐతే సరి... మీరన్నట్లే" అన్నాడు భారద్వాజుడు.

మధ్యాహ్నం ముగిసేవేళకి బుద్ధుడు వచ్చాడు. ఒక పక్క కూర్చొని భిక్ష స్వీకరించాడు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాడు. ఆ తర్వాత మాగందియుడు వచ్చాడు. ఆరోగ్యం, నిర్వాణం, అష్టాంగమార్గం... ఈ విషయాల మీద చర్చ సాగింది. అతి కొద్ది సమయానికే మాగందియుడు వెనకడుగు వేశాడు.

అప్పుడు బుద్ధుడు "మాగందియా! ఒక గుడ్డివాడు ఉంటాడు. అతను నలుపు, తెలుపు, నీలం రంగుల్ని చూడగలడా?

"లేదు గౌతమా!"

రంగురంగుల వస్తువుల్ని చూడగలడా? తాను నడుస్తున్న దారిలో ఎగుడు దిగుళ్ళను చూడగలడా? చంద్రుణ్ణి చూడగలడా? చుక్కల్ని, సూర్యుణ్ణి చూడగలడా? ఇతరుల్ని చూడగలడా?"

"లేదు గౌతమా? ఎలా చూస్తాడు అతను గుడ్డివాడు కదా?"

"మరి అలాంటి గుడ్డివాడిని అతని బంధువులు ఒక వైద్యుని దగ్గరకు తీసుకు వస్తారు. అతను గొప్ప నేత్ర వైద్యుడు. అతను ఎన్నో విధాలుగా చికిత్స చేస్తాడు. మందులూ, పసర్లు పూస్తాడు. అయినా అతనికి చూపు రాదు. మాగందియా! ఆ వైద్యుని ప్రయత్నం గురించి నీవు ఏమనుకుంటావు?"

"వేరే అనుకునేది ఏముంది గౌతమా! ఆ ప్రయత్నం వ్యర్థం. ఆ వైద్యునికి శ్రమ మాత్రమే మిగిలింది"

"అలాగే నేను నీకు సరైన ధర్మాన్ని బోధించాను. కాని నీవు దాన్ని గ్రహించలేదు."

"గౌతమా? మరింత విపులంగా వివరించగలరా?"

"మరలా అంధుని గురించే చెప్తాను. ఒకసారి కొందరు ఒక వస్త్రం గురించి మాట్లాడుకుంటూ–" ఇది తెల్లనిది. మరకలు అంటనిది. అందమైనది. పరిశుభ్రంగా ఉంది. అనుకుంటూ ఉంటారు. ఒక అంధుడు దాన్ని అడిగి తీసుకుని కప్పుకుని వెళ్తూ ఉంటాడు. దారిలో ఒక మోసగాడు –

"అయ్యా! ఆగు.. మీరు కప్పుకున్నది మంచి వస్త్రం కాదు. నా దగ్గర అంత కంటే అందమైన, విలువైన వస్త్రం ఉంది" అంటూ మురికి పట్టిన వస్త్రాన్ని ఇచ్చి, మంచి వస్త్రాన్ని తీసుకుంటాడు. అప్పుడు అతని మిత్రులు అతని దుస్థితి చూసి నేత్రవైద్యం చేయిస్తారు. అతనికి చూపు వస్తుంది. అప్పుడు అతను తాను ఇంతకాలం కప్పుకున్న వస్త్రం మురికిది అని తెలుసుకుంటాడు. దాన్ని ఏం చేస్తాడు మాగందియా?" అని ప్రశ్నించాడు బుద్ధుడు.

మాగందియుడు కొద్దిసేపు మౌనం వహించాడు.

నెమ్మదిగా– "శ్రీమాన్ గౌతమా! మురికి అంటిన ఆ వస్త్రాన్ని వదిలివేస్తాడు. కప్పుకోడు" అన్నాడు.

"నేను ఏది శరీరానికీ, మనస్సుకీ ఆరోగ్యమో ఆ ధర్మాన్ని చెప్తాను. దుఃఖాన్ని దూరం చేసే దారిని చూపిస్తాను. అతి గొప్పదైన నిర్వాణ గమ్యానికి చేర్చే సద్ధర్మం బోధిస్తాను. నీవు సత్యాన్ని, జ్ఞానాన్ని దర్శిస్తే... గుడ్డితనం వదిలిపోయినట్లు. నేను చెప్పినట్లు గుడ్డితనం వదలనివాడు తిరిగి మురికి వస్త్రాలే ధరిస్తాడు. వదిలినవాడు ఆ మలిన వస్త్రాల్ని త్యజిస్తాడు. మనస్సులోని మలినాల్ని తొలగించుకుంటే ధర్మదర్శనం అవుతుంది" అని చెప్పాడు.


"అయ్యో! భగవాన్! నేను ఇంతకాలం అహంకారంతో అజ్ఞానాన్ని, దుఃఖాన్ని పట్టుకుని వేలాడాను. ఏది ఆరోగ్యమో? ఏది దుఃఖ విమోచనమో గ్రహించాను" అంటూ వంగి బుద్ధుని పాదాలంటి నమస్కరించాడు.

బుద్ధుడి అనుయాయిగా మారాడు. జీవితాంతం బుద్ధబోధల్ని ప్రచారం చేశాడు. మహాజ్ఞానిగా రాణించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

శంకరులు చెప్పిన చరమకాంక్ష




గంగాదేవి ఎంత గొప్పదంటే... 'మాతా జాహ్నవీ దేవీ !' అని సంబోధించారు ఆది శంకరులు. గంగాష్టకం చేస్తూ.."మాతర్జాహ్నవి శంభూసంగమిలితే మౌషా నిధాయాఞ్జలిం/ త్వత్తీరే వపుషో వాసనసమయే నారాయణాంఘ్రిద్వయమ్ / సనన్దమ్ స్మరతో భవిష్యతి మమ ప్రాణప్రయాణోత్సవే / భూయాద్భక్తిరవిచ్యుతా హరిహరాద్వైతాత్మికా శాశ్వతీ" అన్నారు. అమ్మా! అని పిలిచారు. నా శరీరం నుంచి ప్రాణాలు ఊర్ధ్వముఖమై పోతుంటాయి.

ఏదో ఒక సమయంలో శరీరం విడిచి పెట్టాలి కదా! "జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ /తస్మాదపరిహార్యే ర్థేన త్వం శోచితుమర్హసి"పుట్టినవాడు శరీరాన్ని వదిలిపెట్టక తప్పదు. అమ్మా! నా శరీరాన్ని వదిలిపెట్టేటప్పుడు నీ ఒడ్డున నిలబడి నా రెండు చేతులు తలమీద పెట్టి అంజలి ఘటించి నీవంక చూస్తూ.... నా ప్రాణాలు పైకి వెళ్ళిపోతుంటే... మిగిలిన వాళ్ళందరూ ఏడ్వ వచ్చుగాక! కానీ నాకు అది ఉత్సవం కావాలి" అన్నారు. భగవంతుడు లోపలినుంచి బయటికి ఉత్సవమూర్తిగా వస్తుంటే పరమానందంతో రెండు చేతులెత్తి నమస్కరించి ఎగిరెగిరి చూసినట్లు – నా ప్రాణాలు పైకి లేచిపోతుంటే – అమ్మా నేను ఆనందపడిపోవాలి. ఇంతకాలం ఎవరి పాదాలు పట్టి స్మరించానో ఎవరి గురించి చెప్పుకున్నానో వారి పాదపంజరం లోకి వెళ్ళిపోతున్నా.. ఈ శరీరం వదిలి పెట్టేస్తున్నా..... అని .. చెమటపట్టిన బట్టను ఎంత తేలిగ్గా వదిలేస్తామో, అంత తేలిగ్గా నా శరీరాన్ని వదిలిపెట్టేస్తూ, నా తల మీద నారాయణ మూర్తి పాద ద్వయాన్ని స్మరిస్తూ శివకేశవుల మధ్య భేదం లేకుండా బతికిన నేను చిట్టచివరన శరీరం విడిచిపెట్టేటప్పుడు 'అమ్మా! నిన్ను చూడాలి' అని అంటారు.

గంగమ్మ వైభవాన్ని గురించి చెబుతూ ఆయన... "ఆదావాది పితామహస్య నియమవ్యాపార పాత్రే జలం/ పశ్చాత్పన్నగ శాయినో భగవతః పాదోదకం పావనమ్ / భూయః శంభుజటా విభూషణ మణిర్జహ్నోర్మహర్షే రియం / కన్యా కల్మషనాశినీ భగవతీ భాగీరథీ దృశ్యతే" అన్నారు. ఆమె మొట్టమొదట శ్రీమహావిష్ణువు పాదాలను కడగడానికి పనికొచ్చింది. బ్రహ్మ సృష్టికర్త. ఆయన తన కమండలంలోని నీటితో విష్ణువు పాదాన్ని కడిగారు. అంటే ఆ కమండలంలో ఉన్నది గంగే. తరువాత శంభుని తలమీద పడింది. తరువాత జహ్ను మహర్షి తాగి తాను మళ్ళీ విడిచి పెట్టాడు. అలా ఋషి స్పర్శ పొందింది. అటువంటి గంగమ్మా! నా పాపాలన్నీ తొలగించు.. అని వేడుకున్నారు.

దీక్షితార్ వారు దీనినంతటినీ దృష్టిలో పెట్టుకుని గంగే మాం పాహి.. గిరీశ శిరస్థితే... అన్నారు తన కీర్తనలో. గంగ శివుని తలను తాకింది.. ఎలా? వినయంతో తాకిందా !!! నిజానికి పైనుంచి పడిపోయేటప్పుడు చాలా అహంకారంతో పడింది. 'ఈడ్చి అవతల పారేస్తాను పాతాళానికి..' అంటూ పడింది. అలా పడుతుంటే పరమ శివుడు..'ఇంత అహంకరిస్తోంది గంగ. ఎలా వెళ్ళిపోతుందో, నన్నెంత లాగేస్తుందో చూస్తా..' అనుకుంటూ.. పాండురంగడు నిలుచున్నట్లు నడుం మీద రెండు చేతులు పెట్టుకుని పైకి చూస్తూ నిలుచున్నాడు. పైనుంచి గంగ పడంగానే జుట్టుతో కట్టేసాడు.. జటాజూటంలో. అలా దానిలోకి ఏళ్లతరబడి అలా పడుతూనే ఉంది.

శాస్త్రాలుగానీ మరేదయినా గానీ చదువుకోని దీక్షితార్ వారు చిన్న చిన్న పదాలతో చాలా గంభీరమైన భావాల్ని తన కీర్తనల్లో అద్భుతంగా పలికించారు. అదంతా గురువుల శుశ్రూష ఫలితంగా అబ్బిన విద్యాగంధం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా



● నాగ చైతన్య

దసరాకు తండేల్!

దసరా పండక్కి థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అవుతున్నారట 'తండేల్'. హీరో నాగచైతన్య, దర్శకుడు చందు మొండేటి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం ఇది. ఈ చిత్రంలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. కాగా 'తండేల్' సినిమాను ఈ ఏడాది దసరా సందర్భంగా విడుదల చేసే ఆలోచన చేస్తున్నారట దర్శకుడు చందు మొండేటి. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెల్లడికానుందని సమాచారం. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



● రష్మికా మందన్నా



● ప్రభాస్

ఇట్స్ రొమాంటిక్ టైమ్!

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సైంటిఫిక్ అండ్ ఫ్యూచరిస్ట్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనె, దిశా పటానీ, అన్నాబెన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు రాజమౌళి, హీరోలు విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ కీలక పాత్రల్లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. కాగా ఈ మూవీకి సంబంధించిన మేజర్ షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో సినిమాలోని ప్రధాన తారాగణమంతా పాల్గొంటారని తెలిసింది. ప్రస్తుతం ప్రభాస్, దిశాపటానీ కాంబి నేషన్‌లో ఓ రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట దర్శకుడు నాగ్‌అశ్విన్. ఈ సాంగ్ పూర్తయిన తర్వాత కొంత టాకీ పార్టు, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ప్లాన్ చేశారట. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కానుంది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

క్రైమ్ థ్రిల్లర్



● రాశీ సింగ్, రాజ్ కందుకూరి

"కలర్ ఫోటో' చిత్రానికి ముందు 'మను చరిత్ర' సినిమాలో శివ స్నేహితుడిగా చేశాను. నిర్మాత రాజ్ కందుకూరిగారు నన్ను కూడా తన కుమారుడు శివలానే చూసుకునే వారు. నేను హీరో కాకముందే నన్ను ఓ హీరోలా చూశారాయన. 'భూతద్ధం భాస్కర్ నారాయణ'లోని 'శివ ట్రాప్ ట్రాన్స్..' పాట అద్భుతంగా ఉంది. ఈ సినిమాని అందరూ చూడాలి" అని హీరో సుహాస్ అన్నారు. శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ మూవీ మార్చి 1న విడుదల అవుతోంది. శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'శివ ట్రాప్ ట్రాన్స్..' అనే పాటని సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణీ లాంచ్ చేశారు. అనంతరం నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి సుహాస్ ముఖ్య అతిథిగా హాజరై, పాట రిలీజ్ చేశారు. చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించిన ఈ పాటని కాలభైరవ పాడారు. "మా సినిమాని తప్పకుండా ఎంజాయ్ చేస్తారు" అన్నారు శివ కందుకూరి. "యునిక్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది" అన్నారు పురుషోత్తం రాజ్. "మా మూవీ అందరికీ నచ్చుతుంది" అన్నారు స్నేహాల్, శశిధర్, కార్తీక్. ఈ వేడుకలో దర్శకుడు విజయ్ కనకమేడల, హీరోయిన్ వర్ష బొల్లమ్మ, నిర్మాత రాజ్ కందుకూరి, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల పాల్గొన్నారు.

తృటిలో తప్పించుకున్నాం!

చావు నుంచి తృటిలో తప్పించుకున్నామని చెబుతున్నారు హీరోయిన్ రష్మికా మందన్నా. అసలు విషయం ఏంటంటే... ఇటీవల ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చేందుకు రష్మికా మందన్నా ఓ విమానంలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఈ విమానంలోనే మరో హీరోయిన్ శ్రద్ధాదాస్ కూడా ఉన్నారు. అయితే విమానం టేకాఫ్ అయిన అరగంటలోపే ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి ముంబైలోనే అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఆందోళనకరమైన ఘటనను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు రష్మికా మందన్నా. 'చావు నుంచి మేం తృటిలో తప్పించుకున్నాం' అనే క్యాప్షన్‌తో శ్రద్ధాదాస్‌తో ఉన్న ఫోటోను షేర్ చేశారు రష్మికా మందన్నా. ప్రస్తుతం ఈ ఫోటో వైరల్ అవుతోంది. కాగా ఇదే ఘటనపై హీరోయిన్ శ్రద్ధాదాస్ కూడా స్పందించారు. "విమానంలో వందమందికిపైగా ప్రయాణికులున్నారు. మేం దాదాపు చనిపోతామనే భావన కలిగింది. కానీ, పైలెట్ సరైన నిర్ణయం తీసుకుని అత్యవసర ల్యాండింగ్ చేశారు" అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు శ్రద్ధాదాస్.



● శ్రద్ధా దాస్‌తో...

ఇంద్రాణి ట్రైలర్ బాగుంది - మణిశర్మ

"'ఇంద్రాణి' సినిమా ట్రైలర్ చాలా బాగుంది. పాటలు కూడా బాగున్నాయి. సాయి కార్తీక్ అద్భుతమైన సంగీతం ఇచ్చాడు. సరికొత్త కథాంశంతో రూపొందిన 'ఇంద్రాణి' చిత్రం విజయం సాధించాలి" అని ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. యానియా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఇంద్రాణి'. స్టీఫెన్ పల్లం దర్శకత్వంలో వెరోనికా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై స్టాన్లీ సుమన్ బాబు నిర్మించారు. సుధీర్ వేల్పుల, ఓఓ రెడ్డి, జైసన్, కేకే రెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ మూవీ ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ– "అమెరికాలో ఉంటూ ఇక్కడ సినిమా నిర్మించడం ఎంత కష్టమో నాకు తెలుసు. సినిమా మీద ప్యాషన్ ఉంటే తప్ప అది సాధ్యం కాదు. 'ఇంద్రాణి' విజయం సాధించాలి" అన్నారు. "అన్ని వాణిజ్య అంశాలున్న సైన్స్‌ఫిక్షన్ థ్రిల్లర్ ఇది. రాబోయే 50 సంవత్సరాల్లో ఇండియా సాంకేతిక పరంగా ఎంత ముందుంటుంది? అనేది ఈ సినిమాలో చూపించాం" అన్నారు స్టీఫెన్ పల్లం. ఈ వేడుకలో చిత్ర సంగీత దర్శకుడు సాయి కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: స్టాన్లీ పల్లం, కెమెరా: చరణ్ మాధవనేని.



● మణిశర్మ, యానియా భరద్వాజ్


నా కుటుంబమే నా బలం



● వరుణ్ ధావన్, నటాషా దలాల్

బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ ఓ శుభవార్తను షేర్ చేశారు. తాను తండ్రి అయిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "మేం తల్లిదండ్రులయ్యాం. మీ ఆశీర్వాదాలు కావాలి. మై ఫ్యామిలీ మై స్ట్రెంత్ (నా కుటుంబమే నా బలం)" అంటూ తన భార్య నటాషాదలాల్ ప్రెగ్నెన్సీతో ఉన్న ఫోటోను షేర్ చేశారు వరుణ్‌ధావన్. ఫ్యాషన్ డిజైనర్, మోడల్ నటాషా దలాల్‌ను 2021 జనవరిలో వరుణ్ వివాహం చేసుకున్నారు. హిందీలో ప్రస్తుతం 'బేబీ జాన్' సినిమా చేస్తున్నారు వరుణ్ ధావన్. అలాగే ఆయన నటించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ ఈ ఏడాది వేసవిలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఇందులో సమంత ఓ లీడ్ రోల్ చేశారు.

సరికొత్త ప్రేమ కథ



● వైష్ణవీ సింగ్, ఉదయ్ రాజ్


ఉదయ్ రాజ్, వైష్ణవీ సింగ్ జంటగా రాజేష్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్‌పై యం. బంగార్రాజు నిర్మించిన ఈ సినిమా వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. రాజేష్ చికిలే మాట్లాడుతూ– "1990 నేపథ్యంలో సాగే టీనేజ్ లవ్‌స్టోరీ 'మధురం'. సరికొత్త ప్రేమ కథతో రూపొందిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, గొడవలు ఎలా ఉండేవో నేటి తరానికి కళ్లకు కట్టినట్లు మా చిత్రంలో చూపిస్తున్నాం" అన్నారు. "విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. నా పాత్ర ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది" అన్నారు ఉదయ్ రాజ్. "మా మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు యం. బంగార్రాజు. ఈ సినిమాకు సంగీతం: వెంకీ వీణ.

సమాజం కోసం రికార్డ్ బ్రేక్

నిహార్, నాగార్జున, రగ్దా ఇఫ్తాకర్, సత్య కృష్ణ, సంజన, తుమ్మల ప్రసన్న కుమార్, శాంతి తివారీ, సోనియా, కాశీ విశ్వనాథ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్‌పై చదలవాడ పద్మావతి నిర్మించారు. ఈ సినిమా గ్లింప్స్‌ని 'మాతృదేవోభవ' ఫేమ్ దర్శకుడు అజయ్ కుమార్, టీజర్‌ని నిర్మాత రామ సత్యనారాయణ, ట్రైలర్‌ని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి. ప్రసన్నకుమార్ విడుదల చేశారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ–"వేటగాడు, అడవి రాముడు, దేవదాసు' వంటి సినిమాల స్ఫూర్తితో ఇండస్ట్రీలో అడుగు పెట్టాను. ఇప్పటి వరకు నాకున్న అనుభవంతో సమాజానికి ఉపయోగపడే ఓ మంచి కథతో సినిమా తీయాలని 'రికార్డ్ బ్రేక్' తీశా. ఇందులో చివరి 45 నిమిషాలు చాలా భావోద్వేగాలు ఉంటాయి. ఈ సినిమాకి విజయం అందించాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులు నిహార్ కపూర్, రగ్ద ఇఫ్తాకర్, సత్య కృష్ణ, సంజన, సోనియా, నాగార్జున, కథా రచయిత అంగిరెడ్డి శ్రీనివాస్, మ్యూజిక్ డైరెక్టర్ సాబు వర్గీస్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కంతేటి శంకర్, నిర్మాణం: చదలవాడ బ్రదర్స్.



● సోనియా, రగ్దా ఇఫ్తాకర్


‘ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 329

సోమవారం 19-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



434 పరుగుల తేడాతో..

మూడో టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ బ్రహ్మాండ విజయం -10లో



ఆసియా క్వీన్స్..

ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత మహిళల జట్టుకు స్వర్ణం -10లో



అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు హాజరైన అశేష జన సముద్రంలో ఓ భాగం

తెలంగాణ అభివృద్ధికి మెగా ప్లాన్



విజన్–2050 దిశగా ముందుకు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గత పాలకుల పకడ్బందీ ప్రణాళికలతో హైదరాబాద్ అభివృద్ధి

- మెట్రోపాలిటన్ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యం..
- నగర శివార్లు అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాలుగా అభివృద్ధి
- చైనా తరహాలో 10 నుంచి 15 శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు
- ఫార్మాసిటీ ఒకేచోట కాకుండా ఫార్మా విలేజీలు
- ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ భవనం ప్రారంభించిన సీఎం

హఫీజ్‌పేట్ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విజన్–2050 దిశగా ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత 30 ఏళ్లుగా రాజకీయాలు ఎలా ఉన్నా అప్పట్లో పనిచేసిన సీఎంలు చంద్రబాబు, రాజశేఖరరెడ్డి, కేసీఆర్‌లు గత ప్రభుత్వాల నిర్ణయాలను మరింత పకడ్బందీ ప్రణాళికలతో అమలు చేయడం వల్లే ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం, హైటెక్ సిటీ వంటివి అందుబాటులోకి వచ్చాయని అన్నారు. దేశమే కాకుండా ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసే పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్


మిగతా 2వ పేజీలో ▶

200 యూనిట్లూ ఫ్రీ కాదు

‘గృహజ్యోతి’ కింద గతేడాది సగటు వినియోగానికి అదనంగా 10 శాతమే కరెంట్ ఉచితం

2022-23లో నెలకు 80 యూనిట్లు వాడితే ఇప్పుడు 88 యూనిట్లే ఫ్రీ..

- అనుమతించిన పరిమితికి లోబడి వాడకం ఉంటేనే జీరో బిల్లులు
- అదనపు విద్యుత్‌కు బిల్లు కట్టాల్సిందే
- 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ సరఫరాకు గరిష్ట పరిమితి మాత్రమే
- 2022–23లో సగటున నెలకి 200 యూనిట్లలోపు వాడితే అర్హులే
- వాడకం 200 యూనిట్లకు దాటితే ఉచితం వర్తించదు..



మార్చి 1 నుంచి పథకం అమలుకు మార్గదర్శకాలు సిద్ధం!

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ‘గృహజ్యోతి’ పథకం కింద ప్రతి కుటుంబానికి కచ్చితంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా జరగదా? అర్హత గల ప్రతి కుటుంబం నిర్దిష్ట యూనిట్ల మేరకే ఉచిత విద్యుత్‌ను పొందుతుందా? గత ఏడాది విద్యుత్ వినియోగాన్ని ఇందుకోసం పరిగణనలోకి తీసుకుంటున్నారా? పథకం అమలుకు ఇంధన శాఖ సిద్ధం చేసిన మార్గదర్శకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయా? అంటే.. అవుననే సమాధానమే లభిస్తోంది. నెలవారీ ఉచితంగా అనుమతించే వినియోగం (ఫ్రీ మంత్లీ ఎలిజిబుల్ కన్‌జంప్షన్ (ఎంఈసీ) పేరిట ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనున్నట్టు తెలుస్తోంది. మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం అమల్లోకి రానుంది. దీంతో ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు రెడీ అయ్యాయి.

తొలి విడతలో 34 లక్షల గృహాలకు..

ప్రజాపాలన కార్యక్రమం కింద గృహజ్యోతి పథకం అమలు కోసం 1,09,01,255 దరఖాస్తులు రాగా, అందులో 64,57,891 దరఖాస్తుదారులు ఆధార్‌తో అనుసంధానమై ఉన్న తెల్ల రేషన్‌కార్డును కలిగి ఉన్నారని రాష్ట్ర ఐటీ శాఖ నిర్ధారించింది. వీరిలో 34,59,585 మంది దరఖాస్తుదారులు మాత్రమే గృహ విద్యుత్ కనెక్షన్ కలిగి ఉండడంతో తొలి విడత కింద వీరికే గృహజ్యోతి వర్తింపజేయనున్నారు. ప్రస్తుత విద్యుత్ టారిఫ్ ప్రకారం..గృహజ్యోతి పథకం అమలుకు ఏటా రూ.4,164.29 కోట్ల వ్యయం కానుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనా వేసింది.

అధికంగా వాడితే వాతలే!: ఈ మార్గదర్శకాల ప్రకారం..200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాకు షరతులు వర్తించనున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తుందని భావించి

మిగతా 2వ పేజీలో ▶

డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు

అంగన్‌వాడీల పెండింగ్ వేతనాలు చెల్లిస్తాం

ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకొస్తా

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల

భద్రాచలం అర్బన్: డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు అందించి సంఘాలు బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క భరోసా ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఎంతోకాలంగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలోనే విడుదల చేస్తామని ఆయన హామీనిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో పలు సమస్యలతో సహజీవనం సాగిస్తున్న గిరిజనులకు అన్ని విధాలా లబ్ధి చేకూర్చేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. 19 నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆదివారం జరిగిన భద్రాచలం ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో భట్టివిక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ హయాంలో ఐటీడీఏ పూర్తిగా నిర్వీర్యం అయిందని, దీనికి

మిగతా 2వ పేజీలో ▶



సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం జగన్

మంచి పాలనకు మళ్లీ ‘సిద్ధం’

రాప్తాడు సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్ పిలుపు 5లో

ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలి. సైకిల్ ఎప్పుడూ బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాసు ఎప్పుడూ సింక్‌లోనే ఉండాలి.

- ముఖ్యమంత్రి జగన్

మహిళలు లేకపోతే పురుషులతో భర్తీ

- ప్రభుత్వ ఉద్యోగాలకు హారిజాంటల్ రిజర్వేషన్ల అమల్లో సవరణ 2లో

పేపర్ లీక్‌లు ఉండొద్దు..

అధికారులకు సర్కార్ ఆదేశం

- పారదర్శకంగా, పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలని స్పష్టీకరణ
- ముందస్తు చర్యలపై ఇంటర్ బోర్డ్ దృష్టి.. సమీక్షల్లో టెన్త్ పరీక్షల విభాగం.. ఆరోపణలున్న అధికారులకు నో వర్క్
- ప్రశ్నపత్రం నుంచి మూల్యాంకనం వరకూ పటిష్ట ఏర్పాట్లు

3లో

‘ధూపదీప నైవేద్యం’ ఎలా?

- గౌరవ భృతి అందక అర్చకుల ఇబ్బందులు.. దేవాలయాల్లో నిత్య పూజలకూ తప్పని కష్టాలు
- రేపు చలో సచివాలయానికి అర్చకుల పిలుపు

వివరాలు 3లో

నవ భారత్ నిర్మిద్దాం

లక్ష్య సాధన కోసం అహర్నిశలూ శ్రమిద్దాం

- ‘అబ్‌కీ బార్ చార్‌సౌ పార్’ మిషన్‌తో పనిచేద్దాం.. ఎన్డీఏకు 400 సీట్లు వస్తాయని విపక్షాలు నినదిస్తున్నాయి
- కాంగ్రెస్ నుంచి దేశాన్ని, యువతను కాపాడాలి.. బీజేపీ మళ్లీ రావాలని చాలా దేశాలు కోరుకుంటున్నాయి
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పార్టీ శ్రేణులకు ప్రధాని మోదీ వెల్లడి



వివరాలు 6లో

‘‘రాబోయే వంద రోజుల్లో ప్రతి కొత్త ఓటరు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుడిని పలకరించాలి. ప్రతి ఇంటికి వెళ్లాలి. అందరి విశ్వాసాన్ని పొందాలి. బీజేపీకి అత్యధిక సీట్లు వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలి. బీజేపీకి సొంతంగా 370కి పైగా స్థానాలు, ఎన్డీఏకి ‘అబ్‌కీ బార్ చార్‌సౌ పార్’ మిషన్‌తో పనిచేద్దాం. ఇకపై భారత్ స్వప్నాలు, సంకల్పాలు విశాలమైనవిగా ఉంటాయి. ఈ పదేళ్లలో ఒక మైలురాయిని మాత్రమే చేరాం. గమ్యాన్ని చేరుకుంటామనే విశ్వాసం ఉంది. కోట్లాది మంది ప్రజల జీవితాలను మార్చాల్సి ఉంది. తీసుకోవాల్సిన నిర్ణయాలు చాలా ఉన్నాయి’’

-ప్రధాని మోదీ

రేపటి నుంచే బీజేపీ రథయాత్రలు

నేడు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రచారవాహనాలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పూజలు.. 5 క్లస్టర్లుగా 16 ఎంపీ సెగ్మెంట్ల పరిధిలో... హాజరుకానున్న బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు 2లో

విపక్ష కూటమిలో 2జీ, 3జీ, 4జీ పార్టీలు

మూడోసారీ మోదీయే: అమిత్ షా



జేపీ నడ్డా కొనసాగింపు 6లో



వద్దుసార్! గత ఎన్నికల్లో తొక్కిన తొక్కుడికే ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నాం!

విద్యార్థినుల ఆత్మహత్యల కలకలం!

హైదరాబాద్‌లో ఇమాంపేట గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య

- వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరి బలవన్మరణం.. బాలికల మరణాలకు అంతుచిక్కని కారణాలు
- వరుస ఘటనలతో విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

5లో

చేజారిన తోడే.. బొడ్డుతాడై..

- ఉక్రెయిన్ యుద్ధానికి వేలాదిగా బలవుతున్న జవాన్లు
- వారి వీర్యం/అండంతో పిల్లల్ని కంటున్న భాగస్వాములు

6లో

విలీనం లేదు.. వేతన సవరణ ఊసే లేదు!



ఆర్టీసీ పెండింగ్ అంశాలపై దృష్టిపెట్టని ప్రభుత్వం

బడ్జెట్‌లోనూ ప్రస్తావించలేదు | కొత్త బస్సుల ప్రారంభ వేడుకలోనూ సీఎం ఆ సంగతి మాట్లాడలేదు

ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ.. కార్మిక సంఘాల్లో ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: ‘ఇటు ప్రభుత్వంలో ఉద్యోగుల విలీనంపై స్పష్టత లేదు.. అటు బకాయి ఉన్న రెండు వేతన సవరణల జాడ లేదు’ ఆర్టీసీకి సంబంధించి ఈ కీలక అంశాలకు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా చోటు దక్కకపోవడం చర్చనీయాంశమైంది. బడ్జెట్‌లో ప్రతిపాదించటం ద్వారా శుభవార్త అందుతుందని ఎదురు చూసిన ఆర్టీసీ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన వెంటనే నెక్లెస్ రోడ్డు సమీపంలో వంద ఆర్టీసీ కొత్త బస్సులను స్వయంగా ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో ఆ కార్యక్రమంపై కూడా ఆర్టీసీ ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ సందర్భంగా కూడా కేవలం 2013 వేతన సవరణకు సంబంధించి బకాయి ఉన్న బాండ్ల మొత్తం విడుదల ప్రకటన తప్ప ప్రధాన అంశాలను కనీసం మాట వరసకు కూడా ప్రస్తావించకపోవటంతో ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా ఆర్టీసీ పెండింగు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

పసుపు బోర్డు ఏర్పాటు చేయండి

కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



సాక్షి, హైదరాబాద్: జాతీయ పసుపు బోర్డును రాష్ట్రంలో వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు పసుపు రైతుల చిరకాల ఆకాంక్ష అని పేర్కొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికలలో పసుపు రైతులు పెద్ద ఎత్తున నిజామాబాద్ ఎంపీ స్థానానికి నామినేషన్లు వేసి నిరసన తెలిపారని ఆ లేఖలో గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు గెజిట్ విడుదల చేసిందని తెలిపారు. కానీ ఆ గెజిట్‌లో ఎక్కడా పసుపు బోర్డు ఏర్పాటు చేసే ప్రదేశం లేదా దానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదన లేవని వివరించారు. కేవలం కమిటీ సభ్యుల నియామకానికి సంబంధించిన వివరాలను మాత్రమే గెజిట్‌లో పేర్కొన్నారని తుమ్మల పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

టీఈఏ అధ్యక్షురాలు జి.నిర్మల



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) అధ్యక్షురాలు జి.నిర్మల డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులివ్వాలని ఆమె కోరారు. టీఈఏ నేతృత్వంలో హైదరాబాద్‌లో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ (ఏఐఎస్‌జీఈసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీఈఏ డైరీని ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షురాలిగా కొత్తగా ఎన్నికైన నిర్మల కీలకోపన్యాసం చేశారు. 317 జీవో ద్వారా నష్టపోయిన, సీపీఎస్ వల్ల ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల తరపున పోరాడేందుకు సిద్ధమని తెలిపారు. ఇంతకాలం సంఘానికి అధ్యక్షుడిగా కొనసాగిన చిలగాని సంపత్‌కుమార్ సేవలను కీర్తిస్తూ సమావేశం తీర్మానించింది.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

సీఎంకు ఎంపీ కృష్ణయ్య లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను పూర్తిస్థాయిలో మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 6వేల పాఠశాలలు మూతబడ్డాయని పేర్కొన్నారు. వాటిని పునఃప్రారంభించి అక్కడి ఖాళీ పోస్టులను కూడా మెగా డీఎస్సీలో భర్తీ చేయాలని కోరారు. మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తే దాదాపు 50 వేల ఉద్యోగ నియామకాలు పూర్తి చేయవచ్చని సూచించారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన హర్షణీయమని పేర్కొన్నారు. ఈమేరకు ఆర్.కృష్ణయ్య ఆదివారం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

అంతర్రాష్ట్ర పరస్పర బదిలీలకు అనుమతినివ్వండి

ఆంధ్ర, తెలంగాణ స్థానిక ఉపాధ్యాయుల వినతి



గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి, హైదరాబాద్: అంతర్రాష్ట్ర పరస్పర బదిలీలకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినివ్వాలని నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఎన్ఎల్‌టీఏ), తెలంగాణ నేటివ్ ఎంప్లాయిస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర అసోసియేషన్ (టీఎన్ఈడబ్ల్యూఎస్ఏ)లు కోరాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఫైల్‌ను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశాయి. రాష్ట్ర విభజన సమయంలో ఆప్షన్ లేని 1,369 మంది ఉపాధ్యాయులు తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు 1,806 మంది ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సి ఉందని, ఇందుకు ఏపీ ప్రభుత్వం అనుమతినిచ్చినప్పటికీ గత తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని తెలిపాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వీలున్నంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

200 యూనిట్లూ ఫ్రీ కాదు

▶ మొదటి పేజీ తరువాయి

గతానికి భిన్నంగా ఇష్టారాజ్యంగా వినియోగాన్ని పెంచేసుకుంటే, ఆ మేరకు అదనపు వాడకానికి బిల్లులు చెల్లించక తప్పదు. గత ఆర్థిక సంవత్సరం అంటే 2022–23లో నెలకు సగటున వాడిన విద్యుత్‌కు అదనంగా 10 శాతం విద్యుత్‌ను మాత్రమే గృహ జ్యోతి పథకం కింద ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయనుంది. నెలకు 200 యూనిట్ల గరిష్ట పరిమితికి లోబడి ఈ పథకం అమలు కానుంది. ఉదాహరణకు 2022–23లో ఒక కుటుంబ వార్షిక విద్యుత్ వినియోగం 960 యూనిట్లు అయితే, సగటున నెలకు 80 యూనిట్లు వాడినట్టు నిర్ధారిస్తారు. అదనంగా మరో 10 శాతం అంటే 8 యూనిట్లను కలిపి నెలకు గరిష్టంగా 88 యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే ఆ కుటుంబానికి ఉచితంగా సరఫరా చేయనున్నారు. 88 యూనిట్లకు మించి వాడిన విద్యుత్‌కు సంబంధిత టారిఫ్ శ్లాబు లోని రేట్ల ప్రకారం బిల్లులు జారీ చేయనున్నారు.

గతేడాది 2,400 యూనిట్లు మించితే అనర్హులే

ఒక వేళ 2022–23లో సగటున నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వాడినట్లైతే ఈ పథకం వర్తించదు. వార్షిక విద్యుత్ వినియోగం 2,400 యూనిట్లు మించిన వినియోగదారులు ఈ పథకానికి అర్హులు కారు. ఇక నెలకు అనుమతించిన పరిమితి (ఎంఈసీ) మేరకు ఉచిత విద్యుత్‌ను



వాడిన వినియోగదారులకు 'జీరో' బిల్లును జారీ చేయనున్నారు. అంటే వీరు ఎలాంటి చెల్లింపులూ చేయాల్సిన అవసరం ఉండదు.

200 యూనిట్లు దాటితే ఉచితం వర్తించదు

ఒక వేళ వినియోగం అనుమతించిన పరిమితికి మించినా, గరిష్ట పరిమితి 200 యూనిట్లలోపే వాడకం ఉండాలి. ఇప్పుడు కూడా అదనంగా వాడిన విద్యుత్‌కు సంబంధించిన బిల్లును సంబంధిత టారిఫ్ శ్లాబు ప్రకారం జారీ చేస్తారు. ఒక వేళ నెల వినియోగం 200 యూనిట్లకు మించితే మాత్రం వాడిన మొత్తం కరెంట్‌కు బిల్లును యథాతథంగా జారీ చేస్తారు. ఎలాంటి ఉచితం వర్తించదు.

బిల్లులు బకాయిపడినా నో

విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాల్సిన వినియోగదారులకు గృహజ్యోతి పథకం వర్తించదు. బకాయిలన్నీ చెల్లించిన తర్వాతే పథకాన్ని వర్తింపజేస్తారు. గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత బిల్లులను చెల్లించకుండా బకాయి పడిన వారికి సైతం పథకాన్ని నిలుపుదల చేస్తారు. బిల్లులు చెల్లించాకే మళ్లీ పథకాన్ని పునరుద్ధరిస్తారు.

తెల్లకార్డు ఉంటేనే అర్హులు

ఈ పథకం కింద తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబం గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వాడుకోవడానికి అర్హత కలిగి ఉంటుంది. రేషన్‌కార్డు ఆధార్‌తో అనుసంధానమై ఉండాలి. లబ్ధిదారులు దరఖాస్తులో పొందుపరిచిన గృహ విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్‌ను రేషన్‌కార్డుతో అనుసంధానం చేస్తారు. రేషన్‌కార్డుతో విద్యుత్ కనెక్షన్‌ను అనుసంధానం చేసినా, విద్యుత్ కనెక్షన్ ఎవరి పేరు మీద ఉందో వారి పేరు మీదే బిల్లింగ్ జరుగుతుంది. ఇప్పటికే నెలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లబ్ధి పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు కూడా గృహజ్యోతి వర్తించనుంది. గృహజ్యోతి పథకం కింద ఒక నెలకు సంబంధించిన సబ్సిడీలను తదుపరి నెలలోని 20వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు చెల్లించాల్సి ఉంటుంది.

ఇవాళ ఇక్కడికి.. రేపు ఎక్కడికో

సివిల్ డీఎస్పీల బదిలీల జాతరలో గందరగోళం

- మూడు రోజుల వ్యవధిలోనే పోస్టింగ్‌లలో అనూహ్య మార్పులు
- రాజకీయ ఒత్తిళ్లు కారణమనే వాదనలు



సాక్షి, హైదరాబాద్: ఐపీఎస్‌లు మొదలు డీఎస్పీల వరకు ఇటీవల పోలీస్‌శాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. అయితే సివిల్ డీఎస్పీల పోస్టింగ్‌లు మారుస్తూ జరిగిన వరుస బదిలీలు మాత్రం చర్చనీయాంశమయ్యాయి. ఈ నెల 12న ఏకంగా 110 మంది సివిల్ డీఎస్పీలు, 14వ తేదీన మరో 95మంది, 15న మరో 26 మంది సివిల్ డీఎస్పీలను బదిలీ చేశారు. ఆ తర్వాత ఈనెల 17న వెల్లడైన ఉత్తర్వుల్లోనూ మరో 61 మంది సివిల్ డీఎస్పీలను బదిలీ చేశారు. ప్రతిశాఖలోనూ బదిలీల ప్రక్రియ అత్యంత సహజమే అయినా, ఒకసారి ఇచ్చిన పోస్టింగ్ మారుస్తూ...లేదంటే అప్పటికే ట్రాన్స్‌ఫర్ చేసిన వారిని తిరిగి అక్కడే కొనసాగి స్తున్నట్టు పేర్కొంటూ వరుస ఉత్తర్వులు వెలువడుతుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

'పట్టు'నిలుపుకుని.. 'అనుకూల'పోస్టింగ్‌లు

కొందరు అధికారులు బదిలీ అయినా తమ 'పట్టు'నిలుపుకొని తిరిగి అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. మరికొందరు బదిలీ అయిన స్థానంలో చేరకముందే రోజుల వ్యవధిలోనే 'అనుకూల'పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఒకేసారి పెద్ద సంఖ్యలో బదిలీ జరిగినప్పుడు కొద్దిమేర పోస్టింగ్‌ల్లో మార్పులు సహజమే కానీ గత మూడు రోజుల్లో విడుదల చేసిన పోస్టింగ్ ఉత్తర్వులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయని పోలీసు వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.

ఎప్పుడు ఎక్కడికో అనే ఆందోళనలో కొందరు

ఒక రోజు వచ్చిన ఆర్డర్ కాపీలో ఉన్న పోస్టింగ్‌లు ఆ తర్వాతి బదిలీ ఉత్తర్వులు వచ్చే సరికి మారిపోతుండడం కొంతమందిని మాత్రం కలవరానికి గురి చేస్తోంది. ఎప్పుడు ఎక్కడికి బదిలీ అవుతామో..అక్కడి నుంచి మళ్లీ ఎక్కడికి మారుస్తున్నారో అన్న గందరగోళం నెలకొందని కొందరు అధికారులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగిన వారికే మళ్లీ కీలకస్థానాల్లో పోస్టింగ్‌లు దక్కుతున్నాయన్న చర్చ జరుగుతోంది. 'పోలీసులపై రాజకీయ పెత్తనం ఉండబోదు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఐపీఎస్ ఆఫీసర్ల గెట్ టు గెదర్‌లో చెప్పినా, వాస్తవ పరిస్థితి మాత్రం అలా లేదని కొందరు వాపోతున్నారు.

జర్మనీలో జై శంకర్, వాంగ్ యీ భేటీ

మ్యూనిక్: దాదాపు ఆరు నెలల తర్వాత భారత, చైనా విదేశాంగ మంత్రులు కొద్దిసేపు చర్చలు జరిపారు. జర్మనీలోని మ్యూనిక్ నగరంలో జరుగుతున్న మ్యూనిక్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ ఇందుకు వేదికైంది. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించేందుకు ఏర్పాటైన ఈ సదస్సుకు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సహా పలువురు ఉన్నత స్థాయి దౌత్య ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సుకు మన విదేశాంగ మంత్రి జై శంకర్, చైనా మంత్రి వాంగ్ యీలు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా శనివారం వీరిరువురు మాట్లాడుకుంటున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. అయితే, ఇద్దరు మంత్రులు మాట్లాడుకోవడంపై అధికారికంగా రెండు దేశాలు ఎటువంటి ప్రకటనా చేయలేదు. జూలైలో ఇండోనేసియా రాజధాని జకార్తాలో ఆసియాన్ ప్రాంతీయ ఫోరం సమావేశంలో జై శంకర్, వాంగ్ యీలు సమావేశమయ్యారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లో రెండు దేశాల బలగాల నడుమ తీవ్ర ఘర్షణ అనంతరం సరిహద్దుల్లో భారీగా బలగాలను మోహరించడంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

రేపటి నుంచే బీజేపీ రథయాత్రలు

- నేడు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రచారవాహనాలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పూజలు
- 5 క్లస్టర్లుగా 16 ఎంపీ సెగ్మెంట్‌ల పరిధిలో... హాజరుకానున్న బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల శంఖారావానికి బీజేపీ సిద్ధమైంది. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలని, తెలంగాణలో పది ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యంగా విజయ సంకల్ప రథయాత్రలకు ఆ పార్టీ శ్రీకారం చుడుతోంది. ఈ నెల 20 నుంచి నాలుగు చోట్ల నుంచి ఈ రథయాత్రల ద్వారా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఈ యాత్రలు మార్చి 1న ముగించేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 9గంటలకు చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద విజయ సంకల్పయాత్ర ప్రచార రథాలకు పూజా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీలు బండి సంజయ్, కె.లక్ష్మణ్‌తోపాటు ముఖ్యనేతలు ఈటల రాజేందర్, డీకే.అరుణ, పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొంటారు. ఐదో రథయాత్ర మాత్రం ఈ నెల 25న మొదలవుతుంది. హైదరాబాద్‌ను మినహాయించి 16 ఎంపీ స్థానాలను ఐదు క్లస్టర్లుగా విభజించిన విషయం తెలిసిందే. ఒక్కో క్లస్టర్ పరిధిలో మూడు నుంచి నాలుగు ఎంపీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఐదు క్లస్టర్లకు చారిత్రక ప్రదేశాల పేర్లు పెట్టారు. కిషన్‌రెడ్డి సహా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ పాలిత సీఎంలు, కేంద్రమంత్రులు, జాతీయపార్టీ ముఖ్యనేతలు యాత్రల్లో పాల్గొంటారు.

ఐదు యాత్రలు ఇలా...

- **భాగ్యలక్ష్మి క్లస్టర్:** ఈ నెల 20న భువనగిరిలో ప్రారంభమై, 3 ఎంపీ సెగ్మెంట్ల పరిధిలోని 21 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ హైదరాబాద్‌లో ముగిస్తుంది.
- **కొమురం భీం క్లస్టర్:** ఈ నెల 20వ తేదీనే ఆదిలాబాద్ జిల్లాలోని ముథోల్‌లో ప్రారంభవుతుంది. దీనికి ముఖ్యఅతిథిగా అస్సాం సీఎం హిమంతబిశ్వ శర్మ హాజరవుతున్నారు. అదే రోజు బహిరంగసభ కూడా ఉంటుంది. ఈ యాత్ర 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాగి నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ముగుస్తుంది
- **రాజరాజేశ్వరి క్లస్టర్:** వికారాబాద్ జిల్లా తాండూరులో ఈ నెల 20న ప్రారంభమయ్యే యాత్రను గోవా సీఎం ప్రమోద్ సావంత్ ప్రారంభించి, అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొంటారు. ఈ యాత్ర 4 ఎంపీ సెగ్మెంట్‌ల పరిధిలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ కరీంనగర్‌లో ముగుస్తుంది.
- **కృష్ణమ్మ క్లస్టర్** : నారాయణపేట జిల్లా మక్తల్‌లో 20వ తేదీనే ఈ యాత్ర మొదలై 3 ఎంపీ సెగ్మెంట్‌ల పరిధిలోని 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాగి నల్లగొండలో ముగుస్తుంది
- **కాకతీయ-భద్రకాళి యాత్ర** : ఇది ఈ నెల 25వ తేదీన భద్రాచలంలో ప్రారంభమై 3 ఎంపీ సెగ్మెంట్‌ల పరిధిలోని సీట్లలోని 21 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ ములుగులో ముగుస్తుంది.

డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్వ వైభవం తెచ్చేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. 2004 – 2014 సంవత్సరాల మధ్య ఐటీడీఏకు కేటాయించిన బడ్జెట్, చేసిన ఖర్చు వివరాల నివేదికను వచ్చే సమావేశం నాటికి అందజేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని పలువురు విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని, ఇందుకు గల కారణాలను విశ్లేషించి, వారు పాఠశాలలకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. యువతకు స్వయం ఉపాధి ద్వారా సాయం అందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు 2005లోనే నాటి వైఎస్సార్ ప్రభుత్వం మూడున్నర లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసిందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు.

పక్క రాష్ట్రంలో గత సర్కారు ఇదే శాఖలో స్కామ్ చేసింది

విద్యార్థులకు అందిస్తున్న సహకారంపై స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో మాట్లాడిన భట్టి.. పక్క రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇదే శాఖలో స్కామ్ చేసిందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ.. 32 మండలాల పరిధిలో విస్తరించి ఉన్న ఐటీడీఏను విభజిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. భద్రాద్రి ఏజెన్సీ బాధ్యత తనదేనన్నారు. భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జిని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన వెల్లడించారు.

తెలంగాణ అభివృద్ధికి మెగా ప్లాన్

▶ మొదటి పేజీ తరువాయి

దేశంలోనే ఐదవ మెట్రోపాలిటన్ సిటీగా గుర్తింపు పొందిందని చెప్పారు. దీన్ని మరింతగా అభివృద్ధి చేయాలన్నదే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని, అందరి సలహాలు, సూచనలతో అందుకు తగిన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. తొందరపాటు చర్యలతో మేడిగడ్డ తరహాలో కానివ్వబోమని అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లిలోని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

ఫార్మా సిటీ స్థలంలో కొత్త నగరం

'వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలోని ఓఆర్ఆర్, రీజనల్ రింగురోడ్డు మధ్య ఇటు, అటు ప్రాంతాలను ఎంపిక చేసి అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాలుగా విభజిస్తాం. చైనా తరహాలో 10 నుంచి 15 శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తాం. వాటిల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తాం. ఫార్మాసిటీని రద్దు చేస్తామనే అపోహ ఉంది. అది నిజం కాదు. ఫార్మా సిటీకి కేటాయించిన స్థలంలో కొత్త నగరం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఒకేచోట ఫార్మాసిటీ అని కాకుండా విభిన్న ప్రాంతాల్లో కాలుష్య రహిత ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తాం. ఆస్పత్రులు, స్కూళ్ళు, షాపింగ్‌మాల్స్, ఇతర అన్ని రకాల సదుపాయాలుండేలా చూస్తాం..'అని సీఎం తెలిపారు.



కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు

ఆర్ఆర్ఆర్ చుట్టూ రైలు సౌకర్యం

'మెట్రో రైలు సౌకర్యం మరింత మందికి చేరువలో ఉండేలా చేయాలనే సంకల్పంతో కొత్త మార్గాలను రూపొందించాం. ఎయిర్‌పోర్టుకు, మియాపూర్ నుంచి ఆర్‌సీ పురం వరకు, రాయదుర్గం నుంచి గచ్చిబౌలి కూడలి మీదుగా అమెరికన్ కాన్సులేట్ భవనం వరకు మెట్రో ఏర్పాటు చేయాలని సంకల్పించాం. ఆర్ఆర్ఆర్ నిర్మాణ సమయంలో చుట్టూ రైలు సౌకర్యం ఏర్పాటు చేసేలా చూస్తాం..'అని రేవంత్ చెప్పారు.

ఫైర్ విభాగంలో ఖాళీల భర్తీ

'ప్రపంచంలో ఎక్కడైనా ల్యాండ్ మార్క్‌లు నిర్మించేది బిల్డర్లు, కాంట్రాక్టర్లే. వారి సమస్యలు ఏమి ఉన్నా పరిష్కరించేందుకు, వారికి అందుబాటులో ఉండేందుకు సిద్ధం. నగరాభివృద్ధిలో ఫైర్ విభాగం పాత్ర ఎంతో ఉంది. 50–60 అంతస్తుల భవనాలకు ఎన్‌ఓసీ ఇవ్వడంలో వారి పాత్ర కూడా ఉంటుంది. కానీ వారికి భవనం లేకపోవడం విడ్డూరం. క్రెడాయ్ ముందుకొచ్చి భవన నిర్మాణం చేపట్టడం అభినందనీయం. క్రెడాయ్ వారి సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధం. ఫైర్ విభాగంలో ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. పోలీస్ విభాగం తరహాలో ఫైర్ సిబ్బంది అందరికీ న్యాయం చేసేలా చూస్తాం..'అని రేవంత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఫైర్ విభాగం అదనపు డీసీ నాగిరెడ్డి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు లేకపోతే పురుషులతో భర్తీ

- ప్రభుత్వ ఉద్యోగాలకు హారిజాంటల్ రిజర్వేషన్ల అమల్లో సవరణ
- రూల్ 22, 22ఏ సవరణ ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో హారిజాంటల్ రిజర్వేషన్ల అమలు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. మహిళలకు హారిజాంటల్ పద్ధతి (రోస్టర్ పాయింట్ల పట్టికలో ఎలాంటి ప్రత్యేకంగా ఎలాంటి మార్కింగ్ లేకుండా)లో 33 1/3 (33.3) శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయిస్తూ గతంలో జీఓ ఎంఎస్ 3ను జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఉద్యోగాల భర్తీ క్రమంలో నిర్దేశించిన పోస్టులకు సరైన అభ్యర్థులు లేనిపక్షంలో వాటిని క్యారీఫార్వర్డ్ చేసే పద్ధతి (ఖాళీని అలాగే ఉంచడం) ఇకపై ఉండబోదు. దీనికి అనుగుణంగా తెలంగాణ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్–1996 లోని రూల్ 22, 22ఏలో ప్రభుత్వం మార్పులు చేసింది. తాజా సవరణలో భాగంగా ప్రస్తుతం మహిళలకు 33.3 శాతం రిజర్వు చేస్తున్నప్పటికీ.. కమ్యూనిటీ రిజర్వేషన్ల కేటగిరీల్లో అర్హులైన మహిళా అభ్యర్థులు లేనప్పుడు ఆయా ఉద్యోగాలను పురుషులతో భర్తీ చేసే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ తరఫున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీఓఎంఎస్ 35 జారీ చేశారు. ఈ ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని అన్ని ప్రభుత్వ శాఖలకు, ఉద్యోగ నియామక సంస్థలైన టీఎస్‌పీఎస్సీతో పాటు ఇతర బోర్డులకు పంపించారు. దీంతో ఏదైనా నోటిఫికేషన్‌లో నిర్దేశించిన అన్ని ఖాళీలను అదే సమయంలో తప్పనిసరిగా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ తదితర కేటగిరీల్లో ఉద్యోగాలకు అర్హులైన మహిళా అభ్యర్థులు లేని సందర్భంలో, అదే కమ్యూనిటీకి చెందిన పురుషులతో భర్తీ చేయడం వల్ల పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితి ఉత్పన్నం కాదు. మహిళలకు నిర్దేశించిన పోస్టులు పురుషులతో భర్తీ చేస్తే... మహిళలకు దక్కాల్సిన 33.3% దక్కకుండా పోతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నియామకాల ప్రక్రియలో దీర్ఘకాలికంగా పరిస్థితిని పరిశీలిస్తే మహిళలకు అతి తక్కువ సంఖ్యలో పోస్టులు దక్కుతాయనే వాదన వినిపిస్తోంది.

ఆగంతకుడి అనుమానాస్పద ఈ-మెయిల్స్

- శంషాబాద్ విమానాశ్రయంలో అప్రమత్తమైన అధికారులు
- బెంగళూరుకు చెందిన ఆగంతకుడి పనిగా గుర్తించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విధ్వంసకర కార్యకలాపాలు జరుగుతున్నాయని గుర్తు తెలియని వ్యక్తి నుంచి అధికారులకు ఈ-మెయిల్స్ వచ్చాయి. ఈ మేరకు ఆర్జీఐఏ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. 'విమానాశ్రయంలో విధ్వంసం జరుగుతున్నందున అక్కడ దిగవద్దని, వెంటనే తిరిగి రావాలని, విమానం తలుపులు కూడా మూసి ఉంచాలని'ఆ ఈ-మెయిల్‌లో పొంతనలేని మాటలు, విషయాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు మెయిల్స్ పంపినప్పుడు పూర్తిగా స్పృహలో లేకపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయంతో పాటు దేశవ్యాప్తంగా 200 ఐడీలకు ఇదే తరహా మెసేజ్‌లను ఆగంతకుడు పంపించినట్లు గుర్తించారు. మెయిల్స్ వచ్చిన వారిలో వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు, విమానాశ్రయ అధికారులు ఉన్నట్టు చెపుతున్నారు. 200మంది ఈ-మెయిల్ ఐడీలను నిందితుడు వెబ్‌లోని ఓపెన్ సోర్స్ నుంచి సేకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ-మెయిల్స్ బెంగళూరు నుంచి వచ్చినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. దీంతో విచారణకోసం అక్కడికి ప్రత్యేక దర్యాప్తు బృందం వెళ్లింది. ఆగంతకుడి ఈ-మెయిల్స్‌తో శంషాబాద్ విమానాశ్రయ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. విమానాశ్రయంలో భద్రతను మరింత పెంచడంతో పాటు అణువణువునా తనిఖీ చేసిన తర్వాతే ప్రయాణికులను అనుమతిస్తున్నారు.

..వేతన సవరణ ఊసే లేదు!

▶ మొదటి పేజీ తరువాయి

అంశాలపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవటంతో.. తమ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ పంథా ఏంటో అర్థం కాక అయోమయంలో పడిపోయారు.

'మహాలక్ష్మి' పథకాన్ని సక్సెస్ చేసినా.. పట్టించుకోరా?

ప్రభుత్వం కొలువు దీరిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటును ఆర్టీసీ ఆరంభించింది. గత డిసెంబరు 9న ఒక్క కొత్త బస్సు లేకుండా, ఉన్న సిబ్బందితోనే ఈ పథకాన్ని ప్రారంభించారు. అంతకు ముందు సగటున రోజుకి 28 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు. ఈ పథకం మొదలయ్యాక అది 45 లక్షలకు చేరింది. కొన్ని ప్రత్యేక రోజుల్లో ఆ సంఖ్య 52 లక్షలకు చేరినట్టు అధికారులు చెబుతున్నారు. 30 శాతం డొక్కుగా ఉన్న బస్సుల్లో ఓవర్‌లోడ్ వల్ల ఎక్కడ ఎప్పుడు ఏ బస్సు అదుపు తప్పుతుందోనని ఆర్టీసీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. కానీ, నిత్యం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, సిబ్బందికి జాగ్రత్తలు సూచిస్తుండటంతో ఎక్కడా ప్రమాదాలు చోటుచేసుకోకుండా పథకాన్ని అమలు చేస్తూ వస్తున్నారు. బస్సులు కిక్కిరిసి ఘర్షణలు జరుగుతున్న పరిస్థితి ఉన్నా ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. ఒక్క కొత్త బస్సు కూడా సమకూర్చకుండానే తమతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించినా తాము విజయవంతంగా అమలు చేస్తున్నామని, కానీ తమకు అందాల్సిన ఆర్థిక లబ్ధి విషయంలో ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించటం ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

గత బీఆర్ఎస్ సర్కారు జీఓ ఇచ్చినా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉత్తర్వు జారీ చేసింది. కానీ, విధివిధానాలకు కమిటీ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. విధివిధానాలు ఖరారయ్యేలోపే ఎన్నికల కోడ్ రావటంతో ఆ విషయం మరుగున పడింది. విధివిధానాలు వచ్చేలోపు తమ జీతాలను ట్రెజరీ ద్వారా చెల్లించేలా ఆదేశించాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరినా అది నెరవేరలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో వెంటనే ఆ ప్రక్రియ కొనసాగుతుందని ఆర్టీసీ ఉద్యోగులు ఆశించారు. కానీ, రెండు నెలలైనా దాని జాడలేదు.

అన్నీ వదిలేసి తక్కువ మొత్తం విడుదల చేసి

2017, 2021 సంవత్సరాల్లో వేతన సవరణలు జరగాల్సి ఉంది. కానీ అవి నాటి నుంచి పెండింగులోనే ఉన్నాయి. ఇక 2013లో జరిగిన వేతన సవరణకు సంబంధించి బాండ్ల రూపంలో చెల్లించాల్సిన రూ.281 కోట్ల మొత్తం కూడా పెండింగ్‌లోనే ఉంటూ వచ్చింది. ఇవి కాకుండా, ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడే ఆర్టీసీ సహకార పరపతి సంఘం (సీసీఎస్)కు సంబంధించి దాదాపు రూ.1100 కోట్లు, పీఎఫ్‌కు సంబంధించి రూ.1400 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటన్నింటినీ పెండింగులో ఉంచి కేవలం తక్కువ మొత్తం ఉన్న బాండ్ల నిధులను మాత్రమే విడుదల చేస్తున్నట్టు కొత్త ప్రభుత్వం ప్రకటించింది.

ఈ ప్రభుత్వం కూడా అంతేనా?

శాసనసభ ఎన్నికలకు ముందు, ప్రధాన కార్మిక సంఘాల నేతలు.. వారివారి సొంత సంఘాలు వదిలేసి కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలిపారు. బడ్జెట్ ముందు వరకు కూడా కాంగ్రెస్ పార్టీ తీరును ప్రశంసిస్తూ పోస్టులు వైరల్ చేశారు. కానీ, బడ్జెట్ తర్వాత ఒక్కసారిగా వారిపై కార్మికుల నుంచి ఒత్తిడి పెరగటంతో తాజాగా కార్మిక నేతలు ప్రభుత్వ తీరును తప్పుపడుతూ ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వం తీరు కంటితుడుపు చర్యగా కూడా లేదని, కార్మికుల ఓపిక నశించకముందే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని అశ్వత్థామరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ తీరు నిరుత్సాహానికి గురిచేసిందని, అప్రజాస్వామిక, నియంత పాలనను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించనుందా అంటూ రాజిరెడ్డి ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని చెప్తున్న ఈ ప్రభుత్వం చేతల్లో చూపటం లేదని వీఎస్‌రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతన సవరణ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న కార్మికులను ప్రభుత్వం తీవ్రంగా నిరాశపరిచిందని సీనియర్ కార్మిక నేత నాగేశ్వరరావు పేర్కొన్నారు.

'తెలంగాణ ఇంక్రిమెంట్' రికవరీ

- 658 మంది ఉద్యోగుల వేతనాల నుంచి కోత
- జలమండలిలో రెగ్యులరైజ్ అయిన వారికి తప్పని కష్టాలు

సాక్షి, హైదరాబాద్: జలమండలిలో 'తెలంగాణ ఇంక్రిమెంట్'రికవరీకి ఆ శాఖ పరిధిలోని ఆర్థిక విభాగం నుంచి తాజాగా ఆదేశాలు రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పదేళ్ల తర్వాత ఆ శాఖ పరిధిలో రెగ్యులరైజ్ అయిన 658 మంది ఉద్యోగుల నుంచి రికవరీ చేయాలని, ఉద్యోగుల సర్వీస్ బుక్‌లు పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించింది.

ఇంక్రిమెంట్ ఇలా..

తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగులు పోషించిన పాత్రకు గుర్తుగా రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ఉద్యోగులందరికీ 'తెలంగాణ ప్రత్యేక ఇంక్రిమెంట్'మంజూరు చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు 2014 సెప్టెంబర్ 1న చెల్లించిన ఆగస్టు నెల వేతనం నుంచే ప్రత్యేక ఇంక్రిమెంట్‌ను అమలు చేస్తూ వస్తోంది. ప్రతి నెలా వేతనంలో భాగంగా ఈ ఇంక్రిమెంట్ సర్వీస్ ముగిసే వరకు వర్తింస్తుందని ఆ జీఓలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

జలమండలిలో వర్తింపు ఇలా

జలమండలి పారిశుధ్య విభాగంలో 25 ఏళ్లుగా సేవలిందిస్తున్న సుమారు 658 మంది హెచ్ఆర్, ఎన్ఎంఆర్‌లను ప్రభుత్వం 2014 జూన్ 23న రెగ్యులరైజ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అదే సంవత్సరం ఆగస్టు 13న జీఓ నెంబర్ 23 ఆర్డర్‌తో ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులందరికీ తెలంగాణ ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జలమండలిలోని పారిశుధ్య విభాగంలో రెగ్యులర్ అయి సర్వీస్‌లో ఉన్నవారికి కూడా ఈ ఇంక్రిమెంట్‌ను వర్తింపజేశారు.

జీఓ తేదీని పరిగణనలోకి తీసుకోవాలి

తెలంగాణ ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిన 2014 ఆగస్టు 13 తేదీని కటాఫ్ పరిగణనలోకి తీసుకోవాలని జలమండలి ఉద్యోగులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం రెగ్యులరైజ్ అయిన తాత్కాలిక ఉద్యోగులు కూడా ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్నారని వారు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు జారీ అయిన నాటికే ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న కారణంగా తెలంగాణ ఇంక్రిమెంట్ తమకు కూడా వర్తిస్తుందని వారు పేర్కొంటున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులైన తమ వేతనాలు ఉండడమే తక్కువని, అందులో నుంచి ఇంక్రిమెంట్ సొమ్ము మొత్తం రికవరీ చేస్తే ఆర్థికంగా భారమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రికవరీ ఎందుకంటే...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ తేదీ రోజైన జూన్ 2ను పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం తెలంగాణ ఇంక్రిమెంట్ అమలుచేస్తోంది. అయితే జలమండలిలో ఉద్యోగుల రెగ్యులరైజ్ జూన్ 23న జరిగింది. దీంతో వారి వేతనాల నుంచి ఈ ఇంక్రిమెంట్ రికవరీకి ఆదేశాలు వచ్చాయి. అయితే ఈ ఉద్యోగులు మాత్రం ఇంక్రిమెంట్ జీఓ వచ్చిన ఆగస్టు 13వ తేదీన పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా...

మేడారానికి 1,800 ప్రత్యేక బస్సులు

సాక్షి, హైదరాబాద్: మేడారం జాతర కోసం ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,800 బస్సులను ఏర్పాటు చేసింది. సోమవారం నుంచి 3 రోజులపాటు ఈ బస్సులు సేవలందించనున్నాయి. మహాత్మాగాంధీ, జూబ్లీబస్ స్టేషన్లతోపాటు ఉప్పల్ రింగ్‌రోడ్డు నుంచి మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. రోజుకు 600 బస్సుల చొప్పున నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు పలు సిటీబస్సులను కూడా మేడారం జాతరకు తరలించనున్న దృష్ట్యా నగరంలో 3 రోజులపాటు సేవలు తగ్గుముఖం పట్టనున్నాయి. దీంతో వివిధ మార్గాల్లో ట్రిప్పులసంఖ్య తగ్గించనున్నారు. హైదరాబాద్ నుంచి భారీఎత్తున భక్తులు మేడారం వెళ్లనున్న నేపథ్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. నగరంలో సిటీబస్సుల ట్రిప్పులు తగ్గనున్న దృష్ట్యా ప్రయాణికులు ఈ 3 రోజులపాటు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు. 3 రోజుల తరువాత యథావిధిగా బస్సులు అందుబాటులోకి రానున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

యూత్ కాంగ్రెస్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం యూత్ కాంగ్రెస్ రూపొందించిన పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం రేవంత్ మాట్లాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం యూత్ కాంగ్రెస్ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

మహాధర్నాలో పలు సంఘాల నేతలు

కవాడిగూడ (హైదరాబాద్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం) రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ప్రజా సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మరింత ప్రమాదంలోకి పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి బదులు మనుధర్మ బానిస వ్యవస్థను అమలు చేయాలన్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలను దళిత బహుజనులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి ఈవీఎంలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఫెడరేషన్ నేత నర్సింగ్‌రావు దళిత బహుజనఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు జి.శంకర్, బంద్ సొసైటీ వ్యవస్థాపకులు పల్లెల వీరాస్వామి, లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాసురాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో పెండింగ్ పనుల పూర్తిపై ప్రత్యేక కార్యాచరణ

- ఢిల్లీలో అధికారులతో ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి సూచించారు. ఆదివారం ఢిల్లీలో శాఖల వారీగా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. నీటి పారుదల, మున్సిపల్, పట్టణాభివృద్ధి సహా తదితర శాఖల పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ అనుమతులు, తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, క్లియరెన్స్‌లపై ఆరా తీశారు. అధికారులు సమాచారాన్ని సిద్ధం చేసుకుని పనులను వేగవంతం చేయాలన్నారు.

కాంగ్రెస్‌ను గిల్లితే బీజేపీ నేతలకు నొప్పి: నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనని, కాంగ్రెస్ పార్టీని గిల్లితే రాష్ట్రంలో బీజేపీ నేతలకు నొప్పి వస్తోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు విషయంలో బీజేపీ ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆయన ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప 72 రోజుల్లో కొత్తగా రాష్ట్రంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో సరిపడా కేటాయింపుల్లేవని విమర్శించారు. మేడిగడ్డలో మూడు పిల్లర్ల కుంగుబాటును భూతద్దంలో చూపి గత ప్రభుత్వ తొమ్మిదిన్నరేళ్ల పాలనను బద్నాం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. చర్చ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన సమాధానాలను కాంగ్రెస్ మంత్రులు, సీఎం తట్టుకోలేకపోయారని, అందుకే అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ విషయంలో మాట తప్పితే ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.

మేడారానికి పోటెత్తిన భక్తులు



అమ్మవార్ల గద్దెల వద్ద భక్తజనం

ఎస్ఎస్ తాడ్వాయి: వనదేవతల జాతరకు ముందే భక్తులు పోటెత్తుతున్నారు. దర్శనానికి జనం భారీగా తరలివస్తున్నారు. ములుగు జిల్లా మేడారంలో శ్రీ సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఈ నెల 21 నుంచి మొదలవనుండగా ఆదివారం తెలుగు రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది తరలివచ్చి వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. భక్తులు వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు పోలీసులు పలు రూట్లలో ప్రైవేట్ వాహనాలను పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు.

పేపర్ లీక్‌లు ఉండొద్దు

అధికారులకు సర్కార్ ఆదేశం
- పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలని స్పష్టీకరణ
- ముందస్తు చర్యలపై ఇంటర్ బోర్డ్ దృష్టి
- సమీక్షల్లో టెన్త్ పరీక్షల విభాగం.. ఆరోపణలున్న అధికారులకు నో వర్క్
- ప్రశ్నపత్రం నుంచి మూల్యాంకనం వరకూ పటిష్ట ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 28 నుంచి ఇంటర్మీడియెట్ థియరీ పరీక్షలు మొదలుకానున్నాయి. 9 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నారు. వచ్చే నెల 18న ప్రారంభంకానున్న పదవ తరగతి పరీక్షలకు దాదాపు 5 లక్షల మంది హాజరుకానున్నారు. ఈ రెండు పరీక్షలను ప్రభుత్వం కీలకంగా భావిస్తోంది. ఉన్నతాధికారులు ఇప్పటికే పలు దఫాలుగా పరీక్షల నిర్వహణపై సమీక్షలు చేశారు. ముఖ్యమంత్రి కూడా పరీక్షల తీరుపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. గతం కన్నా భిన్నంగా పరీక్షల నిర్వహణ ఉండాలని చెప్పారు. ఎక్కడా పేపర్ లీక్‌లు ఉండొద్దని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అధికారుల్లో టెన్షన్ కనిపిస్తోంది. ప్రతీ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నారు. ప్రశ్నపత్రాల రూపకల్పన మొదలుకొని, వాటిని చేరవేయడం, పరీక్షల తర్వాత సమాధాన పత్రాలను మూల్యాంకన కేంద్రాలకు తరలించడం, మూల్యాంకన నిర్వహించడం, ఫలితాల క్రోడీకరణ, వెల్లడి వరకూ సిబ్బందిని మరింత అప్రమత్తం చేశారు. గతంలో ఫిర్యాదులు లేని వారినే విధుల్లోకి తీసుకునేందుకు ప్రాధాన్యమిచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.



ఆ భయం తొలగేనా?

కొన్నేళ్లుగా ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణ అధికారులకు సవాల్‌గా మారుతోంది. హాల్‌టికెట్లు మొదలుకొని, ఫలితాల వరకూ ఏదో ఒక పొరపాటు జరుగుతూనే ఉంది. ప్రశ్నపత్రాల్లో తప్పులు సర్వసాధారణం అవుతున్నాయి. మూల్యాంకన, ఫలితాల వెల్లడిలో జరిగిన కొన్ని పొరపాట్ల కారణంగా 2019లో ఇంటర్ బోర్డ్ వ్యవహారం వివాదాస్పదమైంది. ఆ సమయంలో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినా ఇంటర్ బోర్డ్ పెద్దగా దిద్దుబాటు చర్యలు చేపట్టలేదనే విమర్శలున్నాయి. ఆ తర్వాత కూడా ఎక్కడో ఒకచోట ప్రశ్నపత్రాల్లో తప్పులు రావడం సమస్యలు తెచ్చిపెట్టింది. ఈసారి ఇలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా బోర్డ్ ముందే అప్రమత్తమైంది. నిపుణులతో ప్రశ్నపత్రాలను రూపొందించారు. గతంలో ఎలాంటి వివాదాలు లేని వారినే ఎంపిక చేసుకున్నారు. అధికారులు ముందే ఈ వివరాలను తెప్పించుకుని మరీ పరిశీలించారు. టెన్త్ పరీక్షలు గత ఏడాది వివాదాలకు దారి తీశాయి. పేపర్ లీకేజీ రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. సమస్యాత్మక కేంద్రాల్లో ఈసారి ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్టు, ప్రైవేటు స్కూళ్లతో సంబంధాలున్న ఉపాధ్యాయులను విధులకు దూరంగా ఉంచుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

హాల్‌టికెట్ల ఆలస్యంపై దృష్టి : టెన్త్, ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్ల ఆలస్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వం భావించింది. దీనికోసం ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించనుంది. ఫీజులు చెల్లించని విద్యార్థులపై ప్రైవేటు స్కూల్, కాలేజీలు పరీక్షల సమయంలో తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నాయి. డౌన్‌లోడ్ చేసుకునే హాల్‌టికెట్లపై కాలేజీ ప్రిన్సిపల్, స్కూల్ హెచ్‌ఎం సంతకాలు అవసరమన్న ఆందోళన కల్గిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముందుగానే హాల్‌టికెట్ల పంపిణీ చేపట్టాలని నిర్ణయించారు.

పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

టెన్త్, ఇంటర్ పరీక్షల విషయంలో తప్పిదాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో విద్యార్థులను ప్రైవేటు కాలేజీలు, స్కూళ్లు వేధించకుండా చూడాలి. పేపర్ లీకేజీ వంటి ఘటనలు జరగకుండా చూడాలి.

–చింతకాయల ఝాన్సీ (ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి)

ప్రైవేటుకు కొమ్ముకాయొద్దు

ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలకు అధికారులు సహకరిస్తున్నట్టు గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఈసారి అలాంటివి పునరావృతం కాకుండా చూడాలి. పరీక్షలు సజావుగా, ఎలాంటి ఆందోళనలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

–టి నాగరాజు (ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి)



ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా రాజయ్య బాధ్యతల స్వీకారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆది వారం ఉదయం ఎర్రమంజిల్‌లోని కమిషన్ కార్యాలయంలో రాజయ్యతో పాటు కమిషన్ సభ్యులు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, రమేశ్ ముదిరాజ్, నెహ్రూ నాయక్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు, ఫైనాన్స్ కమిషన్ కార్యాలయ అధికారులు, సిబ్బంది వారిని కలిసి అభినందించారు.



ఆలయ పురవీధిలో స్వామిని ఊరేగిస్తున్న పారాయణీకులు

నేటి నుంచి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి పుణ్యక్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 25వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకంతో వేడుకలు ముగుస్తాయి. 22న రాత్రి 8 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం, 23న దివ్య విమాన మహోత్సవం, 24న చక్రతీర్థం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 15న ప్రారంభమైన స్వామివారి అధ్యయనోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించి, శ్రీలక్ష్మీనరసింహస్వామిని, ఆళ్వార్లను అలంకరించి ప్రత్యేక సేవపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ వీధుల్లో స్వామిని ఊరేగించారు. సేవ అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులకు తిరుమంజన, నవకలశ స్నపన మహోత్సవాన్ని జరిపించారు. పూజల తరువాత 'ఇరామానుజనుత్తందాది ఉపదేశరత్తినమాలై' అనుసంధానంగా వేడుకను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ధూపదీప నైవేద్యం' ఎలా?

- గౌరవ భృతి అందక అర్చకుల ఇబ్బందులు.. దేవాలయాల్లో నిత్య పూజలకూ తప్పని కష్టాలు
- రేపు చలో సచివాలయానికి అర్చకుల పిలుపు

సాక్షి, హైదరాబాద్: గౌరవ భృతి అందని కారణంగా దేవుళ్లకు నైవేద్యం, పేద అర్చకుల పూట గడవటం కష్టంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చాక గౌరవ భృతి బకాయిల కోసం వేడుకుంటున్నా ఫలితం లేదు. దీంతో అర్చకులు నిరసనకు సిద్ధమయ్యారు. మంగళవారం చలో సచివాలయం కార్యక్రమం నిర్వహించడం ద్వారా తమ దీనావస్థను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని నిర్ణయించారు.

ఇదీ సంగతి: ఆదాయం అంతగా లేక ఆలనాపాలన కష్టంగా మారిన దేవాలయాల్లో నిత్య పూజలకు ఉమ్మడి ఏపీలో డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి ప్రభుత్వం 'ధూప దీపనైవేద్య పథకం'ప్రారంభించింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత దాని పరిధిలో దేవాలయాల సంఖ్యతోపాటు గౌరవ భృతి మొత్తం కూడా పెంచారు. రాష్ట్ర వ్యాప్తంగా 6000 దేవాలయాలు ప్రస్తుతం దీని పరిధిలో ఉన్నాయి. తొలుత 3500 దేవాలయాలకు మాత్రమే ఉండగా, గతేడాది గోపనపల్లిలో బ్రాహ్మణ సంక్షేమ భవన ప్రారంభోత్సవం సందర్భంగా మరో 2500 దేవాలయాలను ఇందులో చేర్చనున్నట్టు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఆమేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేళ వాటిని ధూపదీప నైవేద్య పథకంలో చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గౌరవ భృతి రూ.6500 ఉండగా, దానిని కూడా రూ.10 వేలకు పెంచుతున్నట్టు కేసీఆర్ అప్పుడు ప్రకటించారు. కొద్దిరోజులకు ఆమేరకు కూడా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో గౌరవ భృతి రూ.10 వేలకు పెరిగింది. అప్పటి వరకు రూ.6500 చెల్లిస్తున్న ఆలయాలకు కూడా వర్తింపజేశారు. కొన్ని నెలలు పాత దేవాలయాలకు ఆ మొత్తం చెల్లించారు. కానీ, కొత్తగా చేరిన దేవాలయాలకు మాత్రం ఇప్పటి వరకు వాటి చెల్లింపులు మొదలు కాలేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున తర్వాత ఇస్తారులే అనుకుంటూ అర్చకులు కాలం గడిపారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరటంతో బకాయిలు సహా వాటి చెల్లింపు ఉంటుందని ఆశపడ్డారు. కానీ, వారి గోడు పట్టించుకునేవారే కరువయ్యారు. పాత దేవాలయాలకు సంబంధించి నవంబరు నుంచి బకాయిలు పేరుకుపోగా, కొత్తగా చేరిన దేవాలయాలకు ఇప్పటి వరకు అసలే చెల్లించలేదు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి విన్నవించినట్టు అర్చకులు చెబుతున్నారు. దేవాదాయశాఖ కమిషనర్‌ను కలిసి అభ్యర్థించామని పేర్కొంటున్నారు. కానీ, ఆర్థిక శాఖ అధికారులు డబ్బులు విడుదల చేయటం లేదన్న సమాధానం దేవాదాయ శాఖ అధికారుల నుంచి వస్తోందన్నారు. దీంతో విషయాన్ని స్వయంగా సీఎం దృష్టికి తెస్తేనన్నా ఫలితముంటుందన్న ఉద్దేశంతో చలో సచివాలయం కార్యక్రమానికి నిర్ణయించినట్టు పేర్కొంటున్నారు.

అన్నారం బ్యారేజీ ఖాళీ



మరమ్మతుల కోసం గేట్లు ఎత్తివేత
- దిగువకు రెండువేల క్యూసెక్కుల నీరు తరలింపు
- అరమీటరు ఎత్తున ఇసుక మేటలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతీ) బ్యారేజీలో మరమ్మతుల కోసం ఇంజనీరింగ్ అధికారులు గేట్లు ఎత్తి నీటిని ఖాళీ చేశారు. బ్యారేజీ సమగ్ర సర్వే కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి ఆదివారం వరకు బ్యారేజీలోని 10–15 గేట్లు ఎత్తి పూర్తి నీటిని రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు తరలిస్తున్నారు. నీటిని పూర్తిగా ఖాళీ చేయడంతో బ్యారేజీ పొడవునా 1.6 కిలోమీటర్ల దూరం వరకు లక్ష క్యూబిక్ మీటర్ల మేర గేట్ల వద్ద అర మీటరు ఎత్తులో ఇసుక పేరుకుంది. దీంతో బ్యారేజీలో సమగ్ర సర్వే చేసేందుకు వీలవుతుందా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తీయకపోతే ఫౌండేషన్, పియర్, ర్యాఫ్ట్‌ల కింద ఖాళీ ప్రాంతం ఎక్కడ ఎంత మేర ఉందనేది తెలియదని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇసుక తొలగించిన తరువాతనే సీపేజీ లీకేజీపై విశ్లేషణ సాధ్యం అవుతుందని అంటున్నారు. గేట్లు కూడా పాడైపోయినట్లు సమాచారం.

తడి ఆరిన తర్వాతే సర్వే: నీటిని పూర్తిగా తొలగించిన అధికారులు బ్యారేజీ దిగువన తడి ఇసుక, రేగడి మట్టితో దిగబడుతున్న పరిస్థితుల్లో పూర్తిగా ఎండిన తరువాతనే సర్వే చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీలోని 2.01 టీఎంసీల నీటి నుంచి 10–15 గేట్లు ఎత్తగా 2వేల క్యూసెక్కుల నీరు దిగువకు తరలించారు. నీరు ఖాళీ కావడంతో ర్యాఫ్ట్, పియర్‌లు దిగువ వేసిన సీకెంట్ ఫైల్స్ కింది భాగంలో ఏమైనా లీకేజీలు ఉన్నాయా.. ఫౌండేషన్ ఎగువ నుంచి ప్రారంభమై దిగువన ఎక్కడకు వెళ్తుంది.. కింద ఖాళీ ఉందా.. తెలుసుకోవడానికి సర్వే చేపట్టనున్నారు. ఒప్పందం మేరకు పార్సన్ అనే సంస్థ గ్రౌండ్ పెనట్రేషన్‌టెస్ట్ కోసం సర్వే చేయనుంది. ఈ సర్వే పూర్తయ్యాక ప్రత్యేక రసాయనాలతో తిరిగి మరమ్మతులు చేపట్టనున్నారు.

అభయారణ్యం నుంచి ఊళ్ల తరలింపు వేగవంతం

- వేగంగా పునరావాస కాలనీ నిర్మాణం.. కోర్ ఏరియా నుంచి గ్రామాల తరలింపు
- పునరావాసం పనుల పురోగతిపై పీసీసీఎఫ్ డోబ్రియాల్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: కవ్వాల్ పులుల అభయారణ్యం (కేటీఆర్) నుంచి గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. మొదటి దశలో పునరావాసానికి రాంపూర్, మైసంపేట గ్రామాలు స్వచ్ఛందంగా అంగీకరించాయి. కేంద్ర ప్రభుత్వం (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) నిబంధనల ప్రకారం రెండు ప్రతిపాదనలతో అటవీశాఖ పనులను చేపట్టింది. గ్రామాల తరలింపులో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏకమొత్తంగా రూ.15 లక్షల పరిహారం అందించటం ఒక ప్రతిపాదన. దీనికి 48 కుటుంబాలు అంగీకరించి ఆ మేరకు పరిహారం స్వీకరిస్తున్నాయి. రెండవ ప్రతిపాదనకు అంగీకరించిన 94 కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారంలో భాగంగా ఒక ఇల్లు నిర్మాణంతో పాటు సాగు భూమిని కూడా ప్రభుత్వం సమకూర్చుతోంది.

లబ్ధిదారులతో సమావేశం: అటవీ ప్రాంతం కోర్ ఏరియా నుంచి గ్రామాల తరలింపు, పునరావాసం కాలనీ పనుల పురోగతిని ఆదివారం కవ్వాల్ లో పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ సమీక్షించారు. అధికారులతో కలిసి పునరావాస కాలనీని సందర్శించటంతో పాటు లబ్ధిదారులతో సమావేశమయ్యారు. పులుల అభయారణ్యం నుంచి గ్రామాల తరలింపుపై ఇటీవల సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరాతీశారు. తరలింపు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు పీసీసీఎఫ్ క్షేత్ర పర్యటన చేశారు. కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్, నిర్మల్, మంచిర్యాల డీఎఫ్ఓలు రామ్ కిషన్ ఆశీష్ పాల్గొన్నారు.

కొత్తమద్ది పడగలో పునరావాస కాలనీ

కవ్వాల్‌కు సమీపంలోనే అటవీ ప్రాంతం బయట కొత్తమద్ది పడగలో అన్ని వసతులతో పునరావాస కాలనీ నిర్మాణం వేగంగా జరుగుతోంది. మొత్తం 12.36 ఎకరాల్లో కాలనీ నిర్మాణమవుతోంది. ఒక్కో కుటుంబానికి 333 చదరపు గజాల్లో ఇల్లు, 2.81 ఎకరాల సాగుభూమిని అందిస్తున్నారు. పనులన్నీ పూర్తి కాగానే ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటుచేసి లబ్ధిదారులకు అందిస్తామని డోబ్రియాల్ వెల్లడించారు.



కుబుసం విడవలేని పాము చచ్చిపోతుంది.
అలాగే తమ అభిప్రాయాలను మార్చుకోలేని మైండ్,
ఇక మైండ్ కాకుండాపోతుంది.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 19 ఫిబ్రవరి 2024

పైజామా జేబులో బొంగరం

'అర్ధరాత్రి సమయం. అమ్మ నగలన్నీ వేసుకుంది. తక్కినవి మూట కట్టుకుంది. నాకంటే ఆరేళ్లు చిన్నది చెల్లెలు. దానికి పాలు బాగా తాగించి భుజాన వేసుకుంది. నేను మాత్రం నాకున్న ఒకే ఒక ఆస్తి బొంగరాన్ని నా పైజామా జేబులో పెట్టుకున్నాను. అందరం కాందిశీకులంగా మారి ఆవలి సరిహద్దుకు బయలుదేరాం. చీకటి. భీతి గొలుపుతున్న అరణ్యమార్గం. అందరి కళ్లు చీమ చిటుక్కుమన్నా రెప్పలు విప్పార్చి భయంతో, కోపంతో మొరిగినట్టుగా చూస్తున్నాయి. నడిచాం.. నడిచాం.. అమ్మ రక్తపు వాంతి చేసుకుంది. చెల్లి భుజం నుంచి జారి మట్టిలో కలిసిపోయింది. నేను నా బాల్యాన్ని అక్కడే భూస్థాపితం చేసి ఇటువైపుకు చేరుకున్నాను'...

గుల్జార్ కవిత ఇది. దేశ విభజన సమయంలో అతనికి పన్నెండు పదమూడేళ్లు ఉంటాయి. నేటి పాకిస్తాన్‌లోని జీలం నుంచి వాళ్ల కుటుంబం ఢిల్లీకి చేరుకుంది. రెఫ్యూజీ క్యాంప్‌లో గుల్జార్ బాల్యం గడిచింది. ఇక్కడకొచ్చాక కూడా వీళ్లుంటున్న రోషనారా రోడ్, సబ్జీమండీల్లో నరమేధాన్ని చూశాడు. 'మా స్కూల్లో రోజూ ప్రేయర్ చదివే కుర్రాణ్ణి చంపారు' అంటాడు. 'సబ్జీమండీలో శవాల మీద పాత కుర్చీలు, విరిగిన మంచాలు వేసి తగలబెట్టడం చూశాను' అంటాడు. 'ఇరవై ముప్పై ఏళ్లు అవే పీడకలల్లో వెంటాడేవి' అని వగస్తాడు.

సిక్కులు కష్టజీవులు. గుల్జార్ తండ్రి టోపీలు, చేతిసంచుల దుకాణం తెరిచాడు. పాకిస్తాన్ నుంచి వచ్చిన సిక్కులు 'మా ఊరివాడు ఒక్కడు కనిపించినా చాలు' అని వెతుక్కుంటూ తిరిగేవారు. కొందరు గుల్జార్ తండ్రి దగ్గరకు వచ్చి గుల్జార్ వాళ్ల ఇంట్లోనే తల దాచుకునేవారు. 'మా ఇల్లే ఒక రెఫ్యూజీ క్యాంప్‌గా మారింది. నాకు పడుకోవడానికి చోటే లేదు' అని చెప్పుకున్నాడు గుల్జార్. ఇదీ ఒకందుకు మంచిదే అయ్యింది. గుల్జార్‌కు కరెంటు లేని స్టోర్‌రూమ్ ఇవ్వబడింది. ఒకడే కుర్రవాడు.. తోడుగా లాంతరు. వీధి చివరకు వెళ్లి పావలా ఇస్తే వారంలో ఎన్ని పుస్తకాలైనా అద్దెకు తెచ్చుకోవచ్చు. అలా గుల్జార్ పఠనం స్టోర్‌రూమ్‌లో లాంతరు కింద మొదలైంది. 'ఒకరోజు ఒక పుస్తకం అద్దెకు తెచ్చుకున్నాను. అది ఇంతకుముందు చదివిన పుస్తకాల వలే లేదు. చదివాను. మరసటి రోజు అదే రచయిత రాసిన మరో పుస్తకం చదివాను. భలే అనిపించింది. ఆ తర్వాత ఆ రచయిత సెట్ అంతా ఉర్దూలో ఉంటే తెచ్చుకుని చదివాను. దారీ తెన్నూ లేని ఒక కాందిశీక పిల్లవాడి జీవితాన్ని మార్చడానికే బహుశా ఆ రచయిత నాకు తారసపడ్డాడేమో. అతని పేరు రవీంద్రనాథ్ టాగోర్' అంటాడు గుల్జార్.

ఇంటి నిండా కాందిశీక బంధుమిత్రులు ఉండిపోవడంతో గుల్జార్‌కు జరిగిన మరో మంచి బొంబాయిలో ఉన్న సోదరుడి దగ్గర ఉండమని తండ్రి పంపించడం. అక్కడే గుల్జార్ సొట్టలుపోయిన కార్లకు పెయింట్ వేసే పని మొదలెట్టాడు. అప్పటికే అతడికి రంగులు తెలుసు. బొమ్మలు తెలుసు. కవిత్వంలోని పదచిత్రాలు తెలుసు. 'ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' (పి.డబ్ల్యు.ఎ) వారాంతపు మీటింగ్‌లకు వెళ్లి కవిత్వం చదివితే సినీకవి శైలేంద్ర మెచ్చుకుని బిమల్ రాయ్‌కు పరిచయం చేశాడు. 'కార్లకు పెయింట్ వేయడం కంటే సినిమాల్లో రాస్తే ఎక్కువ డబ్బులు వస్తాయి' అని బిమల్ రాయ్ 'బందిని'లో మొదటి పాట రాయించాడు– 'మోర గోర అంగ్ లైలె'. తర్వాత గుల్జార్ హృషీకేశ్ ముఖర్జీకి ప్రధాన అనుచరుడయ్యాడు. ఆ తర్వాత సాగిందంతా గుల్జార్ జైత్రయాత్ర.

గుల్జార్ కవి, రచయిత, స్క్రీన్ ప్లే రైటర్, సినీ కవి, మాటల రచయిత, దర్శకుడు. అనువాదకుడు, బాలల రచయిత, టెలివిజన్ డైరెక్టర్... 'హర్ ఫన్ మౌలా'. సకల కళాకోవిదుడు. 'నేను నా దేశవాసుల మనోఫలకం మీద కవిగా మిగలాలని కోరుకుంటున్నా' అని అభిలషిస్తాడు గుల్జార్. అయితే మన దేశంలో పాప్యులర్ కల్చర్‌లో ఉన్న వ్యక్తి సీరియస్ సాహిత్యంలో ఎంత పని చేసినా ఎంతో ఎరుకతో వ్యవహరిస్తే తప్ప సాహిత్యముద్రను ముందువరుసలో పొందలేడు. గుల్జార్ సాహిత్యకృషి కంటే అతని సినిమా కృషే ఎప్పుడూ ముందుకొస్తూ ఉంటుంది. గుల్జార్ కవిత్వానికి ఉన్న పాఠకుల కంటే అతని సినిమా పాటలకు ఉన్న శ్రోతలు విస్తారం కావడమే కారణం. చిత్రమేమిటంటే గుల్జార్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' వచ్చినప్పుడు ఆనందించినవారు ఎందరో మొన్న 'జ్ఞానపీఠ్' ప్రకటించినప్పుడు సంతోషించినవారు అందరు. ఇలా 'దాదాసాహెబ్', 'జ్ఞానపీఠ్' రెండూ అందుకున్న సృజనమూర్తి మన దేశంలో ప్రస్తుతానికి మరొకరు లేరు.

'ఎప్పుడైనా ఒంటరిగా కూచుని నా కవిత్వం మొత్తం చూసుకున్నప్పుడు ఇందులో ఇంత ఉదాసీనత ఎందుకుందా అని బెంగటిల్లుతాను' అంటాడు 90 ఏళ్లకు సమీపిస్తున్న గుల్జార్. జీవితాన్ని, ప్రేమను, మానవీయ అనుబంధాలను, ప్రకృతి ప్రదర్శించే ఐంద్రజాలంలో పొందగల ఆనందాలను... ఊరటను, చిన్నచిన్న ఫిర్యాదులను, పెద్దపెద్ద సర్దుబాట్లను రాస్తూ వచ్చిన గుల్జార్ ఈ దేశపు వర్తమాన ముఖచిత్రాన్ని అనునిత్యం న్యూస్‌పేపర్లలో చూసి ఉదాసీనత చెందుతూనే ఉంటాడు. మరల మరల ప్రేమను పంచాల్సిన సంకల్పాన్ని పొందుతూనే ఉంటాడు.

కత్తులు నిద్రలేచే రాత్రులు మరోమారు దేశంలో అరుదెంచకూడదని కలవరపడే గుల్జార్, పైజామా జేబులో బొంగరాన్ని దాచుకుని బుగ్గలపై కన్నీటి చారికలతో మిగిలిన మరో బాలుడి గాథ ఈ దేశం భవిష్యత్తులో వినరాదని దుఆ చేస్తాడు. హిందీని, ఉర్దూను కలిపి తాను మాట్లాడేభాషను 'హిందూస్తానీ'గా పేర్కొనే గుల్జార్ తన పేరుకు తగ్గట్టు ఈ హిందూస్తాన్ ఒక పూలతోటై విరబూయాలని, సుగంధాలను వెదజల్లుతూనే ఉండాలని కలంతో సందేశాలను పంపుతూనే ఉంటాడు.

డ్రాగన్‌కు పావురంతో పనేంటి?

కామెంట్



కరణ్ థాపర్

కాళ్లకు లోహపు రింగులు, రెక్కల వెనుక చైనీస్ అక్షరాలున్న ఒక పావురాన్ని గత మే నెలలో ముంబై పోలీసులు అదుపులోకి తీసుకుని, ఎనిమిది నెలల పాటు 'కస్టడీ'లో ఉంచారు. 'అనుమానాస్పదమైన సమాచారం' లభించకపోవడంతో విడుదల చేశారు. చివరకు అది తైవాన్ నుంచి తప్పిపోయి వచ్చిన రేసు పావురం అని తేలింది. ఇవి రోజుకు వెయ్యి కిలోమీటర్లు ఎగరగలవు. భారత అధికారులు ఒక పావురాన్ని బంధించటం ఇదే మొదటిసారి కాదు. 2015లో, 2020లో కూడా ఇలా జరిగింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల కాలంలో పావురాలను నిఘా కోసం ఉపయోగించారు. కానీ గూఢచర్యం కోసం ఇప్పుడు అనేక అత్యాధునిక సాధనాలు ఉన్నప్పుడు, చైనా ఒక రేసు పావురాన్ని వదిలిపెడుతుందా?

తరచూ మన దేశంలో చిత్ర విచిత్రాలు, అద్భుతమైన విషయాలు సంభవిస్తూ ఉంటాయని మనందరికీ తెలుసు. అసలలా ఉండటమే ఇండియాను ఉత్సుకతను రేకెత్తించేలా, ఉత్తేజం కలిగించేలా, అనేకసార్లు ఊహాతీతమైనదిగా చేస్తుంటుంది. అయితే 'ద వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఇటీవల వచ్చిన ఒక కథనం ఇవేవీ కానటువంటి పూర్తి భిన్నమైన కొత్త కోణాన్ని ఇండియాకు జోడించింది. నిజం చెప్పాలంటే, ఆ కొత్త కోణాన్ని నేను ఏ విధంగానైనా వివరించగలనేమో నాకు తెలియటం లేదు. మీకే వదిలేస్తాను.

'ద పోస్ట్'లో వచ్చిన కథనం ఇలా మొదలౌతుంది: ''చైనా తరఫున గూఢచర్యానికి వచ్చి వాలిందన్న అనుమానంపై ఎనిమిది నెలల పాటు బందీగా ఉంచిన ఒక పావురాన్ని చివరికి అది గూఢచారి ఏజెంట్ కాదనీ, దిక్కుతోచక దారి తప్పి వచ్చిన తైవాన్ రేసింగ్ పక్షి అనీ నిర్ధారించుకున్న భారత అధికారులు దానికి విముక్తి కల్పించారు.''

కాళ్లకు లోహపు రింగులు, రెక్కల వెనుక ఈకల చాటున చైనీస్ అక్షరాలు కలిగి ఉన్న ఈ పావురాన్ని గత మే నెలలో ముంబైలోని ఒక ఓడరేవు సమీపంలో కనిపెట్టిన పోలీసులు దానిని అదుపులోకి తీసుకుని, ఎనిమిది నెలల పాటు 'కస్టడీ'లో ఉంచారు.

''లోతైన మరియు సరైన దర్యాప్తుతో పాటుగా, అనేక విచారణలను'' జరిపిన అనంతరం ''అనుమానాస్పదమైన సమాచారం గానీ, తగిన సాక్ష్యాధారాలు గానీ'' తమకు లభించలేదని ముంబై పోలీసులు చెప్పినట్లు ఆ పత్రిక నివేదించింది. తదనుగుణంగా – ఇప్పటికి దాదాపు మూడు వారాల క్రితం – విడుదలైన ఆ పక్షి మంచి ఆరోగ్యంతో ఉంది.

'ద పోస్ట్' పత్రిక సంప్రదించిన నిపుణులు చెప్పటం ఏమిటంటే– బహుశా ఆ పావురం పరుగు పందేల్లోని పక్షి అయ్యుండి, ''తైవాన్ తీరానికి సమీపంలో జరిగిన రేసింగ్ పోటీల నుంచి దారి తప్పి, అక్కడి నుంచి పడవలో దాదాపు 3,000 మైళ్లు ప్రయాణించి'' ఉండొచ్చని!

అయితే రేసు పావురాల వ్యాపారం చేస్తుండే తైవాన్ కంపెనీ 'నైస్ పీజన్' యజమాని యాంగ్ త్సంగ్–టే ''ఒక రేసు పావురం ఒక రోజులో 1,000 కిలోమీటర్ల వరకు ఎగరగలదనీ, అయితే అది ఇండియా వరకు ఎగురుతూ వెళ్లగలిగిందీ అంటే మధ్యలో కొన్ని మజిలీలు చేసి ఉంటుందనీ'' అన్నారు. ''ఏమైనా, కొన్ని పావురాలు తైవాన్ తీర ప్రాంతం నుంచి యూఎస్, కెనడా వరకు కూడా వచ్చిన ఉదంతాలు ఉన్నాయి'' అని ఆ పత్రిక రాసింది. తైవాన్, ఉత్తర అమెరికాల మధ్య విస్తారమైన మహా సముద్ర జలం తప్ప వేరే ఏమీ లేనందున, పక్షులు అంతదూరం ఎలా వెళ్లగలిగాయో నాకైతే అంతు పట్టటం లేదు. ఒకవేళ పావురాలకు ఈత కొట్టటం గానీ తెలిసి ఉంటుందా?



భారత అధికారులు ఒక పావురాన్ని పట్టి బంధించటం ఇదే మొదటిసారి కాదు. 'ద పోస్ట్' చెబుతున్న దానిని బట్టి 2015లో, మళ్లీ 2020లో ఇలా జరిగింది. ఆ సందర్భంలోనే... ''భారీ సైనిక మోహరింపులతో ఉండే సరిహద్దుల మీదుగా ఎగిరొచ్చిన ఒక పాకిస్తానీ మత్స్యకారుడి పావురాన్ని పోలీసులు స్వల్పకాలం పాటు అదుపులోకి తీసుకున్నారు.''

ఇప్పుడు మీరు వృత్తి పట్ల ఎంతో నిబద్ధతను కలిగి ఉన్న ముంబై పోలీసులను చూసి పరిహసించే ముందు, చరిత్రలో పక్షుల గూఢచర్యం నిజంగానే ఉండేదని ఆ పత్రిక రాసిన విషయాన్ని గమనించాలి. ''మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ... పావురాల ఛాతీకి కెమెరాలను కట్టి శత్రు దేశాల గుట్టుమట్లను కనిపెట్టేందుకు వాటిని ప్రయోగించేది. పక్షి కంటే కూడా ఆ పక్షికి కట్టిన కెమెరా పెద్దదిగా ఉండేదని నేను రూఢిగా చెప్పగలను. ''రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రరాజ్యాలు (జర్మనీని వ్యతిరేకించే బ్రిటన్, రష్యా, అమెరికా, చైనా మొదలైన దేశాలు) తమ మధ్య రహస్య సందేశాల బట్వాడాకు పక్షులను ఉపయోగించాయి.'' దీని వెనుక ఉండే కారణానికి పెద్ద వివరణేమీ అక్కర్లేదు. ''పావురాలు సాధారణ పక్షి జాతులు. కెమెరా కట్టి ఉన్న పావురాలైనా సరే, గూఢచారి పక్షుల్లా ప్రత్యేకంగా కాక, వేలాది ఇతర పక్షుల కార్యకలాపాల మధ్య దాగిపోయేవి'' అని అమెరికా గూఢచార సంస్థ సీఐఏ చెప్పడమే కాకుండా, అలాంటి ఒక రహస్య కెమెరాను సైతం వృద్ధి చేసింది. స్వయంగా సీఐఏనే ఈ విషయాన్ని వెల్లడించింది కనుక అది నిజమే అయి వుంటుంది.

అయితే 'ద పోస్ట్' సంప్రదించిన ప్రతి ఒక్కరూ కూడా ఈ విషయమై ఏకాభిప్రాయాన్నేమీ కలిగి లేరని తెలుస్తోంది. న్యూయార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్, 'ద గ్లోబల్ పీజన్' పుస్తక రచయిత కాలిన్ జరోల్‌మాక్‌కు ఇందులో భారతదేశ అసంబద్ధ పరిస్థితే కనిపించింది. ఆ స్థితిని సరిగ్గా చెప్పాలంటే, 'చాలా హాస్యాస్పదం' అన్నారు. ''గూఢచర్యం కోసం చైనా అనేక అత్యాధునిక సాధనాలను కలిగి ఉందనీ, వాటిని విజయవంతంగా భారత్‌పై ప్రయోగిస్తుంది తప్పితే, రేసు పావురాలనైతే వదిలిపెట్టదు కదా'' అని కాలిన్ జరోల్‌మాక్ వ్యాఖ్యానించారు. కావొచ్చు!

నేను కిటికీ దగ్గర కూర్చొని, పావురాల 'గూ.. గూ' లను వింటున్నప్పుడు, అవి నాపై నిఘా పెట్టేందుకు రాలేదు కదా అని అనుకోకుండా అయితే ఉండలేకపోయాను. నేను ఏం చేస్తున్నానో మన ప్రియమైన ప్రభుత్వం ఈ విధంగానే తెలుసుకుంటుందా? పావురాలు తరచూ కిటికీ అంచులపైన కనిపించడానికి కారణం అవి తమ రెట్టలను అక్కడ వదిలి వేయడానికే అయుంటుందా అన్నది నేను కచ్చితంగా చెప్పలేను. అయితే వాటి చిన్నికళ్ల లోతుచూపులను బట్టి, అక్కడ అవి వదిలిన దాని కన్నా ఎక్కువగా తీసుకుని ఉంటాయా అని యోచిస్తాను.

కాబట్టి, ఈసారి ఒక పక్షి మీ తలపైన ఎగురుతూ ఉండటాన్ని, లేదా ఒక చెట్టు కొమ్మపై కూర్చొని కిందికి చూస్తూ ఉండటాన్ని మీరు గమనించినప్పుడు అది ఏదైనా ప్రయోజనం కోసం అక్కడికి వచ్చి వాలిందా అని ఆలోచించండి. బహుశా అంతదూరంలోని బీజింగ్ నుండి కాకపోయినా, దగ్గర్లోని 'సౌత్ బ్లాక్' (ప్రధానమంత్రి కార్యాలయం ఉండే చోటు) నుండి అది వచ్చి ఉండొచ్చు. అలాంటి పక్షులకు మేత మాత్రం వేయకండి. మనం వాటికి అందించే ఆహారపు తునకలు అవి తమ యజమానుల నుండి పొందే ప్రతిఫలాల ముందు పెద్ద విషయమేం కాదు.

చివరిగా, ఈ వ్యాసం పక్షులకు సంబంధించినదని మీరనుకుంటే కనుక మీరలా అనుకోవటం సరైనదే కావచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వరి మాత్రమే పండిస్తారు



కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పంజాబ్‌లో పంటల వైవిధ్యం తేగలదనే వాదనతో పూర్తిగా విభేదిస్తాను. వరికి బదులుగా ఇతర పంటలు వేసేలా ఎంఎస్‌పీ రైతులను పురిగొల్పుతుందని నిపుణులు చెబుతుంటారు. కానీ చిన్న తర్కం ఏమిటంటే, ఇతర పంటల కంటే వరి వల్ల వచ్చే రాబడి ఎక్కువ. అలాగే దిగుబడిలో వాతావరణ సమస్యల రిస్కు తక్కువ.

– అజయ్ వీర్ జాఖడ్, 'భారత్ కృషక్ సమాజ్' ఛైర్మన్

మ్యూజియం నోట్లు



పెద్దనోట్ల రద్దు కంటే కొన్ని నెలల ముందు, 2016లో, నేను ఒక డిబేట్ కాంపిటీషన్‌లో గెలుచుకున్న నోట్లు ఇప్పడే కనబడ్డాయి. సమయంలోగా వాటిని నేను మార్పించుకోలేదని మా అమ్మానాన్న నిరాశ చెందారు. '1,500 కా నుక్సాన్ హోగయా' (1,500 నష్టం కలిగింది).

– ఫాతిమా ఖాన్, జర్నలిస్ట్

త్వరగా చేసెయ్యాలి!



త్వరగా అల్పాహారం, రాత్రి భోజనాలు ముగించడం గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. గంటసేపు ముందుకు జరిగినకొద్దీ 6 శాతం రిస్క్ పెరుగుతుంది. రాత్రి భోజనం ఎనిమిది లోపల చేసేవారికన్నా, తొమ్మిది తర్వాత చేసేవాళ్లలో 28 శాతం రిస్క్ పెరుగుతుంది.

– పూజా గర్గ్, క్లినికల్ సైకాలజీ పరిశోధకురాలు

మాటల్లేవు...



ఇవ్వాళ నన్నో పిల్లాడు 'ఆంటీ' అన్నాడు. అక్కా అని పిలవమని చెప్పబోతుండగా వాడి అమ్మ వచ్చింది. ఆమె స్కూల్లో నాకు జూనియర్. చిన్న ప్రపంచం!

– అల్కా సింగ్, ఇంజినీర్

నో రిఫైన్డ్!



మీ వంటలకు వెజిటబుల్, రిఫైన్డ్ నూనెలకు బదులుగా నెయ్యి గానీ, కొబ్బరి నూనె గానీ వాడటం మంచిది. అవి లోపలి మంటను తగ్గించడంలో, చర్మ నాణ్యతను పెంచడంలో మంచి ఫలితం కనబరుస్తాయి. అన్ని రిఫైన్డ్ నూనెలకూ దూరంగా ఉండండి.

– ప్రమీలా ముంద్రా, న్యూట్రిషనిస్ట్

అదే మంచి అభిప్రాయం



ప్రతిదాని మీదా ప్రతి ఒక్కరికీ ఏదో అభిప్రాయం ఉండాలన్న ఆలోచనే దారుణమైన మూర్ఖత్వం. మనకు అర్థంకాని విషయాల మీద మనకు అభిప్రాయం లేకుండా ఉండటమే ఉత్తమం. ముఖ్యంగా, మనం వ్యవహరించాల్సిన వారి సంఖ్య పెరిగినకొద్దీ ఇది మరింత ముఖ్యం అవుతుంది.


– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

ఇన్ బాక్స్

ఓ దేశభక్తుని స్మృతి శకలాలు

కొందరు నిస్వార్థ సంఘసేవకులు, నిష్కళంక దేశభక్తులు, నిర్మల మనస్కులు తమ జీవితానుభవాల స్మృతి శకలాలు అక్షరబద్ధం చేస్తే, అవి ఆ వ్యక్తుల్ని చరిత్రలో చిరంజీవులుగా నిలబెడ్తాయి. యానాదుల, కొరవల (ఎరుకలవారు), నిమ్నవర్గాల చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన, దేశ స్వాతంత్ర్యం కోసమై పోరాడి, ఎన్నో ఇడుమల పాలైన వెన్నెలకంటి రాఘవయ్య జీవితంలోని కొన్ని జ్ఞాపకాలు 'పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య స్మృతి శకలాలు' పుస్తక రూపంగా వెలువడటం స్వాగతించాల్సిన సంగతి. ఆచార్య వకుళాభరణం రామకృష్ణ పదిలపరిచి, డా॥ కాళిదాసు పురుషోత్తం సంపాదకత్వంలో వెలుగు చూసింది ఈ విలువైన పుస్తకం.

స్వాతంత్ర్య సమరయోధుడు వెన్నెలకంటి రాఘవయ్య (1897–1981) నెల్లూరి వార పత్రిక 'యూత్ కాంగ్రెస్'లో 1974 ఆగస్ట్ 22 నుంచి 1975 మార్చి 20 దాకా రాసిన జ్ఞాపక శకలాలివి. మొత్తం 25 వ్యాసాల సంకలనమిది. 81 పేజీల ఈ వ్యాసాలు నిక్కచ్చితనానికీ, సుస్పష్టమైన అభివ్యక్తికీ, జీవితానుభవ సంపన్నతకూ నిలువుటద్దాలు. నెల్లూరులో జన్మించిన మరో స్వాతంత్ర్య వీరుడు, సంఘసేవా పరాయణుడైన ఇస్కా చెంచయ్య సంక్షిప్త స్వీయ చరిత్ర ఈ అమూల్య పుస్తకంలో చోటు చేసుకోవడం ఉభయ తారకం.



వెన్నెలకంటి రాఘవయ్య తీవ్రవాద కాంగ్రెసు నాయకులైన లాల్, బాల్, పాల్‌ల సిద్ధాంతాలతో ప్రభావితుడైన తర్వాత వీర సావర్కార్, అరవింద ఘోషుల భావజాలంతో ఉత్తేజితులైన యువకిశోరుడు. మద్రాసులో 'లా' చదువుతూ కాంగ్రెసు కార్యకర్తగా జైలు పాలయ్యాడు. 1920–21 మధ్యలో రాఘవయ్య మనోవాక్కాయ కర్మల్లో అప్పటమైన గాంధీవాదిగా రాటుతేలాడు. బ్రిటిషు ప్రభుత్వం నేరస్థులుగా పరిగణించిన యానాది, కొరవ (ఎరుకల) జాతి వాళ్ల కోసం అవిశ్రాంత పోరాటం సాగించి చట్టబద్ధంగా వాళ్లను విముక్తుల్ని కావించిన కృపానిధి.

వెన్నెలకంటి వారి భగీరథ ప్రయత్నం వల్ల నెల్లూరు కలెక్టరు ఉడ్‌హౌస్, యానాదులకు 100 ఎకరాల భూమి మంజూరు చేస్తే నోరులేని యానాదులు దారి ఖర్చులకని తమ పాలిభూమిని ఎనిమిదణాల కొక ఎకరా చొప్పున హరిజనులకు అమ్మి తమతమ గూళ్లు చేరుకొన్నారట. రాఘవయ్య, ప్రకాశం పంతులు గారితో కలిసి 1931– 32 సంవత్సరాల మధ్య చెన్నపట్టణంలో వకీలు వృత్తి కొనసాగించారు. కాంగ్రెసు పార్టీ కార్యకర్తగా 'నెల్లూరు గాంధీ'గా పేరుగాంచారు. కాని రానురాను కాంగ్రెసు నాయకులు పదవుల కెక్కి ప్రజా సంక్షేమానికి కృషి చేయకపోగా ధనలక్ష్మికి దాసులవడం రాఘవయ్య గారిని కలవర పరిచింది. నిర్వేదానికి గురి చేసింది. సత్య, అహింసలకు నెలవైన కాంగ్రెస్ పార్టీ ఎలా నీరుకారి పోయిందో వెన్నెలకంటి వారి మాటల్లోనే విందాం –''తప్పత్రాగేవారు, ఖద్దరు మొహమే చూడని వారు, కల్లంగళ్ళు పాడించి, ఎక్కువ 'పాటలు' తెచ్చినందుకు పద్మశ్రీలను ఆశించేవారు, జైళ్ళను తొంగియైనా చూడని వారు ఉండే కాంగ్రెసు ఏ కాంగ్రెసో దేవుడికే ఎరుక!''

ఆయన నేరస్థ జాతులుగా ముద్రపడ్డ యానాదులకు, కొరవలకు, నిమ్న వర్గాలకు విముక్తి కలిగించి సంతృప్తులయ్యారు. వీరి సేవను గుర్తించి భారత ప్రభుత్వం వీరికి 1973లో పద్మభూషణ్ పురస్కారం ఇచ్చి కృతార్థమైంది. 1981 నవంబరు 24వ తేదీన రాఘవయ్య స్వర్గస్థులయ్యారు.

– ఘట్టమరాజు । సాహితీ విమర్శకులు

బహుముఖీన ప్రతిభాశాలి



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ప్రపంచ పరిణామాలను లేదా ఘటనలను దేవుళ్లకు సాగిలపడి మొక్కుకోవడం ద్వారా అర్థం చేసుకోడానికి ప్రయత్నించడం కన్నా హేతువాద దృష్టితో కార్యకారణ సంబంధాన్ని అనుసరించడం ద్వారా తెలుసుకోవచ్చు. ఈ రహస్యాన్ని దూరదృష్టి గల థేల్స్, అనాక్సిమాండర్ లాంటి ప్రాచీన గ్రీక్ తత్వవేత్తలు గ్రహించి వెల్లడించారు. అలాగే ప్రాచీన భారతీయ తాత్వికులూ గాలి, భూమి, అగ్ని, నీరు, ఆకాశం – అనే అయిదింటిని ప్రపంచ పరిణామాలకు మూలమని విశదీకరించారని 'ది గ్రేట్ సైంటిస్ట్' అన్న మహా గ్రంథంలో జాన్ ఫార్నండన్ నమోదు చేశాడు (2005). ఇందులో డార్విన్ ప్రాచీన పరిణామవాద సిద్ధాంత నిరూపణల నుంచి అత్యంత ఆధునిక శాస్త్రవేత్తలయిన రూజ్‌వెల్ట్, ఫ్లాంక్లిన్, స్టీఫెన్ హాకింగ్ నిరూపణల వరకూ నమోదై ఉన్నాయి. ఈ మహనీయులందరి కృషిని ఆకళింపు చేసుకుని ఆధునికంగా తాను ఆవిష్కరించిన నూతన శాస్త్రీయ దృక్కోణాల వరకు శాస్త్ర పరిశోధకులలో ఆధునికుడై అజ్ఞాతంగా ఉండిపోయినవారు డాక్టర్ ఏవీ రావు.

'నరసింహ శతకం'లో, ఒకరి విద్యా ప్రావీణ్యాన్ని జీర్ణించుకోలేని లేదా సహించలేని కొందరు ప్రబుద్ధుల్ని గురించి రాస్తూ శతకకర్త ఓ గొప్ప సత్యాన్ని బహిర్గతం చేశాడు. అలాంటి విద్వేషం చలామణీలో ఉన్నచోట ఎంతటి ప్రయోజకులైన విద్యావంతులు కూడా తమ ప్రతిభా సమున్నతిని చాటుకోవడం ఎంతో కష్టమని ఆ శతక కర్త చాటాడు. ఇటువంటి పరిస్థితులు ఉన్నా వైజ్ఞానిక శాస్త్ర సంబంధమైన పలు అంశాలపై విద్యార్థులకు, వయోధికులకు కూడా సుబోధకం చేయడానికి తన శాస్త్ర విజ్ఞానాన్ని పలు ముఖాలుగా విస్తరించారు డాక్టర్ ఆత్మూరి వెంకటేశ్వరరావు (ఏవీ రావు).

ఆయన హైదరాబాద్ చంద్ర రాజేశ్వరరావు వృద్ధాశ్రమంలో ఉంటూనే శాస్త్ర పరిశోధనలు బహుముఖాలుగా చేస్తూ పిన్నలనూ, పెద్దలనూ వైజ్ఞానికంగా ఉత్తేజపరచడానికి ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్త. వేదిక్ గణిత శాస్త్ర విషయాల నుంచి ఆధునిక పజిల్స్ పరిష్కారం వరకు డాక్టర్ రావు మేధ విస్తరించింది. ఆధునిక 'సుడోకు పజిల్స్'కు పలు తెలివైన పరిష్కారాలు ఆవిష్కరించిన

రెండో మాట



డా॥ ఆత్మూరి వెంకటేశ్వరరావు

ఆయన అంకెల గారడీకి 580 విజిల్ సాంగ్స్‌ను (ఈల పాటలు) విడమర్చి సుబోధకం చేసిన ఆచార్యుడు. అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు రిటైర్మెంట్ తరువాత పొందారు. కుటుంబ శాంతి–సౌఖ్యాలు మన చేతికీ, మనస్సుకూ అందుబాటులో ఉన్నవే కానీ, ఇతరులపై ఆధారపడే సుఖ సంతోషాలు కావని నిరూపిస్తూ రాసిన ప్రత్యేక థీసిస్‌కు అవార్డులు పొందారు. రూర్కేలా యూనివర్సిటీ ఇంజనీరింగ్ శాఖలో 'హైవోల్టేజ్' పరిశోధనా విభాగంలో పనిచేసే పీహెచ్‌డీ విద్యార్థులకు డాక్టర్ రావు టెక్నికల్ కన్సల్టెంట్. అలాగే ఇన్సులేషన్ టెక్నాలజీపై చికాగో (అమెరికా)లో జరిగిన అంతర్జాతీయ మహాసభలో అధ్యయన పత్రాన్ని సమర్పించడానికి ఏర్పాటైన ప్రత్యేక మహాసభ ఆమోదించిన ఏకైక భారతీయ పరిశోధనా పత్రం డాక్టర్ రావుదే కావడం విశేషం. ఇలా దాదాపు 18 రకాల పరిశోధనా కార్యక్రమాలలో డాక్టర్ రావు పాత్రకు గాను అనేక పురస్కారాలు లభించాయి.

వాడకంలో ఉన్న ప్రతి ఒక్క వస్తువూ శ్రమజీవి కాయకష్టం ఫలితమేనని మహనీయుడు కారల్ మార్క్స్ రాశాడు. మార్క్స్ 'పెట్టుబడి' పాఠాలకు ముందు వేల సంవత్సరాల క్రితం రోమ్ సామ్రాజ్య పాలకుడు డయోక్లిటస్ ప్రజా బాహుళ్యానికి అందుబాటులో ఉంచాల్సిన సరకులు మార్కెట్‌కు చేరకుండా సంపన్నులు తొక్కిపెడుతున్నందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాడు. సరకుల ఉత్పత్తి, పంపిణీలపై ప్రభుత్వానికి ఆధిపత్యం దఖలు పరిచాడు. 'ప్రజాబాహుళ్యం సమష్టి కష్టానికి తగిన ప్రతిఫలం సిద్ధించేదాకా వ్యక్తి స్వేచ్ఛను అదుపు చేయాల్సిందే'నని ప్రకటించాడు! అలాగే డాక్టర్ రావు సమాజం పట్ల ఆర్ద్రతతోపాటు కొన్ని నగ్న సత్యాలను నిర్మొహమాటంగా వెల్లడించారు. డాక్టర్ రావు దృష్టిలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థలో సరకుల ఉత్పత్తికి, వాటి వినియోగానికీ మధ్య సమతుల్యత అనేది సాధ్యపడదు. కనుకనే సమాజంలో సంక్షోభాలు అనివార్యమవుతున్నాయి. ప్రస్తుతం ఆయన 'వైదిక గణితం' పరిశోధనా గ్రంథం త్వరలో వెలుగుచూడగలదని ఆశిద్దాం. ఎందుకంటే –

'కావ్య శాస్త్ర వినోదేన, కాలో గచ్ఛతి ధీమతాం / వ్యసనేన చ మూర్ఖాణాం నిద్రయా కలహేన వా' (కావ్య శాస్త్ర వినోదాలతో బుద్ధిమంతుల కాలం గడిచిపోతుంది. మూర్ఖులు వ్యసనాలతో, నిద్రతో, కలహాలతో కాలక్షేపం చేస్తారు).

abkprasad2006@yahoo.co.in

బ్రహ్మ జిజ్ఞాస

అనాది కాలం నుండి జిజ్ఞాసాపరుడైన మానవుడు సృష్టి రహస్యం తెలుసుకొనటానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. తాత్విక విషయాలు చర్చించే సందర్భంలో ఎదురయ్యే చిక్కుగానీ, చమత్కారంగానీ ఏమిటంటే, ఒక ప్రశ్నకు సమాధానం దొరికేటంతలో దానికి అనుబంధంగా రెండు ప్రశ్నలు తలెత్తడం. ఫలితంగా మౌలిక ప్రశ్నలకు సంబంధించిన అంతిమ సమాధానాల కొరకు జరిగే అన్వేషణ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నది.

'శ్వేతాశ్వతర' ఉపనిషత్తు, బ్రహ్మ జిజ్ఞాసాపరులు కొందరు చేసిన చర్చలో భాగంగా వారు వేసిన ప్రశ్నలతో ప్రారంభం అవుతుంది. ఈ విశ్వానికి మూల కారణం ఏమిటి? మనం ఎందుకు జన్మించాము? ఎక్కడ నుండి వచ్చాము? జీవిత పరమార్థం ఏమిటి? మనిషి చనిపోయాక ఏమవుతాడు? ఎవని నియమానుసారం ఈ సుఖదుఃఖాల వ్యవస్థకు మనం లోబడి ఉంటున్నాము? ప్రపంచంలో దుఃఖం ఎందుకున్నది? ఇలా సాగుతుంది ఉపనిషత్తు.



యవ్వనంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొన్న శ్రీరాముడు కుల గురువు వసిష్ఠుల వారిని లోకంలో ఉన్న దుఃఖం గురించీ, జనన మరణాల గురించీ, అనిత్యతా స్వభావం గురించీ తెలియజెప్పమని అడుగుతాడు. రాముడి నోటి నుండి ఇలాంటి తాత్విక జిజ్ఞాసాపరమైన అభ్యర్థనను విని సంతోషించిన వసిష్ఠుడు రాముడికి ఉపదేశించిన ఆధ్యాత్మిక విషయ సంగ్రహమే 'యోగ వాసిష్ఠం'గా రూపుదిద్దుకొన్నది.

స్టీఫెన్ హాకింగ్ అనే సైంటిస్టు తన గ్రంథం 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' చివర్లో మనం ఒక విభ్రమం గొలిపే ప్రపంచంలో ఉన్నామని అంటాడు. అంతేకాదు ఈ విశ్వం స్వభావం గానీ, లక్షణం గానీ ఏమిటి? అందులో మన స్థానం ఏమిటి? ఈ విశ్వం, అందులో ఉన్న మనం ఎలా, ఎక్కడ నుండి ఆవిర్భవించాము? ఈ విశ్వం ఉన్న తీరు, అలాగే ఎందుకు ఉన్నది? ఈ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు తెలిస్తే, అంతకు మించిన జయం మానవాళికి లేదని చెబుతూ తన గ్రంథాన్ని ముగిస్తాడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.దశమి ప.11.57 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: మృగశిర ప.1.36 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.10.16 నుండి 11.52 వరకు, దుర్ముహూర్తం: ప.12.37 నుండి 1.25 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, అమృతఘడియలు: తె.4.02 నుండి 5.41 వరకు (తెల్లవారితే మంగళవారం); రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.29, సూర్యాస్తమయం: 5.56.



మీ జగన్ పేరు చెబితే..

మీ జగన్ పేరు చెబితే.. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, విద్యాకానుక, గోరుముద్ద, బాగుపడ్డ పాఠశాలలు, బైజూస్ కంటెంట్, బైలింగ్యువల్ బుక్స్, ట్యాబ్‌లు, డిజిటల్ బోధనతో ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, తొలిసారిగా సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, టోఫెల్ శిక్షణ, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకు ప్రయాణం గుర్తొస్తాయి. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యా దీవెన, వసతి దీవెన, జాబ్ ఓరియెంటెడ్‌గా కరిక్యులమ్‌లో మార్పులు, ఆన్‌లైన్ వర్టికల్స్ చదువులతో అనుసంధానం.. ఇవన్నీ తల్లిదండ్రులకు వివరించాలి. ఇవన్నీ కొనసాగాలంటే, పిల్లలు అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడాలంటే, పెత్తందార్ల పిల్లలతో పోటీ పడే పరిస్థితి రావాలంటే మీ అన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే జరుగుతుందని చెప్పండి. ఇవాళ ఒకటో తరగతిలో ఉన్న పేదింటి పాప, పేదింటి బాబు మరో 10–15 ఏళ్లలో అంతర్జాతీయ చదువులతో గొప్ప ఉద్యోగాలు సాధించాలంటే మీ అన్న ప్రభుత్వం మాత్రమే చేయగలుగుతుందని ప్రతి ఇంటికీ చెప్పండి. సైకిల్‌కు ఓటేయడం అంటే గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం రద్దుకు ఓటేస్తున్నామని గుర్తు పెట్టుకోవాలి. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటివద్దే రూ.3 వేల పెన్షన్లు కొనసాగాలన్నా, భవిష్యత్‌లో పెరగాలన్నా, కొందరికే పింఛన్లు ఇచ్చిన రోజులు మళ్లీ రాకూడదన్నా, లంచాల జన్మభూమి కమిటీలు కాటేయకూడదన్నా ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని ఇంటింటికీ వెళ్లి చెప్పాలి. ఇవాళ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరినీ సేవలతో విస్తరించిన ఆరోగ్యశ్రీ, 104, 108 వాహనాలు, ఆరోగ్య ఆసరా, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష ఆదుకుంటున్నాయి. వీటి పేరు వింటే కోవిడ్ కష్టకాలంలో అందించిన సేవలు గుర్తుకొస్తాయి. పేదలు వైద్యం కోసం అప్పులపాలు కాకూడదన్నా, గడపగడపకూ వైద్యం అందించే పరిస్థితి కొనసాగాలన్నా లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లుగా ముందుకు రావాలని కోరాలి.



రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

మంచి పాలనకు మళ్లీ సిద్ధం

సంక్షేమంతో కోట్లాది గుండెల తలుపు తట్టాం

మన పథకాల గురించి ఒక్కొక్కరూ వంద మందికి చెప్పాలి

రాప్తాడు సభలో ఏపీ ముఖ్యమంత్రి జగన్ పిలుపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: విశ్వసనీయతకు – వంచనకు మధ్య జరగబోతున్న ఎన్నికల యుద్ధంలో పేదవాడి భవిష్యత్ కోసం వారి తరఫున నిలబడటానికి మీరంతా సిద్ధంగా ఉండాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ యుద్ధం.. వేరే రాష్ట్రంలో ఉంటూ మోసం చేసేందుకు అప్పుడప్పుడూ మన రాష్ట్రానికి వచ్చిపోతున్న నాన్ రెసిడెంట్స్ ఆంధ్రాస్‌కు, ఈ గడ్డమీదే పుట్టి ఇక్కడే ఇల్లు కట్టుకుని ప్రజల మధ్యే ఉన్న మనకూ మధ్య జరగబోతోందన్నారు. మనందరి ప్రభుత్వం 57 నెలలుగా అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని అడ్డుకుంటూ వాటిని రద్దు చేయడమే లక్ష్యంగా చంద్రబాబు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు.

బాబు మార్కు ఎక్కడైనా ఉందా?

ఈ వేదిక నుంచి చంద్రబాబుకు ఒక సవాల్ విసురుతున్నా. మీరు 14 ఏళ్లు పరిపాలన చేశారు. మూడుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నారు. కానీ మీ పేరు చెబితే రైతులకు గుర్తుకొచ్చే ఒక్కటైనా పథకం ఉందా? మీ పేరు చెబితే అక్కచెల్లెమ్మలకు గుర్తుకొచ్చే పథకం కనీసం ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? మీ పేరు చెబితే విద్యార్థులకు గుర్తొచ్చే పథకం ఏదైనా ఉందా? మీ పేరు చెబితే కనీసం అవ్వాతాతలకైనా నా కూడా మమ్మల్ని బాగా చూసుకున్నాడు.. మా పెన్షన్ మా ఇంటికే పంపాడనే పరిస్థితి ఏనాడైనా ఉందా? పథకాలను పక్కనపెడితే చంద్రబాబు పేరు చెబితే సామాజిక న్యాయం ఏ ఒక్కరికైనా గుర్తుకు వస్తుందా? మేనిఫెస్టోకు రంగులు పూసి ప్రతి సామాజిక వర్గాన్ని మోసం చేయడం చంద్రబాబు ఆనవాయితీ. ఏనాడైనా కనీసం 10 శాతం వాగ్దానాలను అమలు చేశారా? బంగారు కడియం ఇస్తానంటూ ఊబిలోకి దింపి మనుషుల్ని తిన్న పులి మాదిరిగా మరోసారి ఎర వేస్తున్నాడు. అబద్ధాలు చెప్పేటప్పుడు భావ దారిద్ర్యం ఎందుకన్నది బాబు నైజం. నమ్మినవాడు మునుగుతాడు... నమ్మించిన వాడు దోచుకోగలుగుతాడన్నది ఆయన సిద్ధాంతం. చంద్రబాబు వాగ్దానాలన్నీ మోసాలేనని ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి చెప్పాలి. బాబు మోసాల్ని భరించలేకే కదా ఐదేళ్ల క్రితం అన్ని సామాజిక వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలంతా చొక్కా మడతేసి కుర్చీని లాగేసి చీపుర్లతో ఊడ్చి ఆయన పార్టీని శాసనసభలో 102 నుంచి 23కు తగ్గించారు. అదే పని మరోసారి చేయడానికి, చొక్కాలు మడత వేయడానికి మీరంతా సిద్ధంగా ఉండాలి.

లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లు

మన ప్రభుత్వ హయాంలో పథకాలు అందుకున్న ప్రతి కుటుంబం మనకు స్టార్ క్యాంపెయినర్‌గా బయటకు రావాలి. వైఎస్సార్ సీపీలో ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాల్సిన అవసరాన్ని చెప్పాలి. మనం చేసినవి తెలియచేస్తూ వాటి కొనసాగింపు ఎంత అవసరమో ప్రతి ఇంటికీ వివరించాలి. పథకాలన్నీ కొనసాగాలన్నా, బాబు మార్క్ దళారీ వ్యవస్థ మళ్లీ రాకూడదన్నా ప్రతి రైతన్న మన స్టార్ క్యాంపెయినర్‌గా ముందుకొచ్చి ఇంకో వంద మందికి చెప్పాల్సిన అవసరం ఉంది. విందు భోజనం, బిర్యానీ పెడతానంటూ ఆశ చూపించి చంద్రబాబు ఇప్పుడు మనం పెడుతున్న అన్నాన్ని, గిన్నెను లాక్కోవడానికి అడుగులు వేస్తున్నాడు. గతంలో ఇదే పెద్దమనిషి రూ.87,612 కోట్ల రుణ మాఫీని ఓ మోసంలా ఎలా మార్చాడో ప్రతి రైతన్నకూ గుర్తు చేయాలి. అమ్మ ఒడి, ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, 31 లక్షల ఇళ్లపట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం, దిశ యాప్, మహిళా పోలీస్.. ఇవన్నీ గతంలో ఎప్పుడూ జరగని విధంగా మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే జరుగుతున్నాయి. ఇవన్నీ ప్రతి అక్కచెల్లెమ్మకు కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని, మరో వంద మందితో ఓటు వేయించాల్సిన బాధ్యత ఉందని మీరంతా చెప్పాలి.

57 నెలల్లో మీకోసం 125 సార్లు బటన్లు

57 నెలల్లో నేను ప్రజల కోసం 125 సార్లు బటన్లు నొక్కా. ఏకంగా రూ.2.55 లక్షల కోట్లు నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాలకు వెళ్లాయి. ఇంత మంచి చేసిన మనందరి ప్రభుత్వానికి మద్దతుగా, ఈ పాలనకు కొనసాగింపుగా ప్రతి కుటుంబం, ప్రతి ఒక్కరూ మంచి భవిష్యత్ కోసం రెండు బటన్లు నొక్కాలని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. ఒకటి అసెంబ్లీకి, ఒకటి పార్లమెంటుకు. ఫ్యాన్ మీద నొక్కితే మీరు గత ఎన్నికల్లో బటన్ నొక్కి పెట్టెలో బంధించిన చంద్రముఖి బెడద శాశ్వతంగా పోతుంది. పొరపాటు చేశారంటే చంద్రముఖి మళ్లీ సైకిలెక్కుతుంది. టీ గ్లాస్ పట్టుకొని మీ ఇంటికొస్తుంది. పేదల రక్తం తాగేందుకు లకలకా అంటూ మీ ఇంటి తలుపులు తడుతుందని ప్రతి అక్కకూ, ప్రతి చెల్లెమ్మకూ చెప్పండి.

మీకు మంచి జరిగితే నాకు ఓటేయండి

మన పాలనలో మీకు మంచి జరిగితే నాకు ఓటు వేయండి అని, మీ బిడ్డకు మీరే సైనికులుగా తోడుగా నిలబడాలని మనం నిబద్ధతతో సిద్ధం అంటుంటే ఏ ఒక్కరికైనా ఏం చేశారో చెప్పుకొనేందుకు ఒక్కటీ కనిపించని పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారు. మేమూ సిద్ధం.. సంసిద్ధం అంటూ చంద్రబాబు పోస్టర్లు వేయిస్తున్నారు. ప్రజలకు మంచి చేయకుండా దేనికయ్యా సంసిద్ధం? ఎందుకు సంసిద్ధం? ఎవరితో యుద్ధం? పెత్తందార్ల తరఫున చంద్రబాబు సంసిద్ధం అంటున్నాడంటే ఎవరితోనయ్యా నువ్వు యుద్ధం చేస్తున్నావ్?

కృష్ణుడిలా కోట్ల గుండెలు తోడున్నాయి..

దుష్ట చతుష్టయం బాణాలకు బలి కావడానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు. ఇక్కడ ఉన్నది అర్జునుడు. ఆ అర్జునుడికి తోడుగా కృష్ణుడి రూపంలో ప్రతి పేదవాడి ఇంట్లో కోట్ల గుండెలున్నాయి. ప్రజలే అండగా, ప్రజలతోనే పొత్తులతో ఎన్నికల పోరాటానికి మీ బిడ్డ సిద్ధం. మరో రెండు నెలల్లోనే ఎన్నికలు. ఈరోజు నుంచి చూస్తే మరో 55 రోజులు కూడా ఉండవేమో. చంద్రబాబు అబద్ధాలు, ఈనాడు, ఏబీఎన్, టీవీ 5, ఎల్లో మీడియా తప్పుడు కథనాలను ఎదుర్కొంటూ పేదవాడి భవిష్యత్తును కాపాడేందుకు మీరంతా సిద్ధంగా ఉండాలి.

మీకెందుకు ఓటేయాలి బాబూ?

జగన్ మార్కు ప్రతి గ్రామంలో కనిపిస్తున్నప్పుడు, ప్రతి పేద ఇంట్లో, ప్రతి సామాజికవర్గంలో, ప్రతి ప్రాంతంలో మంచి మార్పు కనిపిస్తున్నప్పుడు బాబుకు ఎందుకు ఓటు వేయాలని అడుగుతున్నా. జగన్ పాలనలో ప్రజలకు మంచి చేయలేదని, జగన్‌కు ప్రజాబలం లేదని చంద్రబాబు నిజంగా నమ్మితే ఇన్ని పొత్తులు ఎందుకయ్యా చంద్రబాబూ? అని అడుగుతున్నా. ఊతం కోసం అటో కర్రా, ఇటో కర్ర ఎందుకయ్యా? సైకిల్ తోయడానికి నీకొక ప్యాకేజీ స్టార్ ఎందుకయ్యా? జగన్ ప్రతి ఇంటికీ మంచి చేశాడని తెలుసు కాబట్టే చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం

- మనలో ఎవరు పోటీలో ఉన్నా ప్రజలు బ్రహ్మరథం పడతారు
- 'ఎక్స్'లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి : మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అలాగే, 'ప్రజాసేవలో ఉన్న వారికి మరో రెండు మెట్లు పైకి ఎక్కే అవకాశం కల్పిస్తాం. ఈ ఐదేళ్ల ప్రజలకు మంచి పాలన అందించాం. కాబట్టి, మనలో ఎవరు పోటీలో ఉన్నా ప్రజలు బ్రహ్మరథం పడతారు'.. అని ఆదివారం రాత్రి 'ఎక్స్'లో ఆయన ట్వీట్ చేశారు.

సోషల్ మీడియాలో పచ్చమంద దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

సాక్షి, అమరావతి : 'చంద్రబాబు కపట వాగ్దానాలు, ఎల్లో మీడియా తప్పుడు కథనాలను ఎండగట్టడానికి మన సోషల్ మీడియా సైన్యమంతా సిద్ధమా? సోషల్ మీడియాలో మన ప్రభుత్వంపై పచ్చమంద చేస్తున్న దుష్ప్రచారాన్ని మీ సెల్‌ఫోన్ ద్వారా తిప్పికొట్టండి'.. అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో మరో ట్వీట్ చేశారు.

ఎంసీహెచ్‌లో శిశువు అపహరణ

కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఘటన



శిశువును తీసుకెళ్తున్న మహిళ (సీసీ ఫుటేజీ)

కరీంనగర్‌టౌన్/ కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లాకేంద్రంలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో ఆదివారం ఓ శిశువు అపహరణకు గురైంది. బాధిత కుటుంబసభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. బిహార్‌లోని ముజఫర్ జిల్లాకు చెందిన మనోజ్‌రామ్– నిర్మలాదేవి దంపతులు వలసకూలీలు. కొత్తపల్లి మండలం బావుపేటలో నివాసముంటున్నారు. నిర్మలాదేవి రెండోకాన్పుకు ఈనెల 16న కరీంనగర్‌లోని ఎంసీహెచ్‌లో చేరి అదేరోజు రాత్రి పాపకు జన్మనిచ్చింది. నిర్మలాదేవికి ఫిట్స్ రావడంతో ఐసీయూలో ఉంచారు. శిశువు వద్ద వారి బంధువులు ఉన్నారు. ఆదివారం మనోజ్‌రామ్ ఐసీయూలో ఉన్న నిర్మలాదేవి వద్ద తన అన్న కొడుకును ఉంచి భోజనం తీసుకురావడానికి వెళ్లాడు. తల్లిపాలు తాగించాలని చెప్పడంతో ఆ బాలుడు శిశువుకు తీసుకొచ్చి ఎంసీహెచ్ ఎంట్రన్స్ వద్ద ఓ మహిళకు అప్పగించాడు. చాలా సేపటికి శిశువు అదృశ్యమైన విషయాన్ని ఆ కుటుంబసభ్యులు, ఆస్పత్రి సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఎంసీహెచ్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. ఆస్పత్రిలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. బాలుడే శిశువును సదరు మహిళకు అప్పగించినట్టు గుర్తించారు. మనోజ్‌రామ్ మాత్రం ఆ బాలుడికి ఏమీ తెలియదని, ఎవరు పిలిస్తే వారితో వెళ్లిపోతాడని అంటున్నాడు. శిశువును ఎత్తుకెళ్లిన మహిళ శనివారం కూడా బాధిత కుటుంబంతోనే ఉందని ఆస్పత్రిలో ఉన్నవారు చెబుతున్నారు. మనోజ్‌తో పాటు అతని అన్న కొడుకును స్టేషన్‌కు పిలిపించి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బయ్యారంలో ఏటీఎం లూటీ.. రూ.29.70 లక్షలు అపహరణ



ఏటీఎంను పగులకొట్టి నగదును లూటీ చేసిన దృశ్యం

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని ఇల్లందు–మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోని నగదును ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు లూటీ చేశారు. వివరాలిలా.. ఆరుగురు వ్యక్తులు కారులో బయ్యారం ఏటీఎం వద్దకు వచ్చారు. తెల్లవారుజామున మూడు దఫాలుగా రహదారిపై రెక్కీ నిర్వహించి ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత ఏటీఎం లోపలికి ముగ్గురు వెళ్లి షట్టర్ క్లోజ్ చేశారు. మరో ముగ్గురు బయట కాపలాగా ఉన్నారు. లోనికి వెళ్లిన వారు వెంట తెచ్చుకున్న బ్లాక్ స్ప్రేయర్‌తో సీసీ కెమెరా పనిచేయకుండా చేశారు. అనంతరం గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంలో నగదును ఉంచిన బాక్స్‌ను పగులకొట్టి అందులోని రూ.29.70 లక్షలు తీసుకున్నారు. ఇంతలో బయట ఉన్న ముగ్గురు వ్యక్తులు కారుతో ఏటీఎం వద్ద సిద్ధంగా ఉండగా.. మిగిలిన ముగ్గురూ ఎక్కి మహబూబాబాద్ వైపు వెళ్లిపోయినట్టు రహదారి పక్కన ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైంది. ఏటీఎం చోరీల్లో అనుభవం ఉన్న దొంగల పనే ఇదనీ, త్వరలోనే పట్టుకుని నగదు రికవరీ చేస్తామని ఏఎస్పీ చెన్నయ్య తెలిపారు.

మహిళా కార్మికులపై ఫోకస్



సంఘటితం ప్రకటిస్తున్న మహిళా కార్మికులు

గోదావరిఖని: మహిళాకార్మికుల భద్రత, సమస్యలు, సవాళ్లపై బీఎంఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆదివారం జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రప్రథమంగా మహిళలకోసం ప్రత్యేక సమయం కేటాయించారు. వారి సమస్యలు, పరిష్కారాలపై చర్చించడానికి మూడు గంటలపాటు వేదిక కేటాయించారు. రాష్ట్ర మహాసభల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమమని నాయకులు తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని మహిళా కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని ప్రతినిధులు తీర్మానించారు.

విద్యార్థినుల ఆత్మహత్యల కలకలం!

హైదరాబాద్‌లో ఇమాంపేట గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య

- వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరి బలవన్మరణం
- బాలికల మరణాలకు అంతుచిక్కని కారణాలు
- వరుస ఘటనలతో విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో ఆందోళన



ఇరుగు అస్మిత (ఫైల్)

సూర్యాపేట రూరల్: సూర్యాపేట జిల్లా ఇమాంపేట వద్ద గల ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతున్న విద్యార్థిని వైష్ణవి ఈ నెల 10న హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతురాలి బంధువులు, విద్యార్థి సంఘాలు ధర్నాలు చేయడంతో దిగివచ్చిన ప్రభుత్వ అధికారులు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీని సస్పెండ్ చేశారు.

సెలవులు ఇవ్వడంతో..

వైష్ణవి ఉదంతం మరువకముందే తాజాగా ఇదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సూర్యాపేట జిల్లా మోతె మండలం బుర్కచర్ల గ్రామానికి చెందిన ఇరుగు ఆనంద్, జ్యోతిల కుమార్తె అస్మిత (15) శనివారం హైదరాబాద్‌లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వైష్ణవి ఆత్మహత్య అనంతరం విద్యార్థినులు భయపడకుండా ఉంటానికి పాఠశాలకు నాలుగు రోజులు సెలవులు ప్రకటించారు. దీంతో అస్మిత సెలవుల్లో హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్న తల్లి వద్దకు వెళ్లింది. శనివారంతో సెలవులు అయిపోతున్నందున తిరిగి పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుందని చెప్పి.. తల్లి తన పనులకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి అస్మిత ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుందని బంధువులు తెలిపారు. పాఠశాలకు తిరిగి వెళ్లాల్సిన రోజే అస్మిత ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అస్మిత, వైష్ణవి రూమ్‌మేట్స్?

గురుకుల పాఠశాల విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు ఇటు తల్లిదండ్రులను, అటు విద్యార్థినులను తీవ్ర కలవరానికి గురిచేస్తున్నాయి. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వైష్ణవి రూమ్‌లోనే అస్మిత కూడా ఉండేదని తెలిసింది. ఒకే రూమ్‌లో ఉండటంతో వైష్ణవి మరణాన్ని జీర్ణించుకోలేక అస్మిత కూడా బలవన్మరణానికి పాల్పడినట్లు చెపుతున్నారు. వారం వ్యవధిలోనే ఇద్దరు బాలికలు ఆత్మహత్యలకు పాల్పడటం వారి కుటుంబాలు, తోటి విద్యార్థినుల్లో విషాదాన్ని నింపింది. అస్మిత మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామం బుర్కచర్ల తీసుకు వచ్చి ఆదివారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఇమాంపేట గురుకుల పాఠశాల తనిఖీ

ఇమాంపేట వద్ద గల ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం సాయంత్రం సోషల్ వెల్ఫేర్ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి తనిఖీ చేశారు. తరగతి గదులు, భోజనశాల, బాలికల విశ్రాంతి గదులను పరిశీలించారు. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు బాలికల ఆత్మహత్యల నేపథ్యంలో విద్యార్థినుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించాలని, పిల్లలతో మమేకమై వారిని ఆటపాటలతో ఆనందింపజేయాలని సూచించారు. గురుకులాల్లో మంచి వాతావరణం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పిల్లల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం సైకియాట్రిస్టులతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఆమె వెంట గురుకుల జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి, నల్లగొండ రీజనల్ కోఆర్డినేటర్ ప్రశాంతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరుణకుమారి ఉన్నారు.

ఉన్నతాధికారుల ఆరా..

ఇమాంపేట ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో అసలు ఏం జరుగుతోంది? విద్యార్థినులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడటానికి గల కారణాలు ఏమిటి? తదితర అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సోమవారం గురుకుల పాఠశాలకు కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు వెళ్లి విచారణ జరపనున్నట్లు సమాచారం. ఈ తరహా ఘటనల వల్ల పాఠశాలలో విద్యనభ్యసించే ఇతర విద్యార్థినుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థినుల ఆత్మహత్యలపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది.

పాఠశాల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ రగడ

అధికారులపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అనుచరుల ఆగ్రహం



అధికారులను వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి

తాడూరు (నాగర్‌కర్నూల్ జిల్లా): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడలో కొత్తగా నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ రగడ చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా...గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న మర్రి జనార్దన్‌రెడ్డి తన సొంత ట్రస్టు ద్వారా అధునాతన హంగులతో పునర్నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఆదివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి..ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. అయితే ముందుగానే మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో పాఠశాల ప్రారంభించడంతో రాజేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాల భవనానికి బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఆయన వర్గం కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు డీఈఓ గోవిందరాజులును ప్రశ్నిస్తూ దాడికి యత్నించారు. దీంతో పోలీసులు వెంటనే డీఈఓను అక్కడి నుంచి తీసుకెళ్లారు. అనంతరం పాఠశాల ప్రారంభోత్సవానికి పిలిచి అవమానించారని డీఈఓ, సంబంధిత విద్యాధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే కోరారు. కాగా, పాఠశాల ప్రారంభోత్సవాన్ని రద్దు చేశామని, త్వరలోనే మరోసారి చేపడుతామని డీఈఓ పేర్కొన్నారు. ప్రారంభోత్సవాన్ని రద్దు చేశామని, త్వరలోనే మరోసారి చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

కారుణ్య వర్సిటీ–18 అమెరికన్ వర్సిటీల మధ్య ఎంఓయూ

సాక్షి, హైదరాబాద్: కారుణ్య యూనివర్సిటీ, 18 అమెరికన్ యూనివర్సిటీల మధ్య ఎంఓయూ కుదిరింది. ఈమేరకు 18 అమెరికన్ యూనివర్సిటీలకు చెందిన 28 మంది నిపుణులతో కూడిన ప్రతినిధుల బృందం ఆదివారం కారుణ్య యూనివర్సిటీని సందర్శించింది. ఇందులో భాగంగా అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, ఉమ్మడి విద్య, పరిశోధన కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేయడం వంటి అంశాల్లో.. అలాగే విద్య, పరిశోధన సహకారాలను పరస్పరం పెంపొందించుకునేందుకు ఈ యూనివర్సిటీలతో ఎంఓయూలు కుదుర్చుకుంది. ఉమ్మడి విద్యా, పరిశోధన కార్యక్రమాలను నిర్వహించేందుకు కారుణ్య యూనివర్సిటీ ఇండో–అమెరికన్ ఫోరమ్‌ను స్థాపించాలని యోచిస్తోంది. ఈ సందర్భంగా ప్రతినిధుల బృందం కారుణ్య వర్సిటీ లాబొరేటరీలను, పరిశోధన సౌకర్యాలను సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు.

ట్రెండింగ్‌లో 'సిద్ధం'

ఎక్స్‌లో దేశంలోనే మొదటి స్థానంలో 'సిద్ధం' హ్యాష్ ట్యాగ్



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన 'సిద్ధం' సభ సోషల్ మీడియా (సామాజిక మధ్యమాలు)లో ట్రెండింగ్‌లో నిలిచింది. ఎక్స్(ట్విట్టర్)లో దేశంలోనే మొదటి స్థానంలో 'సిద్ధం' హ్యాష్ ట్యాగ్‌తో ట్రెండ్ అయింది. సిద్ధం సభ వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ అభిమానులు భారీ ఎత్తున ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్టులు చేశారు. జనసంద్రాన్ని తలపిస్తున్న 'సిద్ధం' సభా ప్రాంగణం, సభకు హాజరైన ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు నీరాజనాలు పలుకుతున్న జనం ఫొటోలతో సామాజిక మాధ్యమాలు నిండిపోయాయి. వైఎస్ జగన్ ఎగైన్, ఎండ్ ఆఫ్ టీడీపీ హ్యాష్‌ట్యాగ్‌లతోనూ 'సిద్ధం' సభ విశేషాలను ఎప్పటికప్పుడు పోస్టు చేస్తూ అభిమానులు హోరెత్తించారు. తద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఉన్న క్రేజ్ గురించి మరోమారు దేశ వ్యాప్తంగా చర్చకు వచ్చింది.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

రామగిరి(నల్లగొండ): జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం అకస్మాత్తుగా పొగలు వచ్చాయి. విశాఖపట్నం నుంచి గుంటూరు మీదుగా హైదరాబాద్ వైపు వెళ్తుండగా ఆదివారం సాయంత్రం నల్లగొండ జిల్లా తిప్పర్తి స్టేషన్ వద్దకు రాగానే రైలులో ఒక్కసారిగా పొగలు కమ్ముకున్నాయి. ప్రయాణికులు భయాందోళనకు గురికావడంతో రైలును నిలిపివేశారు. రైల్వే సిబ్బంది మరమ్మతులు చేసిన అనంతరం రైలు నల్లగొండకు బయలుదేరింది.

సీఏఎఫ్ కమాండర్‌ను పొట్టనబెట్టుకున్న మావోలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో మావోయిస్టులు సాయుధ బలగాల కమాండర్‌ను దారుణంగా చంపారు. కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దర్బా గ్రామంలో ఆదివారం జరిగే సంతకు ఛత్తీస్‌గఢ్ సాయుధ బలగాల 4వ బెటాలియన్ జవాన్లు బందోబస్తుగా ఉన్నారు. ఉదయం 9.30 గంటల సమయంలో గ్రామీణుల వేషధారణలో వచ్చిన మావోయిస్టులు ఏమరుపాటుగా ఉన్న కమాండర్ తేజో రాం బౌర్యా తలపై గొడ్డలితో వేటు వేశారు. దీంతో, ఆయన అక్కడికక్కడే కుప్పకూలి, ప్రాణాలొదిలారు. ఆ వెంటనే మావోయిస్టులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న బలగాలు మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చేపట్టారు.

ఉపేంద్ర కుష్వాహా కొత్త పార్టీ

పట్నా: జేడీయూ చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌తో తెగదెంపులు చేసుకున్న కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుష్వాహా 'రాష్ట్రీయ లోక్ మంచ్'పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. తన పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు కూడా లభించిందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 40 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురి దుర్మరణం

బర్న్స్‌విల్లె: అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు చనిపోయారు. మిన్నెపొలిస్ శివారులోని ఓ ఇంట్లో గృహహింస జరుగుతోందంటూ ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు అందింది. అక్కడికి వెళ్లిన బర్న్స్‌విల్లె పోలీసులపై కాల్పులు జరిగాయి. ఘటనలో ఇద్దరు పోలీసులతోపాటు ఒక కార్యకర్త ప్రాణాలు కోల్పోయారు.

పీఎంఎల్-పీపీపీ పొత్తు నేడు ఖరారయ్యే అవకాశం

ఇస్లామాబాద్: సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ మధ్య సయోధ్య కుదరలేదు. చర్చల్లో కీలక పురోగతి సాధించామని చెబుతున్నా సందిగ్ధం వీడలేదు. సోమవారం తుది విడత భేటీలో అధికార పంపిణీ ఫార్ములా ఖరారు చేయాలని ఇరువర్గాలు నిర్ణయించాయి. ప్రధానిగా షెహబాజ్ షరీఫ్‌ను పీఎంఎల్-ఎన్ నామినేట్ చేయడం తెలిసిందే. నేషనల్ అసెంబ్లీలో 265 స్థానాలకు ఈ నెల 8వ తేదీన జరిగిన ఎన్నికల్లో స్వతంత్రులుగా పోటీ చేసిన ఇమ్రాన్ ఖాన్ పార్టీ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ అభ్యర్థులు 93 సీట్లు, పీఎంఎల్-ఎన్ 75, పీపీపీ 54 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుకు కనీసం 133 మంది అభ్యర్థుల మద్దతు అవసరం.

చేజారిన తోడే.. బొడ్డుతాడై...

యుద్ధంలో వేలాదిగా బలవుతున్న ఉక్రెయిన్ జవాన్లు

వారి వీర్యం/అండంతో పిల్లల్ని కంటున్న భాగస్వాములు

ఉక్రెయిన్. ఒకప్పటి అందాల దేశం. ఇప్పుడు రష్యా రక్త దాహానికి బలైన శిథిల చిత్రం. యుద్ధం మిగిల్చే బీభత్సానికి సాక్షి. పోరులో ప్రాణాలొదిలిన వేలాది మంది ఉక్రెయిన్ యువ సైనికుల జీవిత భాగస్వాములది మాటలకందని దైన్యం. వారిలోనూ అసలు సంతానమే లేనివారిదైతే చెప్పనలవి కాని వ్యథ. ఎవరి కోసం బతకాలో తెలియని నైరాశ్యం. అయితే తమ జీవిత భాగస్వాములు ముందుజాగ్రత్తగా భద్రపరిచి వెళ్లిన వీర్యం/అండాలు వారిలో కొత్త ఆశలు నింపుతున్నాయి. వాటి సాయంతో బిడ్డలను కంటున్నారు. తమను శాశ్వతంగా వీడి వెళ్లిన తోడు తాలూకు నీడను వారిలో చూసుకుంటున్నారు. భవిష్యత్తుపై ఆశలు పెంచుకుంటున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్




మన పాప నవ్వుల సాక్షిగా... నువ్వెప్పటికీ నాతోనే...

మనసుతో చూడగలిగితే లక్ష భావాలను, కోటి ఊసులను కళ్లకు కట్టే ఫొటో ఇది. ఇందులో నేపథ్యంలోని పోస్టర్లో కనిపిస్తున్నది రష్యాతో పోరులో మరణించిన ఉక్రెయిన్ సైనికుడు విటాలీ. బుల్లి పాపాయిని ఎత్తుకున్నది అతని భార్య విటాలినా. భర్త మరణానంతరం ఆయన వీర్యంతో గర్భం దాల్చి ఈ పండంటి పాపాయికి జన్మనిచ్చిందామె. కూతురిని భర్త ఫొటోకు చూపిస్తూ ఇలా భావోద్వేగానికి గురైంది. రష్యాతో యుద్ధం మొదలయ్యే కొద్ది నెలల ముందే విటాలీ ఉక్రెయిన్ సైన్యంలో చేరాడు. ఫ్రంట్ లైన్‌లో పోరాడుతూ యుద్ధం మొదలైన తొలి నాళ్లలోనే మరణించాడు. అప్పటికే విటాలినా 13 వారాల గర్భవతి. కానీ ఆ గర్భం నిలవలేదు. భర్త క్షేమం తాలూకు ఆందోళనే అందుకు ప్రధాన కారణమని ఇప్పటికీ కన్నీళ్లపర్యంతం అవుతుంటుంది విటాలినా. ''అటు జీవితాంతం తోడుండాల్సిన భర్తను, ఇటు ఇంకా లోకమే చూడని మా కలల పంటను కొద్ది రోజుల తేడాతో శాశ్వతంగా కోల్పోయా. బతుకంతా ఒక్కసారిగా శూన్యంగా తోచింది'' అంటూ అప్పటి రోజులను గుర్తు చేసుకుందామె. ''ఇలాంటి పరిస్థితిని ఊహించే నా భర్త వీర్యాన్ని భద్రపరిచి వెళ్లాడు. దాని సాయంతో తల్లిని కావాలని నిర్ణయించుకున్నా. అలా ఈ చిట్టి తల్లి ఈ లోకంలోకి అడుగు పెట్టింది. తన రాకతో నాకు నిజంగా సాంత్వన చేకూరింది. పాప వాళ్ల నాన్న పోలికలనే గాక హావభావాలను కూడా ముమ్మూర్తులా పుణికి పుచ్చుకుంది. దైవ కృప అంటే బహుశా ఇదేనేమో. నిజానికి గంపెడు సంతానాన్ని కనాలని, మాది పెద్ద కుటుంబం కావాలని పెళ్లికి ముందు నుంచీ ఎన్నెన్నో కలలు కన్నాం. కానీ విధి రాత మరోలా ఉంది. అయినా తను ముందుచూపుతో తీసుకున్న నిర్ణయం ఈ చిట్టితల్లి రూపంలో ఇలా ఫలించింది'' అంటుంటే విని చెమర్చని కళ్లు లేవు. కాస్త అటూ ఇటుగా ఉక్రెయిన్ సైనిక వితంతువులందరి గాథ ఇది...!

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలై రెండేళ్లవుతోంది. 2022 ఫిబ్రవరి 24న ఆ దేశంపై రష్యా సైన్యం హఠాత్తుగా విరుచుకుపడింది. రోజుల్లో తల వంచుతుందనుకున్న ఉక్రెయిన్ దీటుగా పోరాడుతోంది. దాంతో రెండేళ్లయినా పోరు కొనసాగుతూనే ఉంది. యుద్ధమంటేనే ప్రాణనష్టం! ఇప్పటిదాకా ఏకంగా 70,000 మంది ఉక్రెయిన్ జవాన్లు మరణించినట్లు అంచనా. మరో లక్షన్నర మందికి పైగా క్షతగాత్రులుగా మారారు. యుద్ధంలో జవాను వీరమరణం పొందితే అతడి/ఆమె వంశం అంతమైపోవాల్సిందేనా? బతికుండగానే అండాలు, వీర్యం భద్రపర్చుకొని, తాము లేకపోయినా జీవిత భాగస్వామి ద్వారా సంతానం పొందే వెసులుబాటును ఎందుకు ఉపయోగించుకోవద్దు? ఇలాంటి ప్రశ్నలు ఉక్రెయిన్ సైన్యం నుంచి గట్టిగా వినిపించాయి. దీనిపై ప్రభుత్వమూ సానుకూలంగా స్పందించింది. పార్లమెంటులో ఇటీవలే ఒక బిల్లును ఆమోదించింది. అధ్యక్షుడు వొలిదిమిర్ జెలెన్‌స్కీ సంతకం చేస్తే చట్టంగా మారనుంది. ఇదొక విప్లవాత్మక చట్టం కానుందని నిపుణులు ప్రశంసిస్తున్నారు. యుద్ధంలో మరణించినవారి వీర్యం/అండాలతో సంతానం పొందే అవకాశం ఇప్పటిదాకా ఉక్రెయిన్‌లో చట్టపరంగా లేదు. ఇక ఈ పరిస్థితి మారనుంది...

- ఉక్రెయిన్ పార్లమెంట్‌లో ఆమోదించిన బిల్లు ప్రకారం జవాన్లు తమ వీర్యం, అండాలు భద్రపర్చుకోవచ్చు. వారు యుద్ధంలో అమరులైతే వాటి సాయంతో జీవిత భాగస్వాములు సంతానం పొందవచ్చు.
- ఇందుకు వీలుగా యుద్ధంలో మృతి చెందిన జవాన్ల వీర్యం/అండాలను మూడేళ్ల పాటు భద్రపరుస్తారు. ఇందుకు ప్రభుత్వమే ఆర్థిక సాయం అందిస్తుంది.
- యుద్ధంలో క్షతగాత్రులై, ఆరోగ్యం దెబ్బతిని సంతానోత్పత్తికి, బిడ్డలకు జన్మనిచ్చే సామర్థ్యానికి దూరమైన సైనికులు కూడా వీర్యం/అండాలను భద్రపర్చుకుని సంతానం పొందవచ్చు.
- ఇలా భద్రపర్చిన వీర్యం/అండాలతో పుట్టే పిల్లలకు చట్టబద్ధంగా అన్ని హక్కులూ ఉంటాయి. అమర వీరులైన తల్లి/తండ్రి పేరును వారి బర్త్ సర్టిఫికెట్‌లో ముద్రిస్తారు!
- ఈ కొత్త చట్టాన్ని అంతా స్వాగతిస్తున్నారు. దీని ద్వారా అమర సైనికుల కుటుంబ వారసత్వం కొనసాగుతుందంటున్నారు.
- జవాన్ల వీర్యం/అండాలు ఉచితంగా భద్రపరుస్తామని ఉక్రెయిన్‌లో పలు సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. యుద్ధం మొదలైనప్పటి నుంచే ఇలాంటి ఆఫర్లు ఇస్తున్నాయి.
- వీర్యం/అండాలు భద్రపర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్న సైనికుల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరిగింది. ప్రభుత్వం అనుమతితో పాటు ఆర్థిక సాయమూ అందిస్తుందని స్పష్టత రావడమే కారణమని తెలుస్తోంది.
- యుద్ధంలో గాయపడిన పలువురు జవాన్లు ఈ సేవలు ఉపయోగించుకుంటున్నారు.
- ఇప్పటికే ఒక బిడ్డ ఉన్నవారు కూడా మరో బిడ్డను కనడానికి ముందుకొస్తున్నారు. ఇలా భద్రపర్చుకుంటున్న జవాన్లలో మహిళల కంటే పురుషుల సంఖ్య అధికంగా ఉంది.

గ్రామాలకూ న్యాయవిద్య: సీజేఐ



న్యూఢిల్లీ: న్యాయ విద్య కోర్సులను మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఇంగ్లిష్ మాట్లాడని విద్యార్థులను సైతం న్యాయవిద్యలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నేషనల్ లా యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'సాంకేతికత మనకు సుదూరప్రాంత విద్యార్థులకు సైతం చేరువయ్యే సామర్థ్యాన్ని అందించింది. న్యాయ విద్య ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ, ఆంగ్లం మాట్లాడే పట్టణ ప్రాంత పిల్లలకు మాత్రమే ప్రస్తుతం ఇది అనుకూలంగా ఉంది'అని అన్నారు. 'ఇటీవల అయిదు లా యూనివర్సిటీల్లో ఓ సర్వే చేపట్టాం. విభిన్న భాషా నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులు కేవలం ఇంగ్లిష్‌లో మాట్లాడ లేకపోవడమే కారణంతో ఈ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందలేకపోతున్నట్లు సర్వేలో తేలింది'అని సీజేఐ వెల్లడించారు. భాషా పరమైన అవరోధాలను అధిగమించేందుకు భాషిణి సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉందన్నారు. ఇందులో సుప్రీంకోర్టు 1950–2024 మధ్య వెలువరించిన 36 వేల పైచిలుకు తీర్పులను తర్జుమా చేసి ఇందులో పొందుపరిచి ఉన్నాయన్నారు. జిల్లా స్థాయి కోర్టుల్లో ఇంగ్లిష్ మాట్లాడలేని న్యాయవాదులకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. న్యాయవిద్యను హిందీలో బోధిస్తే ఉత్తమ విద్యార్థులు తయారవుతారని వర్సిటీ యంత్రాంగానికి ఆయన సూచించారు.

కులగణన.. దేశానికి ఎక్స్‌రే: రాహుల్

ప్రయాగరాజ్/వయనాడ్: దేశ జనాభాలో ఓబీసీలు, దళితులు, గిరిజనులు కలిపి 73% వరకు ఉన్నప్పటికీ వారు యజమానులుగా ఉన్న కంపెనీల్లో టాప్–200లో ఒక్కటి కూడా లేదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. దేశానికి ఎక్స్ రే వంటి కులగణనతో ప్రతి ఒక్కటీ తేటతెల్లమవుతుందని చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో స్వరాజ్‌భవన్ వద్ద జరిగిన ర్యాలీలో మాట్లాడారు. ఎవరి జనాభా ఎంతో తెలియడానికి కులగణన ఆయుధం వంటిది. దేశ సంపదలో మీ వాటా ఎంతో తెలుసుకోవచ్చు. దేశంలోని 73 శాతం జనాభా చేతుల్లో ఎంత సంపద ఉందో తెలుస్తుంది. ఈ కులాలకు సంబంధించిన ప్రతి ఒక్కటీ వెల్లడవుతుంది'అని రాహుల్ పేర్కొన్నారు. బడా పారిశ్రామికవేత్తల రుణాలను రద్దు చేసిన ప్రభుత్వం, రైతుల రుణాలను మాత్రం మాఫీ చేయదని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు కోట్లాది రూపాయల రుణాలను క్షణాల్లోనే మంజూరు చేసే బ్యాంకులు, దళితులు, వెనుకబడిన కులాల వారిని మాత్రం దరిదాపుల్లోకి కూడా రానివ్వడం లేదని ఆరోపించారు. డబుల్ ఇంజిన్ సర్కారు అంటే అర్థం నిరుద్యోగులకు డబుల్ దెబ్బ అని యూపీలోని బీజేపీ సర్కారునుద్దేశించి రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.



ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

వయనాడ్‌లో పర్యటన..

రాహుల్ ఆదివారం ఉదయం కేరళలోని సొంత నియోజకవర్గం వయనాడ్‌లో పర్యటించారు. ఇటీవల ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారికి అన్నివిధాలా అండగా ఉంటానని చెప్పారు. వారికి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని అధికారులను కోరారు.

నవ భారతం నిర్మిద్దాం: మోదీ

'అబ్‌కీ బార్ చార్‌సౌ పార్' మిషన్‌తో పని చేద్దాం

- ఎన్డీఏకు 400 సీట్లు వస్తాయని విపక్షాలూ అంటున్నాయి
- కాంగ్రెస్ బారినుంచి దేశాన్ని, యువతను కాపాడాలి
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పార్టీ శ్రేణులకు పిలుపు


మోదీని గజమాలతో సత్కరిస్తున్న అమిత్ షా, రాజ్‌నాథ్, జేపీ నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ: నవ భారత నిర్మాణం కోసం కదలి రావాలని బీజేపీ శ్రేణులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. లక్ష్య సాధన కోసం రాబోయే 100 రోజులు ఎంతో కీలకమని, 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్' మిషన్‌తో పనిచేద్దామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం కాకుండా దేశ నిర్మాణం కోసం పనిచేద్దామని సూచించారు. అభివృద్ధి ఎజెండా లేని కాంగ్రెస్ పార్టీ నుంచి దేశాన్ని, యువతను రక్షించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. భారతదేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు కోరుకుంటున్నాయని చెప్పారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలంటూ చాలా దేశాలు తనను ఆహ్వానిస్తున్నాయని తెలిపారు. ఇండియాలో మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారని ఆయా దేశాలు భావిస్తున్నాయని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏకు 400 స్థానాలు వస్తాయని మన దేశంలో విపక్షాలు సైతం నినదిస్తున్నాయని గుర్తుచేశారు. ఢిల్లీలో భారత్ మండపంలో రెండు రోజుల పాటు జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. బీజేపీ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 64 నిమిషాలపాటు ప్రసంగించారు. కాంగ్రెస్ సహా విపక్షాలపై నిప్పులు చెరిగారు. సొంతంగా అనుభవించడానికి అధికారం కోరుకోవడం లేదని, దేశానికి మేలు చేయాలన్నదే తన తపన అని స్పష్టం చేశారు.

శతాబ్దాల సమస్యలను పరిష్కరించాం

దేశంలో శతాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కారించేందుకు సాహసం చేశామని మోదీ చెప్పారు. ''500 ఏళ్ల నాటి అయోధ్య సమస్యను రామమందిర నిర్మాణంతో పరిష్కరించాం. ఏడు దశాబ్దాల తర్వాత ఆర్టికల్ 370 నుంచి జమ్మూకశ్మీర్‌కు విముక్తి లభించింది. మూడు దశాబ్దాల తర్వాత మహిళ రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ చట్టాలు తెచ్చాం. పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. నా సొంతింటి గురించే ఆలోచించుకుని ఉంటే ఇంతమందికి ఇళ్లు నిర్మించివ్వడం సాధ్యమయ్యేది కాదు. మూడోసారి అధికారంలోకి వచ్చాక భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారుస్తాం. సీఎంగా, ప్రధానిగా ఎంతో సాధించారు, ఇక విశ్రాంతి తీసుకోండని ఓ సీనియర్ నాయకుడు నాతో అన్నారు. నేను రాజనీతి, రాష్ట్రనీతి కోసం పని చేస్తా. ఛత్రపతి శివాజీ ఆశయాలే నాకు స్ఫూర్తి'' అన్నారు.

దేశాన్ని విభజించే పనిలో కాంగ్రెస్

భాష, ప్రాంతం ఆధారంగా దేశాన్ని విభజించే పనిలో కాంగ్రెస్ పార్టీ నిమగ్నమైందని ప్రధానమంత్రి దుయ్యబట్టారు. దేశ సైనికుల నైతిక స్థైర్యాన్ని, మనోధైర్యాన్ని దెబ్బతీసే పాపం కాంగ్రెస్ చేసిందన్నారు. సైన్యం సాధించిన విజయాలపై ప్రశ్నలు లేవనెత్తిందని విరుచుకుపడ్డారు. దేశానికి రఫేల్ యుద్ధ విమానాలు రాకుండా అడ్డుకొనేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమికి అభివృద్ధి ఎజెండానే లేదన్నారు. బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను కాంగ్రెస్ పెంచి పోషించిందని విమర్శించారు. గతంలో ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ ఇప్పటికీ కుట్రలు చేస్తోందన్నారు. దేశాభివృద్ధి పట్ల ఎలాంటి ప్రణాళిక లేని ఆ పార్టీ విచ్చలవిడిగా హామీలు ఇస్తోందని ఆక్షేపించారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని దెబ్బతీసేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.

వచ్చే వెయ్యేళ్లలో 'రామరాజ్యం'

అయోధ్య రామాలయమే ప్రతీక
బీజేపీ జాతీయ సదస్సులో తీర్మానం

అయోధ్యలో రామ మందిర నిర్మాణం పట్ల బీజేపీ హర్షం వెలిబుచ్చింది. ఇది ప్రతి భారతీయుడికి ఆనందం కలిగించిందని పేర్కొంది. రాబోయే వెయ్యేళ్లలో సంవత్సరాల్లో స్థాపించబోయే రామరాజ్యానికి ఈ ఆలయం ప్రతీక అంటూ ఆదివారం జాతీయ సదస్సులో తీర్మానాన్ని ఆమోదించింది. ''అయోధ్య రామాలయం జాతిని జాగృతం చేసే ఆలయం. వికసిత్ భారత్ తీర్మానాల సాకారంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది. రాముడి జన్మస్థానంలో భవ్య మందిర నిర్మాణం చరిత్రాత్మక విజయం. తీర్మానంలో ప్రస్తావించారు. రాజ్యాంగ అసలు ప్రతిలో సీతా రామ లక్ష్మణుల చిత్రాలున్నాయి. పౌరుల ప్రాథమిక హక్కులకు రాముడు స్ఫూర్తి అనేందుకిదే నిదర్శనం. రామరాజ్యమనే భావన మహాత్మాగాంధీ హృదయంలోనూ ఉండేది. ఆ ఆదర్శాలను మోదీ చక్కగా పాటిస్తున్నారు'' అంటూ కొనియాడింది. రామ మందిర ప్రాణప్రతిష్టను విజయవంతంగా నిర్వహించిన మోదీకి అభినందనలు తెలిపింది.

వచ్చే వంద రోజులు కీలకం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వచ్చే 100 రోజుల ఎంతో కీలకమని మోదీ చెప్పారు. ఈ 100 రోజులు కొత్త శక్తి, ఉత్సాహం, విశ్వాసంతో పని చేయాలని సూచించారు. ''ఈ రోజు ఫిబ్రవరి 18. దేశంలో 18 ఏళ్లు నిండిన యువత 18వ లోక్‌సభకు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. రాబోయే వంద రోజుల్లో ప్రతి కొత్త ఓటరును, ప్రభుత్వ పథకాల లబ్ధిదారును పలుకరించండి. ప్రతి ఇంటికీ వెళ్లండి. అందరి విశ్వాసం పొందండి. బీజేపీకి అత్యధిక సీట్లు వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలి. బీజేపీకి సొంతంగా 370కి పైగా స్థానాలు, ఎన్డీఏకి 'అబ్‌కీ బార్, చార్‌సౌ పార్' మిషన్‌తో పని చేద్దాం. ఇకపై భారత్ స్వప్నాలు, సంకల్పాలు విశాలమైనవిగా ఉంటాయి. ఈ పదేళ్లలో ఒక మైలురాయిని మాత్రమే చేరాం. కోట్లాది మంది ప్రజల జీవితాలను మార్చాల్సి ఉంది. తీసుకోవాల్సిన నిర్ణయాలెన్నో ఉన్నాయి. యువత, మహిళ, పేదలు, రైతుల శక్తిని 'వికసిత్ భారత్' నిర్మాణానికి వినియోగించుకోవాలి. ఆయా వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, కొత్త చట్టాలు తీసుకొచ్చాం. 2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్' అనే పెద్ద తీర్మానం చేసుకున్నాం'' అన్నారు.

విపక్ష కూటమిలో 2జీ, 3జీ, 4జీ పార్టీలు

మూడోసారీ మోదీయే: అమిత్ షా

న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మహాభారత యుద్ధంతో పోల్చారు. పాండవులు, కౌరవుల్లా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్ నాయకత్వంలోని 'ఇండియా' కూటమి తలపడబోతున్నాయని చెప్పారు. ''విపక్ష కూటమిలోని పార్టీలన్నీ వారసత్వ, బుజ్జగింపు, అవినీతి రాజకీయాల్లో ఆరితేరాయి. అవన్నీ 2జీ, 3జీ, 4జీ పార్టీలు. వాటిని రెండో తరం, మూడో తరం, నాలుగో తరం నేతలు నడిపిస్తున్నారు'' అని ఎద్దేవా చేశారు. ఆదివారం బీజేపీ జాతీయ సదస్సులో 'బీజేపీ: దేశానికి ఆశ, ప్రతిపక్షానికి నిరాశ' తీర్మానంపై అమిత్ షా మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో ప్రజలకు బాగా తెలుసన్నారు. ప్రధాని మోదీ విపక్షాల అనైతిక రాజకీయాలకు ఇప్పటికే చరమగీతం పాడారని, దేశంలో అభివృద్ధి రాజకీయాలను తీసుకొచ్చారని కొనియాడారు. ''ప్రజల మనస్సులో ఏ సందేహాలూ లేవు. మోదీని మూడోసారి ప్రధానిగా ఎన్నుకోవాలని ఎప్పుడో నిర్ణయించుకున్నారు. మోదీ తాను కరిగిపోతూ వెలుగులు పంచే కొవ్వొత్తి లాంటివారు. దేశాభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారు. బీజేపీలో వారసత్వ రాజకీయాలే ఉంటే ఒకప్పుడు టీ అమ్ముకొని జీవించిన పేద తండ్రి కుమారుడైన మోదీ ప్రధాని అయ్యేవారు కాదు'' అన్నారు.

జేపీ నడ్డా కొనసాగింపు

సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా పదవీ కాలాన్ని ఈ ఏడాది జూన్ వరకు పొడగించారు. ఆదివారం బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నడ్డా పదవీకాలం పొడిగింపు ప్రతిపాదనను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. లోక్‌సభ ఎన్నికలకు ఆయన సారథ్యంలోనే ఎదుర్కొంటామని బీజేపీ ప్రకటించింది. ముఖ్యమైన పార్టీ నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకునే అధికారాన్ని నడ్డాకు కట్టబెట్టారు.

గృహిణుల సేవలకు వెలకట్టలేం: సుప్రీం

న్యూఢిల్లీ: ఇంట్లో గృహిణులు రోజంతా చేసే పనులకు వెలకట్టలేమని సుప్రీం కోర్టు పేర్కొంది. గృహిణి బాధ్యతలు ఎంతో గౌరవప్రదమైనవని, డబ్బుతో వాటిని పోల్చలేమని తెలిపింది. ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు వ్యాఖ్యానించింది. వాహన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహిళ కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.6 లక్షలకు పెంచుతూ తీర్పు వెలువరించింది. 2006లో ఓ మహిళ వాహనం నడుపుతూ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఆమె నడిపే వాహనానికి బీమా చేయించలేదు. మృతురాలి భర్త, మైనర్ కుమారుడికి కలిపి రూ.2.5 లక్షలు చెల్లించాలని మోటారు వాహన క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ప్రమాదానికి కారణమైన వాహన యజమానిని ఆదేశించింది. దీనిపై మృతురాలి కుటుంబం ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించింది. మృతురాలు ఉద్యోగిని కాదు, కేవలం గృహిణి మాత్రమే. పరిహారాన్ని ఆమె జీవిత కాలాన్ని, నామమాత్రపు ఆదాయాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని నిర్ణయిస్తారు'అని పేర్కొంటూ పరిహారం మొత్తాన్ని పెంచేందుకు నిరాకరిస్తూ 2017లో తీర్పు చెప్పింది. దీనిపై బాధితులు అత్యున్నత న్యాయస్థానం తలుపుతట్టారు. విచారించిన ధర్మాసనం 'ఒక గృహిణి సేవలను రోజువారీ కూలీ కంటే తక్కువగా ఎలా నిర్ణయిస్తారు? ఈ విధానాన్ని మేం అంగీకరించడం. గృహిణి విలువను ఎన్నడూ తక్కువగా అంచనా వేయరాదు'అని పేర్కొంటూ రూ.6 లక్షల పరిహారాన్ని మృతురాలి కుటుంబానికి చెల్లించాలని వాహన యజమానిని ఆదేశించింది.

ఆధార్‌ను తొలగిస్తున్న కేంద్రం: మమత

సూరి: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందనివ్వడం లేదని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తమ ప్రభుత్వం ఆధార్ కార్డుతో పనిలేకుండానే సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. బీర్భూమ్ జిల్లా సూరిలో జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం మమత మాట్లాడారు. 'జాగ్రత్తంగా ఉండండి. కేంద్ర ప్రభుత్వం బెంగాల్‌లోని చాలా జిల్లాల్లో ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉచిత రేషన్, లక్ష్మీభండార్ వంటి పథకాలను ప్రజలకు అందకుండా చేసేందుకు ఇలాంటి చర్యలకు దిగుతోంది. ఆధార్ లేదనే కారణంతో పథకాలను ప్రజలకు అందకుండా నిలిపివేయవద్దని అధికారులను ఆదేశించాను. బెంగాల్ ప్రజలు భయపడొద్దు. మీకు అండగా నేనున్నాను' అన్నారు. ఆధార్ కార్డుల తొలగింపు వెనుక కుట్ర ఉందని తెలిస్తే ఒక్క కూడా దాన్ని లింక్ చేయడానికి అనుమతించబోనన్నారు. ఆధార్ కార్డులు తొలగించిన వారి వివరాలతో పోర్టల్‌ను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డులు లేని కారణంగా బ్యాంకులు లావాదేవీలను నిరాకరించినట్లయితే సహకార బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల సేవలను వాడుకోవాలని ప్రజలకు ఆమె సూచించారు.

జైన గురువు 'సల్లేఖనం'

ప్రధాని మోదీ, పలువురు సంతాపం



రాజ్‌నందన్‌గావ్: ప్రముఖ జైన గురువు ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ 'సల్లేఖన' వ్రతం ద్వారా శరీరత్యాగం చేశారు. రాజ్‌నందన్‌గావ్ జిల్లా డొంగార్‌గఢ్‌లోని చంద్రగిరి తీర్థ్‌లో ఆదివారం ఉదయం ఆయన తుదిశ్వాస వదిలారని తీర్థ్ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఆరు నెలలుగా మహారాజ్ డొంగార్‌గఢ్ తీర్థ్‌లోనే ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూడు రోజులుగా సల్లేఖన దీక్షను పాటిస్తున్నారు. జైన మతాచారం ప్రకారం సంపూర్ణ ఉపవాస దీక్ష (సల్లేఖనం)తో శరీరం వదిలారు. ఆత్మ శుద్ధికరణార్థం ఈ దీక్ష చేపట్టారు'' అని తీర్థ్ తెలిపింది. తీర్థ్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

సొంత బ్రాండ్ షూస్ విడుదల చేసిన ట్రంప్



ఫిలడెల్ఫియా: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత బ్రాండ్ షూస్‌ను విడుదల చేశారు. ఆదివారం ఫిలడెల్ఫియాలో కన్వెన్షన్ సెంటర్‌లో వాటిని ప్రదర్శించారు. బంగారు వర్ణం షూలు 399 డాలర్లకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు విక్టరీ47 అనే సెంటును కూడా విడుదల చేశారు. ఆస్తుల విలువను ఎక్కువ చేసి చూపిన నేరానికి కోర్టు ఏకంగా 35.5 కోట్ల డాలర్ల భారీ జరిమానా విధించిన మరునాడే ట్రంప్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ బరిలోకి దిగనున్నారు.

బీజేపీ గూటికి మనీశ్ తివారీ?

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ బీజేపీ కండువా కప్పుకుంటారని, ఆ పార్టీ తరఫున పంజాబ్‌లోని లూధియానా లోక్‌సభ స్థానం బరిలో దిగుతారని ఆదివారం వార్తలొచ్చాయి. అయితే ఇవన్నీ పుకార్లంటూ తివారీ కార్యాలయం ఖండించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమల్‌నాథ్ తన కుమారుడు, ఎంపీ నకుల్‌తో పాటు బీజేపీ గూటికి చేరనున్నారంటూ కూడా వార్తలొస్తుండటం తెలిసిందే. ఆయన తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు. పార్టీ మారుతున్నారన్న ప్రచారంపై ప్రశ్నించగా 'ఏమైనా ఉంటే మీకే మొదట చెబుతా'నంటూ దాటవేశారు!

సాక్షి హైదరాబాద్

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



యాచ్ క్లబ్ కుర్రాళ్లు అదరగొట్టారు

యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్న యువ సెయిలర్లు బన్నీ బొంగూర్, అక్షయ్ కుమార్ మైసూర్‌లోని ప్రతిష్టాత్మక ఆర్మీ బాయ్ స్పోర్ట్స్ సెయిలింగ్ స్కూల్‌కు ఎంపికయ్యారు. – 8లో



ఆకట్టుకున్న ఎర్త్ ఫెస్టివల్

మాదాపూర్‌లోని సీసీఆర్టీలో జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఎర్త్ ఫెస్టివల్- 2024' ఆకట్టుకుంది. కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. – 8లో

ఈ-బుక్స్‌కూ ఆదరణ



మారుతున్న ఆధునిక కాలానికి అనుగుణంగా సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని పుస్తకాల నుంచి ఈ బుక్స్‌గా మలిచే అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఈ బుక్స్‌కూ ఆదరణ పెరుగుతోంది. – 8లో

న్యూస్‌రీల్

ముగిసిన నుమాయిష్

- చివరి రోజు 70 వేల మంది సందర్శకుల రాక



అబిడ్స్: ఎగ్జిబిషన్ (నుమాయిష్) ఆదివారంతో ముగిసింది. 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల జనవరి 1వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి వరకు కొనసాగింది. ప్రతి సంవత్సరం 46 రోజులు కొనసాగే ఎగ్జిబిషన్ ఈసారి 49 రోజుల పాటు కొనసాగింది. ముగింపు రోజు ఆదివారం మధ్యాహ్నం నుంచే సందర్శకులు భారీగా తరలివచ్చారు. సుమారు 70 వేల మంది వచ్చినట్లు బుకింగ్ కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. 49 రోజుల్లో మొత్తం 22 లక్షల మంది నుమాయిష్‌కు వచ్చినట్లు అంచనా. 2,400 స్టాళ్లను ఏర్పాటు చేశామని, కనువిందు చేసేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, జాయింట్ సెక్రటరీ స్వర్ణజిత్ సింగ్, కోశాధికారి రాజేంద్రకుమార్‌లు తెలిపారు. గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షించారు.

పుస్తకం రమ్మంది

- బుక్‌ఫెయిర్‌కు పోటెత్తిన సందర్శకులు
- నేటితో ముగియనున్న ప్రదర్శన



పుస్తక ప్రియులతో ఎన్టీఆర్ స్టేడియం కిటకిట




ఎంట్రీ టికెట్ కోసం బారులుతీరిన సందర్శకులు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న పుస్తక ప్రదర్శనకు ఆదివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సెలవురోజు కావడంతో పాటు సోమవారంతో పుస్తక ప్రదర్శన ముగియనున్న దృష్ట్యా సందర్శకులు పోటెత్తారు. పుస్తకాల విక్రయాలు సైతం భారీగానే ఉన్నట్లు స్టాళ్ల నిర్వాహకులు తెలిపారు. తెలుగు సాహిత్యంతో పాటు ఈసారి దళిత సాహిత్యంపై వెలువడిన పుస్తకాలు విరివిగా అమ్ముడైనట్లు వెల్లడించారు. అంబేడ్కర్ రచనలు, పోటీ పరీక్షల కోసం రూపొందించిన పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌కు బాగా డిమాండ్ కనిపించింది. ఆ తర్వాత వ్యక్తిత్వ వికాస గ్రంథాలు, కెరీర్ గైడెన్స్‌పై వెలువడిన పుస్తకాలను కొనుగోలు చేశారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో బాల సాహిత్యానికి కూడా బాగా డిమాండ్ కనిపించింది. కథల పుస్తకాలు, ఫిక్షన్, ప్రముఖుల జీవిత చరిత్రలు ఎక్కువగా అమ్ముడయ్యాయి.

- సాధారణంగా ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో చివరి 10 రోజుల పాటు హైదరాబాద్ జాతీయ ప్రదర్శన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈసారి ఎన్నికలతో పాటు, వివిధ కారణాల దృష్ట్యా ఈ నెల 9వ తేదీ నుంచి ప్రదర్శన ప్రారంభమైంది. సోమవారం ప్రదర్శన ముగియనుంది. జాతీయ, అంతర్జాతీయ పుస్తక ప్రచురణ సంస్థలు పాల్గొన్నాయి. సాహిత్య సదస్సులు, పుస్తక ఆవిష్కరణ సభలతో ప్రదర్శన కళకళలాడింది. పాఠశాలలకు చెందిన చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచేందుకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఓ స్టాల్‌లో పుస్తక విక్రయాలు..



పుస్తకాలను పరిశీలిస్తున్న యువతి



వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు విశేష స్పందన



బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాల్‌ను పరిశీలిస్తున్న సంజయ్ జాజు

నాంపల్లి: సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నాంపల్లి నియోజకవర్గంలోని బజార్‌ఘాట్ గోకుల్‌నగర్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రాథమిక లక్ష్యాలు పౌరులకు అందుబాటులో ఉండేలా పలు రకాల సంక్షేమ పథకాల స్టాళ్లను స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు హాజరై యాత్ర ఉద్దేశాలు, విశేషాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆధార్ నమోదు, ముద్ర రుణాల మంజూరు, జీరో బ్యాలెన్స్ అకౌంట్లు, ఉచిత వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ శృతి పాటిల్, బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం అనిరుధ్ దేశ్‌పాండే, బీజేపీ నేతలు రాహుల్‌చంద్ర, జగన్నాథరాజు, భుజందర్ రావు, కె.పవన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారుపైనే ఆశలు!

- అందుకనుగుణంగా బల్దియా బడ్జెట్ రూపకల్పన
- నేడు బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం
- కౌన్సిల్ సర్వసభ్య సమావేశం సైతం

జీహెచ్ఎంసీ ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నే

సాక్షి, సిటీబ్యూరో: భారీగా అప్పుల పాలయ్యాక కానీ జీహెచ్ఎంసీకి తత్వం బోధపడినట్లుంది. భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు అప్పులు చేసే పరిస్థితికి వెళ్లకుండా వాస్తవ అంచనాలకనుగుణంగా రాబోయే ఆర్థిక సంవత్సర (2024–25) బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది. గతంలో ఏటా వందలు, వేల కోట్ల అప్పులు చేసిన జీహెచ్ఎంసీ కొత్త బడ్జెట్‌లో మాత్రం క్యాపిటల్ పనుల కోసం కేవలం రూ.128 కోట్లు అప్పు తీసుకోనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది.

- ప్రభుత్వం కరుణించి ఎక్కువ నిధులు విడుదల చేయనుందన్న ఆశతో అందుకనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించారు. రెవెన్యూ రాబడిలో రూ.1200 కోట్లు, క్యాపిటల్ ఇన్‌కమ్‌లో మరో రూ.1200 కోట్లు ప్రభుత్వం నుంచి అందుతాయనే ఆశతో ఉన్నారు. ఎప్పటిలాగే జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరులైన ఆస్తిపన్ను, టౌన్‌ప్లానింగ్ ఫీజులపైనే ఎక్కువ అంచనాలు ఉన్నాయి.
- ఇళ్ల అమ్మకాలు, కొనుగోళ్లు ఎక్కువ కాగలవనే అంచనాతో కాబోలు మ్యుటేషన్ ఫీజుల ద్వారా కూడా గణనీయమైన ఆదాయం రానుందని అంచనా వేశారు. మరో ఆదాయ వనరు అయిన



ఎస్టేట్స్ విభాగాన్ని గాలికొదిలేసినట్లే ఉంది. దాని ద్వారా కోట్లాది రూపాయల ఆదాయ వనరులున్నా కేవలం రూ.10 కోట్లే పేర్కొనడం వెనుక ఆంతర్యం అంతుబట్టడం లేదు.

రోడ్లు, ఫ్లైఓవర్లకు రూ.1,640 కోట్లు

ఖర్చులో ఎక్కువ మొత్తం రోడ్లు, ఫ్లైఓవర్లు, హైటెక్ సిటీ ప్రాంతానికే ఎక్కువ కేటాయింపులు చేశారు. వాటికోసం రూ.1,640 కోట్లు కేటాయించారు. ఇందులో క్యాపిటల్ వ్యయం రూ.1,550 కోట్లు కాగా, మిగతాది రెవెన్యూ వ్యయంలో పేర్కొన్నారు.

బడ్జెట్ మేరకు బల్దియాకు రానున్న నిధులు.. ఖర్చులకు సంబంధించి ఇలా..

రూపాయి రాక..

అంశం	అంచనా (రూ.కోట్లు)
ఆస్తిపన్ను, ఇతరత్రా	1,907
టౌన్‌ప్లానింగ్ ఫీజులు	1,600
ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజులు	785
మ్యుటేషన్ ఫీజులు	200
ట్రేడ్ లైసెన్సుఫీజులు	110
ప్రభుత్వం నుంచి పరిహారాలు	1,200
15వ ఆర్థిక సంఘం నిధులు	350
టౌన్‌ప్లానింగ్ టీడీఆర్‌ల ద్వారా	300
అప్పులు	128
ప్రభుత్వం నుంచి గ్రాంట్స్	1,200

రూపాయి పోక..

అంశం	అంచనా (రూ.కోట్లు)
ఘన వ్యర్థాల నిర్వహణ	500
వీధిదీపాలు	255
వాటర్ సప్లయ్, సివరేజీ	193
పచ్చదనం కోసం (గ్రీన్ బడ్జెట్)	375
ప్రజా సదుపాయాలు	143
భూసేకరణ	700
నాలాలు, ఎస్ఎన్‌డీపీ	320
పారిశుద్ధ్యం, ఎంటమాలజీ	500
ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులు	1,159

అలాగే వివిధ అంశాలకు రెండు పద్దుల నుంచి ఖర్చు చేయనున్నారు. సోమవారం జరగనున్న ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలపనున్నారు. బడ్జెట్ సమావేశానికంటే ముందు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. జీహెచ్ఎంసీ బడ్జెట్‌ను రూ.7,937 కోట్లతో రూపొందించడం విదితమే.

మల్కాజి'గురి'

అందరి దృష్టీ ఆ సీటుపైనే

- కాంగ్రెస్‌లో పెరుగుతున్న ఆశావహులు
- ఇతర పార్టీల కన్నూ ఈ స్థానంపైనే
- మల్కాజిగిరి ఎంపీ పదవికి పోటాపోటీ
- దేశంలోనే అతిపెద్ద లోక్‌సభా నియోజకవర్గం



సాక్షి, సిటీబ్యూరో: మల్కాజిగిరి. ఇప్పుడు దానిపైనే అందరి గురి. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని అన్ని రాజకీయ పక్షాలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. కేంద్రంలో మళ్లీ తమదే అధికారమని చెబుతున్న బీజేపీ నేతలు దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరిని తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తుండగా, రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ ఇక్కడ సత్తా చాటాలని భావిస్తోంది. ఇక కాంగ్రెస్.. రాష్ట్రంలో గెలుపుతోనే తమ లక్ష్యం పూర్తి కాలేదని లోక్‌సభలోనూ బలం చాటేందుకు వ్యూహరచన చేస్తోంది.

అన్ని పార్టీలకూ హాట్ సీట్

అన్ని పార్టీలూ వేటికవి మల్కాజిగిరిలో గెలుపుతో బలం చాటుకోవాలని ఆరాటపడుతున్నాయి. టికెట్ కోసం మాత్రం కాంగ్రెస్‌లో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్‌లో ఉన్న వారితో పాటు కొత్తగా చేరుతున్న వారు సైతం దానిపైనే ఆశలు పెట్టుకున్నారు. అధిష్టానం హామీలిస్తుందో లేదో కానీ ఎవరికి వారుగా ఈ సీటును దక్కించుకోవాలనే తలంపుతోనే ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలుస్తోంది. మల్కాజిగిరి ఎంపీగా ఉంటూనే రేవంత్‌రెడ్డి అటు పీసీసీ అధ్యక్షుడిగా విజయం సాధించడంతో పాటు ఇటు ముఖ్యమంత్రి కావడంతో సెంటిమెంట్ పరంగానూ భారీ డిమాండ్ ఏర్పడింది. రాబోయే ఎన్నికల్లో మల్కాజిగిరికి ప్రాతినిధ్యం వహించే రేవంత్ వారసుడెవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఎందరెందరో..

- మల్కాజిగిరి లోక్‌సభ టికెట్ కోసం ప్రయతిన్నస్తున్న వారిలో కంచర్ల చంద్రశేఖరరెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, సర్వే సత్యనారాయణ, బొంతు రామ్మోహన్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిలతో పాటు ఇంకా కాంగ్రెస్‌లో చేరనివారి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వీరిలో కంచర్ల చంద్రశేఖరరెడ్డి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన 2014 ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పట్లో ఆయన నాలుగో స్థానంలో నిలిచారు. సినీనటుడు అల్లు అర్జున్‌కు మామ కావడంతో పాటు ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో చంద్రశేఖరరెడ్డి పేరు ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. నల్లగొండ జిల్లాకు చెందిన ఆయన భువనగిరి నుంచైనా పోటీ చేసే అవకాశం ఉందంటున్నారు.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను కోరుకున్న చోట కాకుండా మహేశ్వరం టికెట్ ఇవ్వడంతో ఓటమి పాలైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఈసారి ఎంపీ సీటు కోసం ప్రయత్నిస్తున్నట్లు వినికిడి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరి ఎంటీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం దక్కని సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సైతం ఈ సీటుపై ఆశలు పెట్టుకున్నారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత భర్త, బీఆర్ఎస్ నేత మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణలు సైతం మల్కాజిగిరి టికెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

అటు నుంచి ఇటు..

ప్రముఖ వ్యాపారి, మహబూబ్ నగర్ జిల్లా మాజీ ఎమ్మెల్యేకు కూడా కాంగ్రెసే ఆఫర్ ఇచ్చినట్లు ఓ వైపు ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు బీఆర్ఎస్‌ను వీడి వస్తే ఆయనకు మల్కాజిగిరి టికెట్ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. అంతేకాదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సైతం పార్టీ మారి తిరిగి ఎంపీగా పోటీకి సిద్ధమైనా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకా ఎవరెవరు ఏయే పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వస్తారో.. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గ ఎంపీ టిక్కెట్ ఎవరిని వరిస్తుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..





గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్‌లో క్లబ్ రన్–2024 పేరిట ఆదివారం ఉదయం నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. రన్‌లో సుమారు 2 వేల మంది పాల్గొన్నారు. రన్‌ను హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తుకారామ్, తెలంగాణ ఐజీపీ ఎం.రమేష్‌రెడ్డి, మాదాపూర్ డీసీపీ జి.వినీత్ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎక్స్‌పోజిషన్ లిమిటెడ్ సీఈఓ టి.జి శ్రీకాంత్, హైదరాబాద్ రన్నర్స్ కార్యదర్శి అరుణ్‌కుమార్ కలియప్పన్, క్లబ్ రన్–2024 రేస్ డైరెక్టర్ అజిత్ మిశ్రా మెడల్స్ అందించి అభినందించారు. – రాయదుర్గం



లీజుకు 38.59 ఎకరాలు



భూముల అప్పగింతకు ఆర్టీసీ సిద్ధం

- లైసెన్స్ ఫీజుల రూపంలో ఇచ్చేందుకు టెండర్లు
- మార్చి 15 వరకు దరఖాస్తుకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని విలువైన స్థలాలను ప్రతి నెలా లైసెన్సు ఫీజుల రూపంలో లీజుకు ఇచ్చేందుకు అధికారులు ఆన్‌లైన్ టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. వివిధ చోట్ల ఉన్న సుమారు 38.59 ఎకరాలను లీజుకు ఇవ్వనున్నారు. ఈ స్థలాలపై లీజు దక్కించుకున్న సంస్థలు లాజిస్టిక్ వేర్‌హౌస్‌లు, ఆటోమొబైల్ సర్వీస్ సెంటర్లు, షోరూంలు తదితర అవసరాల కోసం వినియోగించుకోవచ్చు.

- టికెట్టేతర ఆదాయాన్ని పెంచుకొనే చర్యల్లో భాగంగా ఇప్పటికే బస్‌స్టేషన్లు, ప్రయాణ ప్రాంగణాలు తదితర ప్రాంతాల్లో స్టాళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల కార్యాలయాలకు భవనాలను అద్దెకు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఆర్టీసీకి వివిధ ప్రాంతాల్లో ఉన్న సొంత స్థలాలను లైసెన్సు ఫీజుల రూపంలో లీజుకు ఇవ్వడంపై అధికారులు దృష్టి సారించారు. ఈ స్థలాలపై సెక్యూరిటీ డిపాజిట్ల రూపంలో రూ.63 లక్షలకుపైగా లభించనుంది.
- ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న స్థలాలను లీజుకు తీసుకొనేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు లేదా వ్యాపారులు మార్చి 15వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు టెండర్లను దాఖలు చేయొచ్చు. మరుసటి రోజు జూబ్లీ బస్‌స్టేషన్‌లోని ఈడీ కార్యాలయంలో టెండర్లను ఓపెన్ చేయనున్నారు. మరోవైపు ఈ నెల 27న స్థలాల లీజుపై ప్రీబిడ్డింగ్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎక్కడెక్కడ ఎంత..

ప్రాంతం	స్థలం (ఎకరాల్లో)	ధరావత్తు (రూ.లక్షల్లో)
కాచిగూడ	4.14	27
మేడ్చల్	2.83	8
శామీర్‌పేట్	3.26	5
హకీంపేట్	2.93	4
చెంగిచెర్ల	2.68	4
రషీద్‌గూడ–1	4.75	3
రషీద్‌గూడ–2	6.03	4
తుర్కయంజాల్ –1	5.74	4
తుర్కయంజాల్–2	6.23	4

యువతిని మోసగించిన ఎస్ఐ



పబ్బా అరుణ్

సైదాబాద్: పెళ్లి చేసుకుంటానంటూ ఓ యువతిని శారీరకంగా లోబరుచుకుని.. మరో యువతితో వివాహ నిశ్చితార్థం చేసుకున్న కేసులో సిద్దిపేట కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన పబ్బా అరుణ్ (29) ప్రస్తుతం సిద్దిపేట కమిషనరేట్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. అరుణ్ 2021లో సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ట్రెనీ ఎస్ఐగా పని చేశాడు. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన యువతి (23) సైదాబాద్ సరస్వతీనగర్ కాలనీలోని తన బంధువుల ఇంట్లో ఉంటూ జూనియర్ ఆర్టిస్టుగా పని చేస్తుండేది. 2022 జనవరిలో బంధువుల కుటుంబ సమస్యల విషయమై సదరు యువతి అప్పట్లో సైదాబాద్ పీఎస్‌కు వెళ్లింది. ఈ క్రమంలోనే ట్రైనీ ఎస్ఐ పబ్బా అరుణ్ ఆమెకు పరిచయమయ్యాడు. వీరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన ఎస్ఐ అరుణ్ ఆమెను శారీరకంగా లోబరుచుకున్నాడు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత అతను సిద్దిపేట పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో పని చేస్తున్న సమయంలోనూ యువతిని తన వద్దకు రప్పించుకునేవాడు. ఇటీవల అరుణ్‌కు వేరే యువతితో వివాహ నిశ్చితార్థమైన ఫొటోలను స్మార్ట్ ఫోన్‌లో చూసిన బాధితురాలు అతడిని నిలదీసింది. బింగు తిన్న అతను నిశ్చితార్థాన్ని ఉపసంహరించుకుంటానని, నిన్నే పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించాడు. నిశ్చితార్థమైన యువతి సోదరుడు బాధిత యువతికి గత నెల ఫోన్ చేశాడు. అరుణ్ తన సోదరినే పెళ్లి చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో ఆమె అరుణ్‌కు ఫోన్ చేసి ఈ విషయంపై ప్రశ్నించడంతో.. 'అవును నేను ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను.. నువ్వు నన్ను మరచిపో' అంటూ ఫోన్ పెట్టేశాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన యువతి శనివారం సైదాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పబ్బా అరుణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ-బుక్స్‌కూ ఆదరణ

- పెరుగుతున్న ఆన్‌లైన్ రీడర్స్, కాలానికి అనుగుణంగా మారుతున్న పాఠకుల వైఖరి
- మార్కెట్‌లోకి పలు రీడింగ్ యాప్స్ ,
- పుస్తక ప్రదర్శనలోనూ ఈ-బుక్స్‌కు ఆదరణ
- గతేడాది ప్రారంభించిన యాప్స్‌లో 20 వేలకు పైగా పాఠకులు



సాక్షి, సిటీబ్యూరో: పుస్తకం హస్త భూషణం... అనేది ఒకప్పటి మాట. చరవాణి హస్తనారి అనేది ఇప్పటి మాట..!! మారుతున్న ఆధునిక కాలానికి అనుగుణంగా జీవన విధానాలు, సంస్కృతులు మారుతుండటం సహజమే అయినప్పటికీ, జ్ఞాన సర్వస్వాలైన పుస్తకాలను విస్మరించడం ఒకింత ఆందోళన కరమే. ఇలాంటి తరుణంలో సాహిత్యాన్ని, వి/జ్ఞానాన్ని పుస్తకాల నుంచి ఈ బుక్స్‌గా మలిచే అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఇందులో భాగంగా పలు ఆన్‌లైన్ వేదికలు తెలుగు రచనలు, నవలలు, కవిత్వం-కథానికలను సైతం ఈ-బుక్స్‌గా అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో ఈ-బుక్స్‌కు చోటు లభించడం, ప్రస్తుతం ఈ మాధ్యమానికి ఆదరణ లభిస్తుండటం తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుత జీవన విధానానికి అనువుగా ఈ ఈ-బుక్స్, ఈ-ఆడియో బుక్స్ మంచి ఆదరణ పొందుతున్నాయి. పుస్తక ప్రదర్శనలో పుస్తకాలతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన ఈ-యాప్స్‌లోనూ సబ్‌స్క్రిప్షన్ తీసుకుని మరీ తెలుగు సాహిత్యాని ఆదరిస్తున్నారు పాఠకులు. ప్రస్తుతం ఈ ఆన్‌లైన్ వేదికలు కాస్తా తక్కువే ఉన్నప్పటికీ పాఠకుల ఆదరణ దృష్ట్యా భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ప్రతి వారం 5 ఈ-బుక్స్...

ఆన్‌లైన్ జీవనంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు సాహిత్యాన్ని యాప్ వేదికగా తీసుకురాగలిగితే మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరికీ చేరువ చేయగలమనే ఆలోచనతో 'చదువు' యాప్‌ను రూపొందించాం. ఐరా డిజిటల్ పబ్లిషర్స్ వేదికగా ఈ చదువు యాప్‌ను తయారు చేసి ప్రతి వారం కనీసం 5 తెలుగు పుస్తకాలను ఈ-బుక్స్, ఆడియో బుక్స్‌గానూ తీసుకువస్తున్నాం. గతేడాది ఇదే పుస్తక ప్రదర్శన వేదికగా ప్రారంభించిన ఈ యాప్ ప్రస్తుతం 20 వేలకు పైగా పాఠకులతో ఆదరణ పొందుతుంది. రానున్న కాలంలో మరింత మంది సబ్‌స్క్రిప్షన్ తీసుకోనున్నారు. చలం, శ్రీశ్రీ మొదలు నవతరం యువ రచయితల రచనల వరకు ఈ బుక్స్‌గా తీసుకురావడానికి విశేషంగా కృషి చేస్తున్నాం. -మహి, చదువు యాప్ నిర్వాహకులు.

అండర్-11 టోర్నీ విజేత పెట్రా స్పోర్ట్స్ అకాడమీ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వెస్ట్ యూత్ ఫుట్‌బాల్ లీగ్ అండర్-11 టోర్నీలో ఖానాపూర్‌కు చెందిన పెట్రా స్పోర్ట్స్ అకాడమీ జట్టు విజేతగా నిలిచింది. నాలుగు వారాలపాటు ఖానాపూర్‌లోని స్టేడియం ఆఫ్ హోప్‌లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. పెట్రా స్పోర్ట్స్ అకాడమీ జట్టు ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అజేయంగా నిలువడం విశేషం. యూనిక్ ఫుట్‌బాల్ అకాడమీ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గతంలో జరిగిన అండర్-13 టోర్నీలోనూ పెట్రా స్పోర్ట్స్ అకాడమీ చాంపియన్‌గా నిలిచింది. ప్రతిభావంతులైన చిన్నారులను వెలికితీసే సదుద్దేశంతో త్వరలో అండర్-15 స్థాయిలో మరో టోర్నీని నిర్వహిస్తామని పెట్రా స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కోచ్ కెవిన్ ఆండ్రూస్ తెలిపారు.

యాచ్ క్లబ్ కుర్రాళ్లు అదరగొట్టారు

- ఆర్మీ బాయ్ స్పోర్ట్స్ కంపెనీకి ఎంపిక
- రసూల్‌పురా ఉద్భవ్ స్కూల్ విద్యార్థులు బన్నీ బొంగూర్, అక్షయ్ కుమార్
- చివరి ప్రక్రియలో ఎంపికైతే ఆర్మీలో అవకాశాలు పదిలం







సాక్షి, సిటీబ్యూరో: యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (వైసీహెచ్)లో శిక్షణ పొందుతున్న యువ సెయిలర్లు బన్నీ బొంగూర్, అక్షయ్ కుమార్ మైసూర్‌లోని ప్రతిష్టాత్మక ఆర్మీ బాయ్ స్పోర్ట్స్ సెయిలింగ్ స్కూల్‌కు ప్రాథమికంగా ఎంపికయ్యారు. తెలంగాణలోని జహీరాబాద్ నియోజకవర్గం కంజామల్లాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద రైతు దంపతులు రతన్‌రాజ్, లక్ష్మి బొంగూర్ దంపతుల కుమారుడు బన్నీ బొంగూర్, డ్రైవర్ కుమారుడైన అక్షయ్ కుమార్ సబ్ జూనియర్ ఫ్లీట్ విభాగంలో ఆర్మీ బాయ్ స్పోర్ట్స్ కంపెనీలో అవకాశం దక్కించుకున్నారు. యాచ్ క్లబ్ స్పాన్సర్ చేస్తున్న ఈ ఇద్దరు కుర్రాళ్లు ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థుల మద్దతు అందిస్తున్న సికింద్రాబాద్ రసూల్‌పురాలోని ఉద్భవ్ స్కూల్‌లో చదువుతున్నారు. వైసీహెచ్ ప్రోద్బలంతో సెయిలింగ్‌లో ముందుకెళ్తున్న బన్నీ ఇటీవలే భారత రెండో ర్యాంకర్‌గా నిలిచాడు. 18 ఏళ్లు నిండిన తర్వాత అతను సైన్యంలో చేరితే తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడమే కాకుండా తమ గ్రామం నుంచి ఆర్మీలో చేరిన తొలి వ్యక్తి అవుతానని ఆశిస్తున్నాడు. అక్షయ్ ప్రస్తుతం దేశంలో 15 వ ర్యాంక్‌లో ఉన్నాడు. బన్నీ, అక్షయ్ ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌లో చివరి ఎంపిక ప్రక్రియలో ఉన్నారు. క్లిష్టమైన ప్రక్రియ తర్వాత భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ద్వారా ఢిల్లీ పోస్ట్ లోని ఆర్మీ సెలక్షన్ కమిటీ నుంచి వీరికి కాల్ లెటర్ రావాల్సి ఉంది. ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్ ప్రాథమిక ఎంపికలో బన్నీ, అక్షయ్‌కు అవకాశం దక్కడంపై వైసీహెచ్ హైదరాబాద్ అధ్యక్షుడు, కోచ్ సుహీమ్ షేక్ సంతోషం వ్యక్తం చేశారు. వీరి కంటే ముందు యాచ్ క్లబ్ నుంచి 21 మంది కుర్రాళ్లు ఎంపికై నట్లు తెలిపారు. ఆర్మీ, నేవీ సెయిలింగ్ స్కూల్స్‌కు అత్యధిక మందిని అందించిన క్లబ్‌గా యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిలిచిందన్నారు. వీరిలో ముగ్గురు ఇప్పటికే నేవీలోకి, మరొకరు ఆర్మీలోకి ప్రవేశించి బలమైన కెరీర్ సంపాదించుకున్నారని వెల్లడించారు. ఇది 'క్రీడలతో గౌరవం' (డిగ్నిటీ త్రూ స్పోర్ట్స్) అనే తమ క్లబ్ నినాదాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. కాల్ లెటర్ వచ్చిన తర్వాత బన్నీ, అక్షయ్ బెంగుళూరుకు వెళ్లి కేంద్రీయ విద్యాలయంలో చదువుకుంటారు. అదే సమయంలో మైసూర్‌లోని ఎంఈజీ సెంటర్, తృష్ణ సెయిలింగ్ క్లబ్ నుంచి నిష్ణాతులైన ఆర్మీ కోచ్‌ల పర్యవేక్షణలో సెయిలింగ్ శిక్షణ పొందుతారు. తద్వారా జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చాటి మంచి పేరు దక్కించుకునే అవకాశం లభిస్తుంది. వైసీహెచ్ పూర్వ విద్యార్థి విజయ్ సభావత్ ఆసియా స్థాయిలో రెండు అంతర్జాతీయ పతకాలు సాధించి ప్రస్తుతం ముంబైలో ఆర్మీలో చేరాడు.

సమాజాభివృద్ధికి పాటుపడాలి



శోభాయాత్రను ప్రారంభిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

గన్‌ఫౌండ్రీ: సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం ఆర్యసమాజ్ వ్యవస్థాపకులు మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాం కళాశాల నుంచి రవీంద్రభారతి వరకు నిర్వహించిన శోభాయాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..... మహర్షి దయానంద సరస్వతి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. రాజనీతి తత్వవేత్తగా కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. దయానంద సరస్వతి లక్ష్యాలు, ఆశయాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అనంతరం రవీంద్రభారతిలో బృహద్ పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఢిల్లీ ఆర్య ప్రతినిధి సభ మహా మంత్రి వినయ్ ఆర్య, ఆచార్య ఉదయన్ మీ మాంసక్, శ్రీ మాతా నిర్మల యోగ భారతి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ బీజే రావ్, డాక్టర్ ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎర్త్ ఫెస్టివల్ 2024

- అలరించిన వయొలిన్ సింఫొని, భూమి మంగళం కూచిపూడి నృత్యప్రదర్శన
- పెయింటింగ్స్, మిల్లెట్ ఫుడ్ స్టాల్స్, అవగాహన కార్యక్రమాలు





మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో ఆదివారం నిర్వహించిన ఎర్త్‌ఫెస్టివల్ 2024 ఆకట్టుకుంది. కళాకారులు భూమి మంగళం నృత్య ప్రదర్శనతో అలరించారు. జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫెస్టివల్‌ను వాతావరణ మార్పులు, స్థిరత్వం, క్లిష్టమైన సమస్యలపై యువత, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఏర్పాటు చేశారు. షార్ట్‌ఫిలిం, ఎర్త్ నేపథ్యంతో పాటలను పాడి అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మిల్లెట్ బ్యాంక్ ఫుడ్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆరాభి అకాడమికి చెందిన 35మంది చిన్నారుల వయోలిన్ సింఫోనీ గ్రాండ్ ఫినాలే సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. నాట్య మయూరి కూచిపూడి డాన్స్ అకాడమీ సౌందర్య కౌసిక్ శిష్యబృందం భూమి మంగళం కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను అలరించింది. నైనిజమ్ పెయింటింగ్, మిల్లెట్స్, ఆర్ట్, వర్క్‌షాప్‌తో పాటు పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు.

బీసీ కులగణన తీర్మానం చరిత్రాత్మకం



సీఎం రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నాంపల్లి: కులగణన కోసం బీసీలు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, బీసీల కల సాకారం అయ్యేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందడుగు వేసి వారికి అండగా నిలిచారని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. అసెంబ్లీలో బీసీ సమగ్ర కులగణన తీర్మానం ఆమోదం పొందిన సందర్భంగా.. ఆదివారం గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రధాని బీసీ అయినా వారిని పట్టించుకోలేదని ఆరోపించారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం సమ గ్ర కుటుంబ సర్వే చేసి ఆ లెక్కలు వెల్లడించకపోవటమేగాక, స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించి, రాజకీయంగా అణచివేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనన్నట్లుగానే కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసిందని కొనియాడారు. రాష్ట్ర సర్కారు బీసీల అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేయాలంటే.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ నాయుడు కార్తీక్, అనిల్‌కుమార్, సాయి, సైదులు, రవికుమార్, భాస్కర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

చున్నీ మెడకు చుట్టుకుని..

బాలిక మృతి

కుత్బుల్లాపూర్: మెడకు చున్నీ చుట్టుకుని ఊపిరాడక ఓ బాలిక మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.ఎస్సై సురేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాఘవేంద్ర కాలనీకి చెందిన గణేష్ కుమార్తె మహాశ్రీ(10) స్నేహితురాలితో కలిసి బిల్డింగ్‌పై చున్నీతో ఆడుకుంటుంది. ఈ క్రమంలో చున్నీ ఒక్క సారిగా మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకుంది. తల్లిదండ్రులు ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తి వేయాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులపై అక్రమంగా బనాయించిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తి వేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్నది ప్రజా పాలనా..? నియంతృత్వ పాలనా? అనే అనుమానం వస్తుందన్నారు. అన్నలు రావాలి, నక్సలైట్లు అవసరం మళ్లీ వచ్చిందని అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇంద్రవెల్లి సభలో ప్రకటించిన రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నియంతృత్వ పాలన కొనసాగిస్తురన్నారు. ఇల్లందు పక్కనే ఉన్న పూసపల్లిలో వీరందరూ దొరికినట్లుగా కుట్ర చేశారన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకత్వాన్ని నిషేధిత పార్టీగా పేర్కొడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఫిబ్రవరి 14న రాష్ట్ర కార్యదర్శి ఆశోక్, కమిటీ సభ్యులు గోపన్నలతో పాటు ఎస్‌కె.మదార్, కె.సురేష్‌లను పోలీసులు ఖమ్మం పరిసర ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారన్నారు. చట్టం ప్రకారం వారిని 24 గంటల్లో కోర్టులో హాజరుపరచకుండా ఫిబ్రవరి 16న అరెస్టు చేసినట్లు చూపిస్తున్నారన్నారు. వీరితో సహా 24 మందిపై 120(బి) కుట్ర కేసు, ఆయుధాల చట్టాన్ని బనాయించారన్నారు. తూటాలులేని రివాల్వర్, కత్తులు, గిన్నెలను, బ్యాగులను చూపించి ఈ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఆయుధాలు, డబ్బులు సమకూర్చుకుంటున్నారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇల్లందు, కొత్తగూడెం మండలాల్లోని ఏజెన్సీ గ్రామాల్లో కొనసాగుతున్న కూంబింగ్‌ను వెంటనే నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. పూసపల్లి కుట్ర కేసును ఎత్తి వేయాలన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న భాస్కర్, సనప పొమ్మయ్య, కొండన్న, తొగరు కొమరయ్యలను బేషరతుగా విడుదల చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, గొని ఐలయ్య, ఎం.శ్రీనివాస్, జి.అనురాధా తదితరులు పాల్గొన్నారు.

సైట్ ఫర్ కిడ్స్‌కు శ్రీకారం...

చిన్నారుల్లో దృష్టి లోపాలను సరిచేసేందుకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: నిరుపేదలు, అల్పాదాయ వర్గాలకు చెందిన చిన్నారులకు నేత్ర వైద్య సేవలు అందించే లక్ష్యంతో లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థలు చేతులు కలిపాయి. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. సైట్ ఫర్ కిడ్స్ పేరిట నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 70 లక్షల మంది చిన్నారులకు దృష్టిలోపాల నివారణ సేవలు అందించనున్నామని, చిన్నారుల నేత్ర సమస్యలపై 75వేల మంది పాఠశాల ఉపాధ్యాయులకు సైతం ప్రాథమిక నేత్ర సమస్యలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

పాపం..పసిపాప

ఆడశిశువును వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



మియాపూర్: అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తుతెలియని వ్యక్తులు ముళ్లపొదల్లో వదిలివెళ్లిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మియాపూర్‌లోని న్యూ కాలనీ రామసముద్రం చెరువు సమీపంలో అప్పుడే పుట్టిన పాప ఏడుస్తున్నట్లు గుర్తించిన స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అప్పుడే పుట్టిన పసికందును స్వాదీనం చేసుకున్నారు. పాప దీంతో చిన్నారనిని కొండాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. శిశువు ఆరోగ్యంగా ఉందని , అక్కడి నుంచి మియాపూర్ పోలీసులు శిశు సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

కార్లలో మంటలు



చాంద్రాయణగుట్ట: పార్కు చేసిన రెండు కార్లలో మంటలు చెలరేగిన సంఘటన ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.గౌలిపురా శివ పార్వతీ ఫంక్షన్‌హాల్ సమీపంలోని స్థలంలో రఘు యాదవ్ అనే వ్యక్తి తన రెండు కార్లను పార్కు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా రెండు కార్లలో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా నిప్పంటించారా.? అనే కోణంలో ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడి వేధింపులే కారణం..

శివాని ఆత్మహత్య కేసులో పోలీసుల నిర్ధారణ

హిమాయత్‌నగర్: శివాని అనే వివాహిత ఆత్మహత్య కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి శివాని(32) అనే మహిళ ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటున్న శివాని ప్రియుడు ముస్తఫా అలియాస్ ఖాలీద్‌తో సహజీవనం చేస్తోంది. కొంతకాలంగా ఖాలీద్ తన కుమార్తె(12)తో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయమై పలుమార్లు ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. అయినా ముస్తఫా ప్రవర్తనలో మార్పు రాలేదు. తన కుమార్తెను ప్రియుడు లైంగికంగా వేధిస్తుండటాన్ని జీర్ణించుకోలేక మనస్తాపానికి లోనైన శివాని శనివారం రాత్రి తన ఇద్దరు పిల్లలను తన సోదరి ఇంటికి పంపి ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం ఆమె ప్రియుడు ముస్తఫాను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

23 నుంచి ఆసియా జువెల్స్ షో



బంజారాహిల్స్: ఈ నెల 23, 24,25 తేదీల్లో బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఆసియా జువెల్స్ షో-2024 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో ఏర్పాటు చేసిన సన్నాహక కార్యక్రమంలో నటి ప్రవంతి చొక్కారపుతో పాటు మిస్ ఇండియా తెలంగాణ-2023 ఊర్మిలా చౌహాన్‌తో కలిసి ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచబోయే పలు రకాల ఆభరణాలను ధరించి ప్రదర్శించారు. సంస్థ ప్రతినిధి హరీష్ సచ్‌దేవ్ పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తన.. ఆపై హత్య

- బాలుడి మృతి కేసులో మిస్టరీ ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్: ఇటీవల జరిగిన బాలుడి మృతి వెనుక మిస్టరీని జూబ్లీహిల్స్ పోలీసులు ఛేదించి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెలితే జూబ్లీహిల్స్ రోడ్‌నం 5లోని దుర్గాభవానినగర్ బస్తీలో నివసించే ఎం.కార్తీక్ అనే బాలుడు ఈ నెల 14వ తేదీన సమీపంలోని జీహెచ్‌ఎంసీ పార్కు నాలాలో శవమై తేలాడు. అనుమానాస్పద మృతి కింద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని లోతుగా దర్యాప్తు చేపట్టారు. నాలాలో బాలుడు ప్రమాదవశాత్తు పడలేదని ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు స్థానికంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతుడి తల్లిదండ్రులు అదే బస్తీకి చెందిన దినసరి కూలీ మన్యం నాయక్ (53)పై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు బాలుడు పార్క్‌లో ఆడుకుంటున్న సమయంలో మన్యం నాయక్ ఎక్కడున్నాడు అని ఆయన కదలికలపై ఆరా తీశారు. ఘటన జరిగిన రోజు రాత్రి కార్తీక్ పార్క్‌లో ఆడుకుంటుండగా అప్పటికే అనుసరించిన మన్యం నాయక్ బాలుడి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, అనైతిక చర్యలకు పాల్పడుతుండగా బాధిత బాలుడు అడ్డుకున్నాడు. ఎదురుతిరిగి అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించగా ఆగ్రహంతో ఊగిపోయిన మన్యం నాయక్, కార్తీక్‌ను పగిలి ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్‌లోకి తోసేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తెల్లవారి బాలుడి మృతదేహాన్ని పోలీసులు నాలాలో గుర్తించారు. ఘటన జరిగిన తర్వాత మన్యం నాయక్ బస్తీలో లేకపోవడంతో ఈ అనుమానాలకు మరింత తావివ్వగా ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. బాలుడు ఎదురు తిరగడంతో కోపం పట్టలేక మ్యాన్ హోల్ పైప్‌లోకి తోసివేసినట్లు పోలీసులు తేల్చారు. నిందితుడి భార్య కేన్సర్‌తో మృతి చెందగా 20 ఏళ్ల కొడుకుతో కలిసి అదే బస్తీలో ఉంటున్నాడు. బాలుడిది ప్రమాదవశాత్తు జరిగిన మరణం కాదని, దారుణ హత్యగా తేల్చిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీ ‘బండ’ కోసం ఎదురుచూపులు

- ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు
- రెండు మూడు రోజుల్లో జాబితా సిద్ధం

బంజారాహిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎన్నికల ముందు తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ వస్తోంది. గృహలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీకి కసరత్తు చేపట్టారు. పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, రహమత్‌నగర్ డివిజన్లలో మొత్తం 2.20 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇందులో సుమారుగా 80 వేల మంది వినియోగదారులు ఈ పథకం కింద లబ్ధిపొందనున్నారు. సామాన్యులకు గ్యాస్ దాదాపు సగం ధరకే రానుండడంతో కాస్త ఊరట కలగనుంది. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలోత దీనికి సంబంధించిన విధి విధానాలను రూపొందిస్తున్నారు. వచ్చే వారం రోజుల్లోనే ఈ పథకానికి సంబంధించి సమగ్రమైన మార్గదర్శకాలు రానుండగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు తీపి కబురు కూడా అందనుంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.975 ఉంది. ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ రూ.500లకు అందిస్తే వినియోగదారులకు ఎంతో మేలు చేకూర్చినట్లవుతుంది. ఇప్పుడు ఉన్న గ్యాస్ కనెక్షన్‌దారుల్లో 40 శాతం మందికి లబ్ధి చేకూరినా అదెంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు కూడా పేర్కొంటున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మహిళ...

తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి..

గృహలక్ష్మీ పథకంలో రూ.500లకే పేదలకు గ్యాస్ సిలిండర్ అందించనుండగా, ఈ పథకం పక్కదారి పట్టకుండా అసలైన లబ్ధిదారులకే రాయితీ సిలిండర్ చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడమే కాకుండా అందుకు సంబంధించి మార్గదర్శకాలు కూడా పటిష్టంగా రూపొందిస్తున్నారు. ఈ పథకానికి తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు నియోజకవర్గాల పరిధుల్లో 80 వేలకు పైగా తెల్ల రేషన్‌కార్డుదారులు ఉండగా వీరందరికీ ఈ పథకం వర్తింపజేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తెల్ల రేషన్‌కార్డు లేనివారి పరిస్థితిపై కూడా ప్రభుత్వం ఓ నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం సమాలోచన చేస్తున్నట్లు సమాచారం. అర్హులైన వారికి ఏడాదికి ఎన్ని సిలిండర్లు ఇవ్వాలి..గతేడాది ఎన్ని తీసుకున్నారు..ఈ వివరాలను రాబడుతున్నారు. ఇందుకోసం ప్రజాపాలన దరఖాస్తుల్లో సమాచారాన్ని సేకరిస్తున్నారు. వాటి ఆధారంగానే రాయితీ సిలిండర్లకు అవకాశం ఉంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం కోసం 1.20 లక్షల మంది వినియోగదారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ లబ్ధి చేకూరేవిధంగా ప్రభుత్వం చర్యలు ఏమేరకు ఉంటాయో చూడాల్సి ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ సాధారణ గ్యాస్ గ్యాసెక్షన్లు, ఉజ్వల కనెక్షన్లు, దీపం పథకం కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ఎంత మందికి రూ.500లకే రాయితీ సిలిండర్ లభిస్తుందనే దానిపై నిర్ణయం ఇంకా కొలిక్కిరాకపోవడంతో ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి మహిళలు రాయితీ సిలిండర్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ పథకానికి ఆకర్షితులైన మహిళలు కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. ప్రభుత్వం కూడా ఈ పథకం కింద అర్హులైన ప్రతిఒక్కరికీ రాయితీ సిలిండర్ ఇవ్వాలనే యోచనలో ఉండడంతో మహిళలు కూడా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఒకవైపు ప్రజాపాలన దరఖాస్తులను, ఇంకోవైపు తెల్లరేషన్‌కార్డు కలిగిన వారిని సంబంధిత అధికారులు జాబితా రూపొందిస్తూ అర్హులను గుర్తించే పనిలో పడ్డారు. రెండు మూడు రోజుల్లో ఈ జాబితా కూడా రూపొందించనున్నట్లు తెలుస్తున్నది.

క్లుప్తంగా...

డబ్ల్యుబీఏఎఫ్ అసోసియేట్‌గా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్

బంజారాహిల్స్: హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్‌కు వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం (డబ్ల్యుబీఏఎఫ్)లో సీనియర్ అసోసియేట్‌గా ఆహ్వానం అందింది. ఈ మేరకు డబ్ల్యుబీఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బేబర్స్ అట్లుంటాస్ స్వయంగా ఆయనకు ఆహ్వానం అందించారు. ఫోరం అనేది జీ 20 గ్లోబల్ పార్టనర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ అనుబంధ భాగస్వామి. ఈ సందర్భంగా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక సంస్థలోకి సభ్యుడిగా ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. బేబర్స్ అల్లుంటాస్‌కు సహకరించి గ్లోబల్ బిజినెస్‌లో సానుకూల మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దీక్ష విరమించిన గడ్డం శ్రీధర్


నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న నాయకులు

రహమత్‌నగర్ : బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధితో పాటు ఆలయ కమిటీని మార్చాలని గత పది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న గడ్డం శ్రీధర్ ఆదివారం తన దీక్షను విరమించారు. టీఎస్ఎమ్మార్పీఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం వర్గం అధ్యక్షుడు విశాల్ మాదిగ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. నాయకులు అనిల్ ముదిరాజ్, రాకేష్, అరుణ్, మధు,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5న జాతీయ శాంతి అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ రహమాన్

హిమాయత్‌నగర్ : ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల జరిగే అనర్థాలపై మార్చి 5న రవీంద్రభారతిలో ‘జాతీయ శాంతి అవగాహన సదస్సు’ నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ హెచ్.ఆర్.రహమాన్ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రెహమాన్ మాట్లాడుతూ సదస్సుకు 18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్ : ఆఫీస్ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో నివాసం ఉంటున్న కెవైవిఆర్ మూర్తి ఈనెల 10వ తేదీనాడు తన ఆఫీసు ప్రాంగణంలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి వెళ్ళారు. 11వ తేదీ అర్ధరాత్రి దాదాపు ఒకటిన్నర గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం తలుపులను పగలకొట్టి ఆవరణలోనికి ప్రవేశించారు. అనంతరం తన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించుకుని వెళ్ళారు. కాగా మూర్తి నగరంలో ఐదారురోజులు లేని కారణంగా ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య నిపుణులు డాక్టర్ నాగరాజ్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది దాదాపు 300 మందికి అన్ని రకాల శ్వాసకోశ సంబంధిత, మధుమేహ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ.. శ్వాసకోశ సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలను పాటించాలన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవడం, పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా శారీరక సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చన్నారు. అదే విధంగా వ్యాయామం చేయడం, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం వల్ల రుగ్మతలు దరిచేరకుండా ఉంటాయన్నారు. ముఖ్యంగా మధుమేహం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి హాజరై శిబిరం నిర్వహించిన పార్థివ్ లంగ్‌కేర్ సిబ్బందిని అభినందించారు.

మద్యం మత్తులో 43 మంది వాహనదారులు

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం నాలుగు వేర్వేరు చోట్ల నాలుగు టీమ్‌లు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాయి. మొత్తం 43 మంది వాహనదారులు అతిగా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ శ్వాస పరీక్షలో దొరికిపోయారు. ఐసీఐసీఐ బ్యాంక్ యూటర్న్ వద్ద ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 10 మంది, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డునెంబర్ 36లో చేపట్టిన తనిఖీల్లో 15 మంది, స్టడీ సర్కిల్ వద్ద బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 8 మంది పట్టుబడ్డారు. మొత్తం 30 మంది ద్విచక్ర వాహనదారులు, 12 మంది కారు నడుపుతూ, ఒక ఆటో డ్రైవర్ ఈ తనిఖీల్లో పట్టుబడినట్లు అధికారులు తెలిపారు.


డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సింగాడికుంట బస్తీ అధ్యక్షుడిగా మహ్మద్ ఎజాజ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్–10లోని సింగాడికుంట బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. బస్తీ అధ్యక్షుడిగా మహ్మద్ ఎజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు ఉంటుందని సలహాదారులు నరసింహాచారి, వై.శంకర్‌లు వెల్లడించారు. ఆదివారం నామినేషన్ వేసేందుకు కొద్ది రోజుల క్రితం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నామని, మహ్మద్ ఎజాజ్ ప్యానెల్ ఒక్కటే నామినేషన్ వేయడంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. బస్తీ ఉపాధ్యక్షుడిగా డీ నరేష్, షేక్ షరీఫ్ (చోటు), జనరల్ సెక్రటరీగా పీటర్, జాయింట్ సెక్రటరీలుగా షేక్ మక్సూద్‌అలీ, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్.రమేష్, పి.గణేష్, వై.ప్రేమ్, ట్రెజరర్లుగా జి.శ్రీనివాస్ (గండిపేట్), జెట్టి గిరి, కే కృష్ణ, జాయింట్ ట్రెజరర్లుగా జీహెచ్ఎంసీ శంకర్, జీహెచ్ఎంసీ శ్రీను, చిన్నా రాము తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎజాజ్ మాట్లాడుతూ బస్తీలో యాక్టివ్ మెంబర్లుగా ఉన్నవారిని కలుపుకుని సమన్వయంతో బస్తీ అభివృద్ధికి పాటుపడతామని వెల్లడించారు.


మహ్మద్ ఎజాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న బస్తీ ప్రతినిధులు

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న ఇంక్విలాబ్ సేన ప్రతినిధులు

హిమాయత్‌నగర్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఇంక్విలాబ్ సేన జాతీయ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్‌చేసింది. ఆదివారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంక్విలాబ్ సేన రాష్ట్ర అధ్యక్షులు జానీ, ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.హుస్సేన్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇంక్విలాబ్ సేన పని చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై డ్రోన్లతో టియర్ గ్యాస్ షెల్స్ కాల్చడం దుర్మార్గమైన చర్యలు అవలంభిస్తుందన్నారు. రైతుల డిమాండ్లపై కేంద్రం చర్చలకు ఆహ్వానించాలని కోరారు. సమావేశంలో ఇంక్విలాబ్ సేన ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజేష్,నాయకులు వినోద్, యాదయ్య, నరేష్, లక్ష్మి, ఫర్హానా, ఆషియా రుక్సేనా తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే ప్రావీణ్యం సాధ్యం


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న సుమన్

వెంగళరావునగర్ : మనం ఏ విద్యలోనైనా ప్రావీణ్యం సాధించాలంటే నిరంతర సాధన అవసరమని సినీనటుడు, ఆర్ఎస్‌కెఏ చైర్మెన్ సుమన్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం రుద్రమదేవి షటొకాన్ కరాటే డూ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ (ఆర్ఎస్‌కెఏ) ఇండియా ఆధ్వర్యంలో రుద్రమదేవి మెగా కప్ పేరుతో 4వ జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం రాత్రి జరిగిన ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ నేటితరం యువతకు, ముఖ్యంగా బాలికలకు ఈ విద్య ఎంతో అవసరమన్నారు. ఆపదలో ఎవరో వచ్చి కాపాడుతారని ఎదురు చూడవద్దని, సెల్ఫ్ డిఫెన్స్ అనేది ఎంతో అవసరమని తద్వారా మనలను మనం కాపాడుకోవచ్చని సూచించారు. టోర్నమెంట్ అడ్వైజర్ చిన్నశ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలం..భయం భయం!

- పెచ్చులూడుతున్న పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్
- నిర్వహణ లేమితో చిట్టడివిని తలపిస్తున్న వైనం
- బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న ఉద్యోగులు
- దృష్టి సారించని ఉన్నతాధికారులు


శిథిలావస్థలో ఆర్ అండ్ బీ క్వార్టర్స్

సనత్‌నగర్: ఏన్నో ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్‌లలోనే నివాసముంటూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు ఆ ప్రభుత్వ ఉద్యోగులు. వారి జీవనం దినదిన గండం నూరేళ్లఆయుష్ అన్నట్లుగా మారింది. అవి ఎప్పుడు కూలిపోతాయోనని భయం గుప్పిట్లో పెట్టుకుని కుటుంబంతో కలిసి జీవనం గడుపుతున్నారు. తాతల కాలం నాడు నిర్మితమైన క్వార్టర్స్‌లో బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రోడ్లపై నిత్యం పొంగి పొర్లే డ్రైనేజీలు..వెలగని వీధిదీపాలు..జనావాసాలే ఆవాసంగా విష సర్పాల సంచారం..క్వార్టర్స్ చుట్టూ అడవులను తలపించే రీతిలో చెట్ల పొదలతో అడవిలో బతుకున్నామనే భావన కలుగుతోందంటున్నారు బేగంపేట్ పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్ ఉద్యోగులు.

నిర్వహణ లేక..

వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల ఆవాసం కోసం గత 50 ఏళ్ల క్రితం బేగంపేట్ పాటిగడ్డలో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించింది. రెండు విడతల్లో కలిపి 504 క్వార్టర్స్‌లలో అధికారుల కేటగిరీల వారీగా ఏ, బీ, సీ, డీ టైపు క్వార్టర్స్ నిర్మాణం జరిగింది. ఐఏఎస్ స్థాయి అధికారులకు ఏ టైపు క్వార్టర్స్, ఆ తర్వాత స్థాయిలను బట్టి బీ, సీ, డీ టైపు క్వార్టర్స్‌ను కేటాయించారు. సచివాలయం నుంచి వచ్చే ఆర్డర్స్ మేరకు ఉద్యోగులకు ఇక్కడ కేటాయింపులు జరుపుతారు. వారి వేతనాలను బట్టి హెచ్‌ఆర్‌ఏ కోత విధిస్తారు. ఆర్ అండ్ బీకి చెందిన స్థలంలో నిర్మాణాలు జరిపిన నేపథ్యంలో ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌గా పిలుస్తూ వచ్చారు. వీటి మెయింటెనెన్స్‌ను కూడా ఆర్ అండ్ బీకే అప్పగించారు. రానురాను క్వార్టర్స్ నిర్వహణ అధ్వానంగా మారింది. గత పనిమిదేళ్లుగా ఒక్క మెయింటెనెన్స్ వర్క్ కూడా జరగలేదంటే పరిస్థితి ఏ మేర ఉందో అర్థం చేసుకోవచ్చు. క్వార్టర్స్‌కు సంబంధించి ఏదైనా పనులు చేయాలంటే ఉద్యోగులు ముందుగా అప్పీలు పెట్టుకుంటారు. ఆ మేరకు అంచనాలు తయారుచేసి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అప్పీలు తాలుకూ పనులు ఎక్కడా కూడా జరుగుతున్న దాఖలాలు లేవు. ఫలితంగా ఉద్యోగులే గత్యంతరం లేక పనులు చేయించుకుంటున్నారు.

సగానికి పైగా ఖాళీ..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన కొందరు క్వార్టర్స్‌కు ఖాళీ చేయగా..మరికొందరు ఇక్కడ మెయింటెనెన్స్ సరిగా లేక భయానక పరిస్థితుల కారణంగా వెళ్లిపోయారు. ముఖ్యంగా పాత క్వార్టర్స్ స్లాబ్ పెచ్చులు కూడా ఊడిపోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను అలాగే వదిలేయడంతో గుబురుగా చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఇదే ఆసరాగా చేసుకుని పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పిచ్చిమొక్కలు, చెట్ల పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో పాములు సంచారం ఎక్కువైంది. ఆర్ అండ్ బీ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మించుకున్న ఇళ్లకు అసలు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏకంగా రోడ్ల మీదకే వదులుతున్నారు. దీంతో రోడ్లపై మురుగునీరు ప్రవహించడం నిత్యకృత్యమే. క్వార్టర్స్‌లో సైతం ఎప్పుడో 50 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్లే ఉండడంతో తరచూ డ్రైనేజీ జామై కంపుకొడుతోంది.

మరమ్మతులకు బయటి నుంచే..

చిన్న చిన్న ఉద్యోగులైతే బయట వేలాది రూపాయలు అద్దెలు చెల్లించలేకపోవడం, సంజీవయ్య పార్కు రైల్వేస్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో చాలామంది ఈ క్వార్టర్స్‌ను వదలాలంటే ఆలోచిస్తున్నారు. కానీ నిర్వహణను గాలికొదిలేయడంతో శతకోటి సమస్యల నడుమ ఉద్యోగులు సతమతమవుతున్నారు. కనీసం ట్యాప్‌కు మరమ్మతులు చేయాలన్నా బయటి నుంచి పిలిపించుకుని చేయించుకోవాల్సిందే. పరిస్థితులు ఇలాగే ఉంటే మాత్రం మిగిలిన క్వార్టర్స్ సైతం ఖాళీ చేయక తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

అప్రమత్తతకు మారుపేరు అగ్నిమాపక సిబ్బంది

సనత్‌నగర్: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిర్మించిన సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నూతన భవనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మధుసూదన రావు, ఏడీఎఫ్ఓ సురేష్‌రెడ్డి, ఎస్ఎఫ్ఓ ప్రదీప్‌కుమార్ తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ.. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరిగినా ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చూడడంలో ఫైర్ సిబ్బంది ముందుంటారన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బాధితుల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా పని చేసేది ఒక్క ఫైర్ సిబ్బంది మాత్రమేనన్నారు. నూతన భవన నిర్మాణం కోసం కీలకంగా వ్యవహరించిన ఫైర్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌ను అభినందించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్ని మాపకశాఖ సిబ్బంది అంటేనే అప్రమత్తతకు మారుపేరు అని, ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా క్షణాల్లో అక్కడకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడడంలో వారి పాత్ర ఎనలేనిదన్నారు.



ఎంఎస్ఎంఈ ఎగుమతిదారుల సమ్మిట్

బంజారాహిల్స్: ప్రాంతీయ ఎంఎస్ఎంఈ ఎగుమతిదారుల సమ్మిట్ లోయల్ ట్యాంక్‌బండ్‌లోని మారియట్ హోటల్‌లో జరిగింది. సెక్టోరల్, ఎంఎంస్ఎంఈ ఉత్పత్తుల ఎగుమతుల సామర్థ్యంపై అధ్యయనం చేయడంతో పాటు వాణిజ్య ఒప్పందాలు, ఎంఎంస్ఎంఈలకు నిర్దిష్ట హెచ్ఎస్ఎన్ కోడ్ తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి. ఎంఎస్ఎంఈ ఎగుమతుల కోసం విజయవంతమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించడమే లక్ష్యంగా సమ్మిట్ కొనసాగింది. అలాగే ఎగుమతులకు సంబంధించిన సవాళ్లపై ఉత్పత్తిదారులు అనేక విషయాలను పరస్పరం పంచుకున్నారు. భారతదేశపు మొదటి సామూహిక ఎగుమతి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రెండు లక్షల ఎంఎస్ఎంఈ ఎగుమతిదారులను ప్రారంభించే లక్ష్యంగా ఇండియా ఎస్ఎంఈ ఫోరం ఈ సమ్మిట్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 200లకు పైగా ఎంఎస్ఎంఈలు, ఔత్సాహిక ఎగుమతిదారులు పాల్గొన్నారు.

పూరీ జగన్నాథ్ ఆలయంలో విద్యార్థులు



బంజారాహిల్స్: ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల సందర్భంగా జూబ్లీహిల్స్ భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమం పదో తరగతి విద్యార్థులు బంజారాహిల్స్‌లోని పూరీ జగన్నాథ్ టెంపుల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. పరీక్షల్లో మంచి మార్కులు రావాలని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో హాజరుకావాలని సూచించారు.

కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసుల ప్రతిజ్ఞ


జూబ్లీహిల్స్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు..

బంజారాహిల్స్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించేది లేదంటూ ట్రాఫిక్ పోలీసులు కూడళ్ల వద్ద ప్రతిజ్ఞ కొనసాగిస్తున్నారు. తమ విధులను గుర్తుచేసుకుంటూ వాటిని సక్రమంగా నిర్వర్తించేవిధంగా ట్రాఫిక్ సిబ్బంది ప్రతిజ్ఞ ద్వారా ఉత్తేజాన్ని పొందుతున్నారు. అందులో భాగంగా ఆదివారం జూబ్లీహిల్స్ చౌరస్తాలో ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు కూడలిలో ప్రయాణికులకు కనబడే విధంగా ఉండి ప్రతిజ్ఞ చేశారు.

వరలక్ష్మికి గౌరవ డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న నరాల వరలక్ష్మి

హిమాయత్‌నగర్ : విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నగరానికి చెందిన వరలక్ష్మికి గౌరవ డాక్టరేట్‌ను అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఆన్‌లైన్ యూనివర్సిటీ ప్రదానం చేసింది. తాజాగా ఢిల్లీలో నిర్వహించిన ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పద్మశ్రీ జితేందర్ సింగ్ శుంటి చేతుల మీదుగా ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

లక్కీ డ్రాలో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రదానం


మొదటి బహుమతిగా కారు తాళాలు అందుకుంటున్న సరిత

బంజారాహిల్స్: మహిళలను కుట్టు రంగంలో ప్రోత్సహించేందుకు తమ సంస్థ నిరంతరం శ్రమిస్తుందని ట్రిబుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత దీనబంధు సాహు తెలిపారు. ఆదివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రిబుల్ ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్లు కొనుగోలు చేసిన మహిళల లక్కీ డ్రా వేడుక నిర్వహించారు. ఈ డ్రాలో గెలుపొందిన మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీలతో పాటు మొదటి బహుమతి పొందిన సరిత అనే మహిళకు నిసాన్ కారును అందించారు. కార్యక్రమంలో సీఈవో గోపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శం



ఉస్మానియా యూనివర్సిటీ: మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శమని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నాను సైదులు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్ నిజాం సంస్థానంలో విద్యా మంత్రిగా పనిచేసి దళిత బాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించి మహిళల విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దుర్గం వినోద్, కరుణకర్, గోవర్ధన్, హరికృష్ణ, నగేష్ పాల్గొన్నారు.

మేడారానికి పాదయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్ రెడ్డి రెండు విడతలుగా పదేళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలందించాలని ఓయూ జేఏసీ చైర్మన్ ఒరుగంటి కృష్ణ ఆధ్వర్యంలో మేడారానికి పాదయాత్ర చేపట్టారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ నుంచి మేడారం సమ్మక్క–సారలమ్మ దేవతల వద్దకు కాలినడకన బయలుదేరారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం సహకరించాలని బీఆర్ఎస్ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్‌లాల్, యాదగిరి, నరసింహ, సురేష్, సాయి, యాదగిరి, నగేష్, వంశీ పాల్గొన్నారు.

3 వరుస టెస్టుల్లో రెండు డబుల్ సెంచరీలు బాదిన మూడో భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్. ఈ వరుసలో వినోద్ కాంబ్లి (1993లో), కోహ్లి (2017లో) ముందున్నారు.

9 స్వదేశంలో జడేజా అందుకున్న 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డుల సంఖ్య. అనిల్ కుంబ్లే (9) పేరిట ఉన్న రికార్డును జడేజా సమం చేశాడు.

12 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా అక్రమ్ (12 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డును జైస్వాల్ సమం చేశాడు.

28 రాజ్‌కోట్ టెస్టులో భారత్ సిక్స్‌ల సంఖ్య. ఒకే టెస్టులో అత్యధిక సిక్స్‌లు కొట్టిన జట్టుగా 2019లో వైజాగ్‌లో దక్షిణాఫ్రికాపై నమోదు చేసిన రికార్డును భారత్ సవరించింది.

48 ఈ సిరీస్‌లో ఇప్పటివరకు భారత జట్టు బాదిన సిక్స్‌లు. ఇదో కొత్త రికార్డు. దక్షిణాఫ్రికాపై 2019లో భారత్ 47 సిక్స్‌లు కొట్టింది.



నితేశ్, ప్రజ్ఞయ్ సెంచరీలు

హైదరాబాద్ జట్టుకు ఆధిక్యం


నితేశ్


ప్రజ్ఞయ్

సాక్షి, హైదరాబాద్: మేఘాలయ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుకు 46 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఐదు రోజుల ఈ తుది పోరులో రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 25/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు 87.5 ఓవర్లలో 350 పరుగులకు ఆలౌటైంది. నితేశ్ రెడ్డి (122; 13 ఫోర్లు, 4 సిక్స్‌లు), ప్రజ్ఞయ్ రెడ్డి (102 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీలు సాధించారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 131 పరుగులు జోడించారు. నితేశ్ అవుటయ్యాక ప్రజ్ఞయ్ అజేయంగా నిలిచి హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడంలో కీలకపాత్ర పోషించాడు. 46 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మేఘాలయ ఆట ముగిసే సమయానికి ఖాతా తెరవకుండా ఒక వికెట్ కోల్పోయింది.

అమెరికాపై భారత్ విజయం

రూర్కెలా: మహిళల ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత జట్టుకు మూడో విజయం దక్కింది. అమెరికా జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సవితా పూనియా నాయకత్వంలోని భారత జట్టు 'షూటౌట్'లో 2–1తో గెలిచింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. ఫలితం తేలేందుకు 'షూటౌట్' నిర్వహించారు. అమెరికా క్రీడాకారిణులు కొట్టిన ఐదు షాట్‌లలో నాలుగింటిని నిలువరించి గోల్‌కీపర్ సవితా పూనియా భారత్‌కు విజయాన్ని అందించింది.

భారత్‌ను గెలిపించిన మనిక



బుసాన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టుకు తొలి విజయం లభించింది. హంగేరితో ఆదివారం జరిగిన గ్రూప్–1 రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–2తో గెలిచింది. భారత నంబర్‌వన్ మనిక బత్రా తాను ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు భారత పురుషుల జట్టు గ్రూప్–3లో భాగంగా పోలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 1–3తో ఓడిపోయింది.

434 పరుగుల తేడాతో...

ఇంగ్లండ్‌పై మూడో టెస్టులో భారత్ బ్రహ్మాండ విజయం

- పరుగుల పరంగా టెస్టుల్లో టీమిండియాకిదే అతిపెద్ద విజయం
- యశస్వి అజేయ డబుల్ సెంచరీ
- రాణించిన సర్ఫరాజ్, జడేజా
- రాంచీలో 23 నుంచి నాలుగో టెస్టు


యశస్వి


జడేజా

విరామం తర్వాత మళ్లీ తాజాగా మొదలైన మూడో టెస్టులో యశస్వి జైస్వాల్ విధ్వంసం... కొత్త కుర్రాడు సర్ఫరాజ్ ఖాన్ ప్రతాపం... బౌలింగ్‌లో జడేజా మాయాజాలం... వెరసి భారత్ చరిత్రకెక్కే విజయం సాధించింది. మ్యాచ్ మొదలైన రోజు నుంచీ ప్రతీరోజు భారత్ ఆధిపత్యమే కొనసాగడంతో ఏ మలుపు లేకుండా ఈ టెస్టు నాలుగు రోజుల్లోనే ముగిసింది. ఈ గెలుపుతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి రాంచీలో జరుగుతుంది.

రాజ్‌కోట్: టీమిండియా బలగం ముందు ఇంగ్లండ్ 'బజ్‌బాల్' ఆట కుదేలైంది. మ్యాచ్ జరిగే కొద్దీ బ్యాటర్ల పరుగుల పరాక్రమం, బౌలర్ల వికెట్ల మాయాజాలం ప్రత్యర్థి జట్టును చిత్తు చేసింది. మరో రోజు ఆట మిగిలి ఉండగానే ఈ మ్యాచ్‌లో భారత్ 434 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై బ్రహ్మాండ విజయం నమోదు చేసింది. పరుగుల తేడా పరంగా టెస్టుల్లో భారత జట్టుకిదే అతి పెద్ద విజయం. ఇంతకుముందు భారత జట్టు 2021లో ముంబైలో న్యూజిలాండ్‌పై 372 పరుగుల తేడాతో గెలిచింది. ఆట నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 196/2తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 98 ఓవర్లలో 4 వికెట్లకు 430 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్‌కు 557 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా (5/41), కుల్దీప్ యాదవ్ (2/19), అశ్విన్ (1/19) స్పిన్ దెబ్బకు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది.

యశస్వి 'డబుల్'...

ఓవర్‌నైట్ బ్యాటర్లు శుబ్‌మన్ గిల్ (91; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుల్దీప్ (27; 3 ఫోర్లు, 1 సిక్స్) మూడో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. గిల్ రనౌటయ్యాక శనివారం వెన్నునొప్పితో వ్యక్తిగత స్కోరు 104 పరుగులవద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన యశస్వి జైస్వాల్ మళ్లీ క్రీజులోకి వచ్చాడు. అదే దూకుడు కొనసాగిస్తూ యశస్వి జైస్వాల్ (236 బంతుల్లో 214 నాటౌట్; 14 ఫోర్లు, 12 సిక్స్‌లు) తన కెరీర్‌లో రెండో డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ (72 బంతుల్లో 68 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధసెంచరీతో అదరగొట్టాడు. ప్రస్తుత టెస్టు క్రికెట్లోనే విశేషానుభవజ్ఞుడు అండర్సన్ వేసిన ఇన్నింగ్స్ 85వ ఓవర్లో యశస్వి హ్యాట్రిక్ సిక్సర్లు అతని విధ్వంసానికి మచ్చుతునకలు కాగా... సర్ఫరాజ్ అంతర్జాతీయ టెస్టుకు కొత్తైన... దూకుడు నాకు పాతే అని మరో అర్ధసెంచరీతో నిరూపించుకున్నాడు. 231 బంతుల్లో జైస్వాల్ ద్విశతకాన్ని సాధించాడు. ఇద్దరు అబేధ్యమైన ఐదో వికెట్‌కు 172 జోడించడం విశేషం.

స్పిన్ ఉచ్చులో పడి...

కొండంత లక్ష్యం కావడంతో ఇంగ్లండ్ బజ్‌బాల్ ఆట చేతులెత్తేసింది. కలిసొచ్చిన స్పిన్ పిచ్‌పై జడేజా పట్టు సాధించాడు. ఆరంభంలోనే డకెట్ (4) రనౌటయ్యాక, క్రాలీ (11)ని బుమ్రా ఎల్బీగా పంపాడు. తర్వాత జడేజా స్పిన్ మాయాజాలంలో పోప్ (3), బెయిర్‌స్టో (4), రూట్ (7) తేలిగ్గానే పడిపోయారు. జట్టు స్కోరు 50 వద్దే రూట్‌తో పాటు స్టోక్స్ (15), రేహాన్ అహ్మద్ (0) అవుటయ్యారు. మార్క్ వుడ్ (15 బంతుల్లో 33; 6 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్ టాప్ స్కోరర్ కావడంతో ఇంగ్లండ్ 100 పరుగులు దాటింది. అత్యవసర వ్యక్తిగత కారణాలరీత్యా రెండో రోజు ఆట ముగిశాక చెన్నై వెళ్లిన అశ్విన్ ఆదివారం మైదానంలోకి దిగి ఒక వికెట్ కూడా తీశాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 319; భారత్ రెండో ఇన్నింగ్స్: 430/4 డిక్లేర్డ్. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 11. డకెట్ (రనౌట్) 4; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 3; రూట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 7; బెయిర్‌స్టో (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 4; స్టోక్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 15; ఫోక్స్ (సి) జురేల్ (బి) జడేజా 16; రేహాన్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 0; హార్ట్‌లీ (బి) అశ్విన్ 16; వుడ్ (సి) జైస్వాల్ (బి) జడేజా 33; అండర్సన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (39.4 ఓవర్లలో ఆలౌట్) 122. వికెట్ల పతనం:** 1–15, 2–18, 3–20, 4–28, 5–50, 6–50, 7–50, 8–82, 9–91, 10–122. **బౌలింగ్:** బుమ్రా 8-1-18-1, సిరాజ్ 5-2-16-0, జడేజా 12.4-4-41-5, కుల్దీప్ 8-2-19-2, అశ్విన్ 6-3-19-1.

ఆసియా క్వీన్స్...

ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు స్వర్ణం

షా ఆలమ్ (మలేసియా): ఊహించని అద్భుతం జరిగింది. ఏమాత్రం అంచనాలు లేకుండా ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన భారత జట్టు ఏకంగా ట్రోఫీనే సొంతం చేసుకొని అబ్బుర పరిచింది. ఆదివారం జరిగిన మహిళల టీమ్ విభాగం ఫైనల్లో పీవీ సింధు నాయకత్వంలోని భారత జట్టు 3–2తో థాయ్‌లాండ్ జట్టును ఓడించింది. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. గతంలో భారత పురుషుల జట్టు రెండుసార్లు సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు సాధించగా... భారత మహిళల జట్టు మాత్రం ఫైనల్ చేరిన తొలి ప్రయత్నంలోనే విజేతగా నిలువడం విశేషం.

థాయ్‌లాండ్‌తో టైటిల్ పోరు తొలి మ్యాచ్‌లో పీవీ సింధు 21–12, 21–12తో సుపనిదను ఓడించి భారత్‌కు 1–0 ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌లో ట్రిసా జాలీ–పుల్లెల గాయత్రి జోడీ 21–16, 18–21, 21–16తో జోంగ్‌కొల్ఫాన్–రవింద జంటపై గెలిచి భారత ఆధిక్యాన్ని 2–0కు పెంచింది. అయితే మూడో మ్యాచ్‌లో అస్మిత 11–21, 14–21తో బుసానన్ చేతిలో ఓడిపోయింది. నాలుగో మ్యాచ్‌లో ప్రియా కొంజెంగ్‌బమ్–శ్రుతి మిశ్రా ద్వయం 11–21, 9–21తో బెన్యాపా–నుంతాకర్న్ జోడీ చేతిలో పరాజయం పాలైంది. దాంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో భారత రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖర్బ్ 21–14, 21–9తో పార్న్‌పిచాను ఓడించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్‌లో హరియాణాకు చెందిన 17 ఏళ్ల అన్‌మోల్ అత్యద్భుత ఆటతో అదరగొట్టింది. తొలి లీగ్ మ్యాచ్‌లో చైనాపై... సెమీఫైనల్లో జపాన్‌పై భారత్ నెగ్గడంలో అన్‌మోల్ కీలకపాత్ర పోషించింది. విజేతగా నిలిచిన భారత జట్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.

6,6,6,6,6,6

- ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు కొట్టిన ఆంధ్ర బ్యాటర్ వంశీకృష్ణ
- సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లో అద్భుతం



కడప స్పోర్ట్స్: కల్నర్ సీకే నాయుడు ట్రోఫీ జాతీయ అండర్–23 క్రికెట్ టోర్నీలో భాగంగా రైల్వేస్ జట్టుతో ఆదివారం మొదలైన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఓపెనర్ మామిడి వంశీకృష్ణ (64 బంతుల్లో 110; 9 ఫోర్లు, 10 సిక్స్‌లు) అద్భుతం చేశాడు. గుంటూరు జిల్లాకు చెందిన 22 ఏళ్ల వంశీకృష్ణ ఒకే ఓవర్‌లోని వరుస 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టి సంచలనం సృష్టించాడు. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 372 పరుగులు చేసింది. రైల్వేస్ లెగ్ స్పిన్నర్ దమన్‌దీప్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ 10వ ఓవర్లో వంశీకృష్ణ 6 బంతుల్లో 6 సిక్స్‌లు సంధించాడు. అనంతరం ఈ జోరు కొనసాగిస్తూ వంశీకృష్ణ 48 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. సీకే నాయుడు ట్రోఫీ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఆంధ్ర బ్యాటర్‌గా వంశీకృష్ణ రికార్డు నెలకొల్పాడు. మామిడి వంశీకృష్ణతోపాటు వన్‌డౌన్ బ్యాటర్, కెప్టెన్ వంశీకృష్ణ (55; 6 ఫోర్లు, 1 సిక్స్), ధరణి కుమార్ (81; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకట్ రాహుల్ (61 బ్యాటింగ్; 6 ఫోర్లు) కూడా రాణించారు.

ఇంతకుముందు అంతర్జాతీయ వన్డేల్లో హెర్షల్ గిబ్స్ (దక్షిణాఫ్రికా), జస్కరణ్ మల్హోత్రా (అమెరికా)... అంతర్జాతీయ టి20ల్లో యువరాజ్ సింగ్ (భారత్), కీరన్ పొలార్డ్ (వెస్టిండీస్)... ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో (మూడు/నాలుగు రోజులపాటు జరిగే మ్యాచ్‌లు) గ్యారీ సోబర్స్ (వెస్టిండీస్), రవిశాస్త్రి (భారత్), లీ జెర్మన్ (న్యూజిలాండ్)... దేశవాళీ వన్డేల్లో తిసారా పెరీరా (శ్రీలంక), రుతురాజ్ గైక్వాడ్ (భారత్)... దేశవాళీ టి20ల్లో రోజ్ వైట్లీ (ఇంగ్లండ్), లియో కార్టర్ (న్యూజిలాండ్), హజ్రతుల్లా జజాయ్ (అఫ్గానిస్తాన్) ఒకే ఓవర్లో వరుస 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టారు.

విద్య, ఉద్యోగ సమాచారం

రామగుండం ఫెర్టిలైజర్స్‌లో 28 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
- » **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్)–10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(మెకానికల్)–6, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రికల్)–3, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్‌స్ట్రుమెంటేషన్)–2, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)–3, మేనేజ్‌మెంట్ ట్రైనీ(లా)–1,మేనేజ్‌మెంట్ ట్రైనీ(హెచ్ఆర్)–3
- » **అర్హత:** పోస్టును అనుసరించి కనీసం 60శాతం మార్కులతో బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 29.02.2024 నాటికి కనీస వయస్సు 18 ఏళ్లు, గరిష్ఠంగా గ్రాడ్యుయేట్లకు 25 ఏళ్లు, పీజీ అభ్యర్థులకు 29 ఏళ్లు మించకూడదు.
- » **బేసిక్ పే:** రూ.40,000 నుంచి రూ.1,40,000
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.03.2024
- » **వెబ్‌సైట్:** www.rfcl.co.in

ఏఐఈఎస్ఎల్, న్యూఢిల్లీలో 100 టెక్నీషియన్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్(ఏఐఈఎస్ఎల్).. వివిధ విభాగాల్లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
- » **పోస్టుల వివరాలు:** ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(మెయింటెనెన్స్/ఓవర్‌హాల్, ఏవియానిక్స్), ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(ఏవియానిక్స్, ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటల్ /రేడియో), టెక్నీషియన్(ఫిట్టర్/షీట్ మెటల్, కార్పెంటర్, వెల్డర్), టెక్నీషియన్ (ఎక్స్–రే/ఎన్‌డీటీ).
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, ఇంజనీరింగ్ సర్టిఫికేట్, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
- » **ఎంపిక విధానం:**స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్,టెక్నికల్ అసెస్‌మెంట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా
- » **దరఖాస్తులకు చివరితేది:** 23.02.2024.
- » **వెబ్‌సైట్:** www.aiesl.in

టీచర్ కొలువుల కల నెరవేరేలా..

- » 6,100 పోస్టులతో ఏపీ టీఆర్‌టీ నోటిఫికేషన్
- » ఎస్‌జీటీ, ఎస్ఏ, పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపల్ పోస్టులు
- » రాత పరీక్ష ఆధారంగా నియామకాలు
- » మార్చి 15 నుంచి పరీక్షలు ప్రారంభం

బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా.. ప్రభుత్వ పాఠశాలల్లో.. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ టీఆర్‌టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్-2024కి దరఖాస్తు ప్రక్రియ కూడా మొదలైంది. ఈ నోటిఫికేషన్ ద్వారా విద్యా శాఖ పరిధిలోని పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో.. ఏపీ టీఆర్‌టీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ విశ్లేషణ, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం 6,100 పోస్టులు

ఏపీ టీఆర్‌టీ ద్వారా మొత్తం 6,100 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ): 2,280 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్స్ (ఎస్ఏ): 2,285 పోస్టులు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ): 1,264 పోస్టులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ): 215 పోస్టులు, ప్రిన్సిపల్స్: 42 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో/సబ్జెక్టులో ఇంటర్, డీఈడీ/డీఈఎల్ఈడీ; బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, బీఈడీ తదితర అర్హతలుండాలి. ఏపీ టెట్‌లో అర్హత సాధించాలి.

వయసు

జూలై 1, 2024 నాటికి 18–44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితి 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లుగా నిర్ణయించారు.

రాత పరీక్షలో ప్రతిభ

ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను నిర్వహించనున్నారు. పోస్టుల వారీగా టెస్ట్‌ల ఆ వివరాలు..

ఎస్‌జీటీ.. పరీక్ష

సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులకు 160 ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష ఉంటుంది. మొత్తం 8 పార్ట్‌లుగా పరీక్ష జరుగుతుంది. ఇందులో పార్ట్–1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 16 ప్రశ్నలు- 8మార్కులు; పార్ట్–2 పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్–8 ప్రశ్నలు–4 మార్కులు; పార్ట్–3 ఎడ్యుకేషన్ సైకాలజీ–16 ప్రశ్నలు–8మార్కులు; పార్ట్–4 లాంగ్వేజ్–1 కంటెంట్ 16 ప్రశ్నలు–8 మార్కులు, లాంగ్వేజ్–1 మెథడాలజీ 8 ప్రశ్నలు–4మార్కులు; పార్ట్–5 లాంగ్వేజ్–2(ఇంగ్లిష్) కంటెంట్ 16 ప్రశ్నలు–8 మార్కులు, మెథడాలజీ 8ప్రశ్నలు–4మార్కులు; పార్ట్–6 మ్యాథమెటిక్స్ కంటెంట్ 16 ప్రశ్నలు–8 మార్కులు, మ్యాథమెటిక్స్ మెథడాలజీ 8 ప్రశ్నలు –4 మార్కులు; పార్ట్–7 సైన్స్ కంటెంట్–16 ప్రశ్నలు–8 మార్కులు; సైన్స్ మెథడాలజీ 8 ప్రశ్నలు–4 మార్కులు; పార్ట్–8 సోషల్ స్టడీస్ కంటెంట్ 16 ప్రశ్నలు–8 మార్కులు, సోషల్ స్టడీస్ మెథడాలజీ 8 ప్రశ్నలు–4 మార్కులకు ఉంటుంది. లాంగ్వేజ్–1కు సంబంధించి అభ్యర్థులు తెలుగు/ఉర్దూ/హిందీ/తమిళం/ఒరియా/కన్నడ/సంస్కృతం భాషలను ఎంచుకోవచ్చు.

స్కూల్ అసిస్టెంట్స్ పరీక్ష స్వరూపం

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నాలుగు విభాగాలుగా 160 ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పార్ట్–1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్–20 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–2 పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్–10 ప్రశ్నలు–5 మార్కులు; పార్ట్–3 క్లాస్‌రూమ్ ఇంప్లికేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సైకాలజీ –10 ప్రశ్నలు–5 మార్కులు; పార్ట్–4 సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్–80 ప్రశ్నలు–40 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీ–40 ప్రశ్నలు–20 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

ప్రిన్సిపల్ పోస్టుల రాత పరీక్ష ఇలా

ఈ పోస్టులకు రెండు పేపర్లుగా పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1ను ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌గా పేర్కొన్నారు. ఇందులో 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటాయి. పేపర్–2ను 5 విభాగాల్లో 200 ప్రశ్నలతో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు–15 మార్కులు, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 30 ప్రశ్నలు–15 మార్కులు, ఎడ్యుకేషన్ సైకాలజీ 40 ప్రశ్నలు–20 మార్కులు, సమకాలీన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు, ఇతర కార్యక్రమాలు, అదే విధంగా స్కూల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన కార్యక్రమాలు, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, పర్యవేక్షణ –నాయకత్వ లక్షణాలు 70 ప్రశ్నలు–35 మార్కులు, టీచింగ్ మెథడాలజీపై అవగాహన 30 ప్రశ్నలు–15 మార్కులకు ఉంటాయి.



పీజీటీ పరీక్ష

పీజీటీ పోస్టులకు రెండు పేపర్లుగా పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1 ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్ 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. పేపర్–2ను నాలుగు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్–1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–2 పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 20 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–3 ఎడ్యుకేషన్ సైకాలజీ 20 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–4 సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్ 100ప్రశ్నలు–50 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీ 40 ప్రశ్నలు–20 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

టీజీటీ పరీక్ష ఇలా

ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ పరీక్షను కూడా రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. పేపర్–1 ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్ 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. పేపర్–2ను నాలుగు విభాగాలుగా 80 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్–1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–2 పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్ 10 ప్రశ్నలు–5 మార్కులు; పార్ట్–3 క్లాస్‌రూమ్ ఇంప్లికేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సైకాలజీ 10 ప్రశ్నలు–5 మార్కులు; పార్ట్–4 సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్ 80 ప్రశ్నలు–40 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీ 40 ప్రశ్నలు–20 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఫీజు చెల్లింపునకు చివరి తేది:** 21-02-2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**2024,ఫిబ్రవరి 22
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** మార్చి 5 నుంచి
- **స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పరీక్ష తేదీలు:** మార్చి 15 నుంచి 30 వరకు
- **పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపల్ పరీక్ష తేదీలు:** మార్చి 15 నుంచి 30 వరకు
- **ఫలితాల వెల్లడి:** 2024, ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** https://cse.ap.gov.in

విజయం సాధించాలంటే

ఎస్‌జీటీ

ఎస్‌జీటీ అభ్యర్థులు జీకే, కరెంట్ అఫైర్స్ సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి. సబ్జెక్టుల వారీ పటిష్ట ప్రణాళికతో అధ్యయనం సాగించాలి. భౌగోళిక నామాలు, నదీతీర నగరాలు, దేశాలు–రాజధానులు, ప్రపంచంలో తొలి సంఘటనలు, అవార్డులు, సదస్సులు, వార్తల్లో వ్యక్తులు, బడ్జెట్, అంతర్జాతీయ రాజకీయ, శాస్త్రసాంకేతిక అంశాలు తెలుసుకోవాలి.

- **విద్యా దృక్పథాలు:** దేశంలో విద్యా చరిత్ర, కమిటీలు; వర్తమాన భారతదేశంలో విద్యా సంబంధిత అంశాలు; ఉపాధ్యాయ సాధికారత; చట్టాలు–హక్కులు; జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం (ఎన్‌సీఎఫ్–2005); విద్యాహక్కు చట్టం, నూతన విద్యా విధానం తదితర అంశాలపై పట్టు సాధించాలి.
- **విద్యా మనోవిజ్ఞానశాస్త్రం:** శిశు వికాసం అభివృద్ధి,వైయక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వం అంశాలు చాలా ముఖ్యమైనవి. శిశు వికాసంలో వికాసం, పెరుగుదల, పరిపక్వత భావన–స్వభావం, వికాస నియమాలు, వికాసంపై ప్రభావం చూపే కారకాలు, వికాస దశలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. ముఖ్య భావనలు, అనువర్తనాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి.
- **కంటెంట్:** తెలుగు(ఆప్షనల్), ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల కంటెంట్‌లో సన్నద్ధతకు ప్రిపరేషన్ పరంగా పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. తెలుగులో కవులు–కావ్యాలు,అర్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు తదితరాలతో పాటు భాషాంశాలను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, టైప్స్ ఆఫ్ సెంటెన్సెస్, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. గణితంలో అర్థమెటిక్, సంఖ్యా వ్యవస్థ, క్షేత్ర గణితం, రేఖా గణితం, బీజ గణితం, సాంఖ్యక శాస్త్రం అంశాలపై పట్టు సాధించాలి. పదో తరగతి స్థాయి మ్యాథమెటిక్స్‌ను అధ్యయనం చేయడం లాభిస్తుంది.
- సైన్స్‌లో జీవ ప్రపంచం, మొక్కలు, జంతువులు, ఆహారం, సైన్స్‌లో విభాగాలు, పోషణ, ఆహార పిరమిడ్ , మానవ శరీరం, పదార్థాలు, కొలతలు, ప్రమాణాలు, ఆమ్లాలు–క్షారాలు, శక్తి రూపాలు, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై దృష్టి సారించాలి., ధ్వని, విద్యుత్, కాంతి, ఉష్ణం చాప్టర్లలోని ముఖ్య భావనలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కరణలపై పట్టుసాధించాలి. అదే విధంగా జీవవైవిధ్యం, ఆవరణ వ్యవస్థలు, పర్యావరణ సమస్యలు, భూతాపం తదితర అంశాలు ముఖ్యమైనవి.
- సోషల్ స్టడీస్‌లో స్థానిక భౌగోళిక అంశాలు, ఖండాలు, పారిశ్రామిక విప్లవం, మనీ–బ్యాంకింగ్, ప్రభుత్వం; రాజకీయ వ్యవస్థలు, జాతీయ ఉద్యమం, భారత రాజ్యాంగం, పరిపాలన, సాంఘిక సంస్థలు, అసమానతలు, మతం–సమాజం, సంస్కృతి, కమ్యూనికేషన్ తదితర అంశాలపై అవగాహన అవసరం.

స్కూల్ అసిస్టెంట్‌కు ఇలా

- **మ్యాథమెటిక్స్:** బీజ గణితం,సదిశా బీజ గణితం , వైశ్లేషిక రేఖాగణితం, కలన గణితం,త్రికోణమితి అంశాలపై పట్టు సాధించాలి. బయాలజీలో జీవ ప్రపంచం, సూక్ష్మజీవుల ప్రపంచం, జీవశాస్త్రం–ఆధునిక పోకడలు, జంతు ప్రపంచం తదితర పాఠ్యాంశాలు ఎంతో ముఖ్యమైనవి.
- **స్కూల్ అసిస్టెంట్స్–సోషల్ స్టడీస్:** భారత స్వాతంత్ర్య ఉద్యమం, ప్రపంచ యుద్ధాలు–అనంతర పరిస్థితులు; రాజ్యాంగం, యూఎన్‌వో, సమకాలీన ప్రపంచ అంశాలు; జాతీయ ఆదాయం, భారత ఆర్థిక వ్యవస్థ లక్షణాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.వరల్డ్ జాగ్రఫీ, ఇండియన్ జాగ్రఫీలపై పట్టుసాధించాలి.
- **సైన్స్:** జీవ ప్రపంచం, మొక్కలు, జంతువులు, ఆహారం, సైన్స్‌లో విభాగాలు, పోషణ, ఆహార పిరమిడ్, మానవ శరీరం, పదార్థాలు, కొలతలు, ప్రమాణాలు, ఆమ్లాలు–క్షారాలు, శక్తి రూపాలు, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై దృష్టి సారించాలి., ధ్వని, విద్యుత్, కాంతి, ఉష్ణం చాప్టర్లలోని ముఖ్య భావనలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కరణలపై పట్టుసాధించాలి. అదే విధంగా మన పర్యావరణానికి సంబంధించి జీవవైవిధ్యం, ఆవరణ వ్యవస్థలు, పర్యావరణ సమస్యలు, భూతాపం తదితర అంశాలు ముఖ్యమైనవి.
- **మెథడాలజీ:** ఆయా సబ్జెక్టులకు సంబంధించి బోధన ఉద్దేశాలు, విద్యా ప్రణాళిక, బోధనోపకరణాలు, మూల్యాంకనం తదితర పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం బీఈడీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	376	72,427
నిఫ్టీ ▲	130	22,041

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు			
నాస్‌డాక్	15,776	▽	131
డోజోన్స్	38,628	▽	145
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,712	△	114
డాక్స్	17,117	△	71
షాంఘై (గత శుక్రవారం ముగింపు)	2,886	△	36
నికాయ్	38,487	△	353

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.63	83.65
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.33	105.88
€	యూరో	ఎస్‌బీఐ	88.31	90.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.72	55.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.21	55.13
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.37	64.05
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.70	23.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

టర్మ్ ప్లాన్స్.. అన్నీ ఒకటి కాదు!



- కవరేజీకే మొదటి ప్రాధాన్యం
- దీనికి ప్రీమియం తక్కువే
- ప్రీమియం వెనక్కి ఇచ్చేది మరో రకం
- ఇందులో రెట్టింపు బాదుడు
- మధ్యలో తప్పుకుంటే కట్టిందంతా వెనక్కి
- వ్యత్యాసం తెలిస్తేనే మెరుగైన ఎంపిక

జీవిత బీమాను పెట్టుబడి సాధనంగా చూసే ధోరణిలో మార్పు వస్తోంది. అయినా, ఇప్పటికీ అధిక శాతం మంది బీమా ప్లాన్‌ను రాబడి కోణం నుంచే చూస్తుంటారు. చివరిలో ఎంతొస్తుందని అడుగుతారు. అందుకే బీమా ఏజెంట్లు ఎండోమెంట్ ప్లాన్లను ఎక్కువగా మార్కెటింగ్ చేస్తుంటారు. కానీ, బీమా అర్థం వేరు. ఒక వ్యక్తి మరణం కారణంగా కుటుంబం ఆర్థికంగా కష్టాలు పడకుండా ఆదుకునే సాధనం ఇది. బీమా రక్షణను ఈ కోణంలోనే తీసుకోవాలి. అచ్చమైన బీమా కవరేజీ ఇచ్చేదే టర్మ్ ఇన్సూరెన్స్. కానీ, ఇందులోనూ పలు రకాలు ప్రవేశించాయి. నిక్షేపంగా జీవించి ఉంటే మాకేంటి..? అని ప్రశ్నించే వారి కోసం టర్మ్ ప్లాన్‌ను బీమా సంస్థలు వినూత్నంగా అందిస్తున్నాయి. కానీ, ఏది తీసుకోవాలి..? దీనికి సమాధానం కావాలంటే నిపుణుల విశ్లేషణ తెలుసుకోవాల్సిందే.

తన కుటుంబ క్షేమం కోరేవారు తీసుకోవాల్సిన బీమా పాలసీ ఏదన్నా ఉందంటే అది టర్మ్ ఇన్సూరెన్స్ అని చెప్పాలి. తక్కువ ప్రీమియానికే మెరుగైన కవరేజీ ఇందులో లభిస్తుంది. కానీ, పాలసీ గడువు ముగిసే వరకు జీవించి ఉంటే ఇందులో చెల్లించిన ప్రీమియం వెనక్కి రాదు. దీంతో కట్టిన ప్రీమియం గంగపాలేనా? అని ఆలోచించే వారి కోసం బీమా సంస్థలు పరిష్కారాన్ని కనుగొన్నాయి. సగటు మనిషి ఆలోచనా తీరుకు అనుగుణంగా, చెల్లించిన ప్రీమియం చివర్లో వెనక్కి వచ్చే ఆప్షన్‌తోనూ టర్మ్ ఇన్సూరెన్స్‌ను ప్రవేశపెట్టాయి. అలాగే, పాలసీ గడువు ముగియకపోయినా కానీ, మధ్యలో వైదొలిగితే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియాన్ని వెనక్కి ఇచ్చే రకాన్ని కూడా తీసుకొచ్చాయి. కానీ, పాలసీదారు తనకు నిజంగా ప్రయోజనకరమైన పాలసీ తీసుకున్నప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుంది.

టర్మ్ పాలసీలో రకాలు

టర్మ్ ఇన్సూరెన్స్‌లో ప్రధానంగా మూడు రకాలు ఉన్నాయి. ఇందులో మొదటిది రెగ్యులర్ టర్మ్ ప్లాన్. దీన్నే లెవల్ టర్మ్ ప్లాన్ అని కూడా అంటారు. పాలసీదారులు తమ అభీష్టం మేరకు నిర్ణీత వయసు వరకు (నిర్ణీత కాలానికి) కవరేజీని తీసుకోవచ్చు. కొన్ని బీమా సంస్థలు నూరేళ్ల కాలానికీ కవరేజీని ఆఫర్ చేస్తుంటే, కొన్ని గరిష్ఠంగా 85 ఏళ్లకే రక్షణను పరిమితం చేస్తున్నాయి. ఇక టర్మ్ ప్లాన్‌లో రెండో రకం టీఆర్‌వోపీ. అంటే టర్మ్ ప్లాన్ విత్ రిటర్న్ ఆఫ్ ప్రీమియం. గడువు తీరే వరకు పాలసీదారు జీవించి ఉంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం నుంచి 18 శాతం జీఎస్టీని మినహాయించి మిగిలినది వెనక్కిచేస్తాయి బీమా సంస్థలు. మూడో రకం జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్. ఇప్పుడు బీమా సంస్థలు దీన్ని ఎక్కువగా ప్రచారం చేస్తున్నాయి. మిగిలిన రెండు రకాల కలయికగా ఇది ఉంటుంది.



పాలసీ కాల వ్యవధిలోనే కట్టిన ప్రీమియంలు వెనక్కి ఇవ్వాలని కోరొచ్చు. వీటిల్లో మూడో రకం 2022 నుంచే అందుబాటులోకి వచ్చింది. మ్యాక్స్ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్, కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ తదితర సంస్థలు జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్లను ప్రవేశపెట్టాయి. వీటిల్లో రెగ్యులర్ టర్మ్ ప్లాన్ కాకుండా మిగిలిన రెండు రకాల పట్ల మొగ్గు చూపించేట్టు అయితే, ముందుగా వాటికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే తుది నిర్ణయానికి రావాలి.

వ్యత్యాసాలు...

రెగ్యులర్ టర్మ్ ఇన్సూరెన్స్‌లో.. పాలసీ కాల వ్యవధి ముగిసేలోపు పాలసీదారు ఏ కారణంతో మరణించినా, పరిహారాన్ని నామినీకి చెల్లిస్తారు. పరిహారం మొత్తాన్ని ఒకే విడత లేదంటే, వాయిదాలుగానూ తీసుకోవచ్చు. కేవలం ఈ రిస్క్ వరకే ఈ పాలసీ పరిమితం. గడువు ముగిసేలోపు పాలసీదారు జీవించి ఉంటే ఏమీ తిరిగి రాదు. దీన్ని చౌక ప్లాన్‌గానూ చెబుతారు. కోటి రూపాయిల కవరేజీ సైతం 30 ఏళ్ల ఆరోగ్యకరమైన వ్యక్తికి రూ.12వేల కంటే తక్కువ వార్షిక ప్రీమియానికి వచ్చేస్తుంది. టీఆర్‌వోపీ (పాలసీ గడువు తీరిన తర్వాత ప్రీమియం వెనక్కి వచ్చేవి) ప్లాన్‌లో పాలసీ గడువులోపు పాలసీదారు మరణించినట్టయితే నామినీకి పరిహారం వస్తుంది. పాలసీ గడువు ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం నుంచి 18% జీఎస్టీని తగ్గించి ఇస్తారు. కానీ, రెగ్యులర్ టర్మ్ ప్లాన్‌లతో పోలిస్తే ఇవి ఖరీదుగా ఉంటాయి. రెగ్యులర్ టర్మ్ ప్లాన్ ప్రీమియం కంటే 2 రెట్ల వరకు అధిక ప్రీమియం వీటి కోసం చెల్లించాల్సి వస్తుంది. ఇలా అదనంగా వసూలు చేసే ప్రీమియంను సంప్రదాయ డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసి, గడువు తీరిన తర్వాత పాలసీదారులకు బీమా కంపెనీలు చెల్లిస్తుంటాయి. అదనంగా చెల్లించే మొత్తం నుంచే తమ ప్రీమియం వెనక్కి వస్తుందన్న వాస్తవాన్ని పాలసీదారులు గుర్తించాలి. జీరో కాస్ట్ ప్లాన్‌లో పాలసీ గడువు కంటే ముందుగానే వైదొలగొచ్చు. ఒక వ్యక్తి తన ఆర్థిక బాధ్యతలు ముగిశాయని భావించినప్పుడు లేదంటే పదవీ విమరణ తర్వాత పాలసీ గడువు ఇంకా మిగిలి ఉన్నా వైదొలగడానికి ఉంటుంది. 60 ఏళ్ల తర్వాత ఇలా చేయవచ్చు. ఇలా ముందస్తుగానే తప్పుకుంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం మొత్తం నుంచి 18% జీఎస్టీని మినహాయించి బీమా సంస్థలు వెనక్కి ఇచ్చేస్తాయి. దీంతో పాలసీ రద్దయిపోతుంది. దీనివల్ల బీమా సంస్థలకు ప్రయోజనం.. వృద్ధాప్యానికి వచ్చిన పాలసీదారు తప్పుకోవడం వల్ల వాటికి క్లెయిమ్ రిస్క్ తగ్గుతుంది.

వాస్తవం ఏంటి?

జీరోకాస్ట్ టర్మ్ ప్లాన్ అంటే, ఎలాంటి చార్జీలు ఉండవని, దీన్నే చౌక ప్లాన్ అని పొరబడే అవకాశం లేకపోలేదు. ''కొన్ని ప్లాన్లకు జీరోకాస్ట్ టర్మ్ ఇన్సూరెన్స్ అనే లేబుల్ వేయడం ఎందుకంటే.. ప్రత్యేకంగా వైదొలగడం, ప్రీమియం వెనక్కి వచ్చే ఆప్షన్ వల్లే. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు అనుసరించే మార్కెటింగ్ ఎత్తుగడల్లో భాగమే ఇది'' అని ప్రోబస్ ఇన్సూరెన్స్ బ్రోకర్ డైరెక్టర్ రాకేశ్ గోయల్ పేర్కొన్నారు. ప్రీమియం వెనక్కి వస్తుంది కనుక, జీరోకాస్ట్‌గా బీమా కంపెనీలు వీటిని వర్ణిస్తున్నాయి. అయినా, పాలసీదారు ఎప్పుడంటే అప్పుడు పాలసీ నుంచి తప్పుకోవడం కుదరదని పాలసీబజార్ టర్మ్ ఇన్సూరెన్స్ హెడ్ రిషబ్ గార్గ్ స్పష్టం చేశారు. కనీస కాల వ్యవధి ముగిసి, ఆర్థిక బాధ్యతలు తీరిన తర్వాతే ఇందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ''జీరో కాస్ట్ అనేది మైండ్ గేమ్. ఈ పాలసీ కోసం నేడు చెల్లించే ప్రీమియం విలువ, చివర్లో బీమా సంస్థ తిరిగిచ్చే ప్రీమియం కంటే చాలా ఎక్కువ'' అని వివరించారు.



ఏమిటి మార్గం?

టర్మ్ పాలసీ కాల వ్యవధి సాధారణంగా 30–40 ఏళ్లు అంతకంటే ఎక్కువే ఉండొచ్చు. ఉద్యోగం వచ్చిన నాటి నుంచే జీవిత బీమా కవరేజీ ఉండాలన్నది నిపుణుల సూచన. కనుక రిటైర్మెంట్ వరకు తీసుకోవడం ఎంతో అవసరం. 60 ఏళ్ల నాటికి కూడా ఆర్థిక బాధ్యతలు తీరుతాయో, లేదో అన్న సందేహంతో 75 ఏళ్లు, 85 ఏళ్ల వరకు కూడా పాలసీలు తీసుకుంటున్నారు. అయితే, కొన్ని పాలసీల్లో వయసు ఆధారంగా ఫీచర్లను బీమా సంస్థలు పరిమితం చేస్తుంటాయి. జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్ తీసుకుంటే ఆర్థిక బాధ్యతలు తీరిన వెంటనే పాలసీ నుంచి వైదొలగొచ్చు. దీనివల్ల ప్రీమియంలు వెనక్కి వస్తాయి. పాలసీ కాల వ్యవధి ముగియక ముందే ప్రీమియంల కోసం వైదొలగడం సరికాదు. దీనివల్ల జీవిత బీమా రక్షణను కోల్పోవాల్సి వస్తుంది. రెగ్యులర్ ప్లాన్‌లో రూ.50 లక్షల కవరేజీకి ప్రీమియం ఎంత? ప్రీమియం వెనక్కి వచ్చే ప్లాన్‌లో ప్రీమియం ఎంత? ఈ రెండింటి మధ్య అంతరం చెప్పుకోదగినంత ఉంటుంది. కనుక చివర్లో ప్రీమియం వెనక్కి వచ్చే ప్లాన్ కాకుండా రెగ్యులర్ ప్లాన్ తీసుకుని, మిగిలిన మేర మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకుంటే.. దీర్ఘకాలంలో భారీ మొత్తమే సమకూరుతుందని ఎన్నో నిదర్శనాలు చెబుతున్నాయి.

ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తి 'ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఐప్రొటెక్ట్ స్మార్ట్ జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్' 60 ఏళ్ల వయసు వచ్చే వరకు రూ.కోటి కవరేజీ తీసుకునేట్టు అయితే ప్రీమియం రూ.16,287గా ఉంది. రెగ్యులర్ ప్లాన్‌లో ఇదే కవరేజీకి ప్రీమియం రూ.12,686. వ్యత్యాసం రూ.3,601. రెగ్యులర్ ప్లాన్ తీసుకుని, మిగిలే మొత్తాన్ని ప్రతి నెలా రూ.300 చొప్పున (ఏడాదికి రూ.3,600) ఈక్విటీ ఫండ్‌లో 30 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇలా చేస్తే 12 శాతం రాబడి అంచనా ప్రకారం 30 ఏళ్లకు రూ.10.5 లక్షలు సమకూరుతుంది. రిస్క్ తీసుకోని డెట్ సాధనంలో ఇన్వెస్ట్ చేసుకున్నా రూ.4.5 లక్షలు సమకూరుతుంది. ఇలా చేయడం వల్ల రెగ్యులర్ ప్లాన్ సైతం జీరోకాస్ట్‌గానే సమకూరుతుంది. ఇక్కడ చెప్పుకున్నట్టు జీరోకాస్ట్ టర్మ్ ప్లాన్ కోసం ఏటా రూ.16,287 చొప్పున 30 ఏళ్లలో రూ.4.89 లక్షలు చెల్లించుకోవాలి. చివరి వరకు జీవించి ఉంటే, చెల్లించిన మొత్తం నుంచి 18 శాతం జీఎస్టీ మినహాయిస్తారు. అప్పుడు చేతికి వచ్చేది రూ.4 లక్షలు. ఇక కనిపించని చార్జీల గురించి కూడా తెలుసుకోవాలి. జీవిత బీమా ప్రీమియంలపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంటుంది. మరి అవే ప్రీమియంలు వెనక్కి వచ్చినప్పుడు పన్ను వర్తించొచ్చు.



ఇతర రకాలు

ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్..

చిన్న వయసులోనే టర్మ్ ప్లాన్ తీసుకునే వారు ఈ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం అనుకూలంగా ఉంటుంది. వివాహం అయిన తర్వాత నుంచి జీవితంలో పలు దశల్లో బాధ్యతలు పెరుగుతూ వెళతాయి. కనుక పెరిగే బాధ్యతలకు అనుగుణంగా బీమా కవరేజీ విస్తృతం చేసుకునేందుకు ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్ వీలు కల్పిస్తుంది. ఈ ప్లాన్‌లో ఏటా నిర్ణీత శాతం మేర కవరేజీ పెరుగుతూ వెళుతుంది. అలాగే, ఐదేళ్లకోసారి సమ్ అష్యూర్డ్ పెరిగే పాలసీలు కూడా ఉన్నాయి. కవరేజీ పెరిగినప్పటికీ, పాలసీ కాల వ్యవధి అంతటా ప్రీమియం స్థిరంగానే ఉంటుంది.

డిక్రీజింగ్ టర్మ్ ఇన్సూరెన్స్..

ఏటా కవరేజీ పెరిగే ప్లాన్‌కు విరుద్ధంగా ఇది పనిచేస్తుంది. సాధారణంగా 60–65 ఏళ్లకు వచ్చే నరికి ఆర్థిక బాధ్యతలు తగ్గిపోతుంటాయి. అటువంటప్పుడు ఈ ఆప్షన్‌లో ఏటా నిర్ణీత శాతం మేర సమ్ అష్యూరెన్స్ తగ్గుతూ వెళుతుంది. ఇందులోనూ ప్రీమియం స్థిరంగానే ఉంటుంది. ఇతర ప్లాన్లతో పోలిస్తే ప్రీమియం తక్కువ.

లమ్సమ్, పీరియాడిక్ పేమెంట్స్..

మరణ పరిహారం మొత్తాన్ని ఒకే విడత చెల్లించేవి లమ్సమ్. ఒకేసారి అంత మొత్తం చేతికి వస్తే, దాన్ని ఆదాయంగా మలుచుకోవడం సమస్యగా భావించేవారు, పీరియాడిక్ పేమెంట్స్ ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. పాలసీదారు కాల వ్యవధి ముగియక ముందే మరణించిన సందర్భంలో పరిహారాన్ని నెలవారీ చొప్పున పదేళ్ల పాటు చెల్లించేలా ఎంపిక చేసుకోవచ్చు. నగం పరిహారం ఏక మొత్తంలో చెల్లించి, మిగిలిన మొత్తాన్ని నెలవారీ వాయిదాలుగా తీసుకునే ఆప్షన్ కూడా ఇందులో ఉంటుంది.

కన్వర్టబుల్ టర్మ్ ఇన్సూరెన్స్..

టర్మ్ ఇన్సూరెన్స్ అనేది ఎంపిక చేసుకున్న కాలానికి అమల్లో ఉంటుంది. ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తి 40 ఏళ్ల కాలానికి టర్మ్‌ప్లాన్ తీసుకున్నారని అనుకుందాం. 70 ఏళ్లకు వచ్చే నరికి టర్మ్ ప్లాన్ ముగిసిపోతుంది. అప్పుడు కావాలంటే దాన్ని మరింత కాలానికి బీమా పాలసీ కింద మార్చుకోవచ్చు.

ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్..

చిన్న వయసులోనే టర్మ్ ప్లాన్ తీసుకునే వారు ఈ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం అనుకూలంగా ఉంటుంది. వివాహం అయిన తర్వాత నుంచి జీవితంలో పలు దశల్లో బాధ్యతలు పెరుగుతూ వెళతాయి. కనుక పెరిగే బాధ్యతలకు అనుగుణంగా బీమా కవరేజీ విస్తృతం చేసుకునేందుకు ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్ వీలు కల్పిస్తుంది. ఈ ప్లాన్‌లో ఏటా నిర్ణీత శాతం మేర కవరేజీ పెరుగుతూ వెళుతుంది. అలాగే, ఐదేళ్లకోసారి సమ్ అష్యూర్డ్ పెరిగే పాలసీలు కూడా ఉన్నాయి. కవరేజీ పెరిగినప్పటికీ, పాలసీ కాల వ్యవధి అంతటా ప్రీమియం స్థిరంగానే ఉంటుంది.

లిమిటెడ్ పే, సింగిల్ పే..

రెగ్యులర్ ప్లాన్‌లో ఎంపిక చేసుకున్న కాలం అంతటా నిర్ణీత రోజులకు ఒకసారి ప్రీమియం చెల్లిస్తుండాలి. అదే సింగిల్ ప్రీమియం పాలసీలో ఆరంభంలోనే ఒకసారి ప్రీమియం చెల్లించాలి. రెగ్యులర్‌గా ప్రీమియం కట్టే వెసులుబాటు లేని వారు దీన్ని పరిశీలించొచ్చు. ఇక లిమిటెడ్ పే ప్రీమియం ప్లాన్‌లో.. పాలసీ కాల వ్యవధి అంతటా కాకుండా, కొన్నేళ్ల పాటు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తి 80 ఏళ్లు వచ్చే వరకు 50 ఏళ్ల కాలానికి టర్మ్ ప్లాన్ ఎంపిక చేసుకున్నాడని అనుకుందాం. 60 ఏళ్లకు రిటైర్ అయిన తర్వాత కూడా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇది భారంగా భావిస్తే లిమిటెడ్ పే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. 5–10–15 ఏళ్లు ఇలా లిమిటెడ్ పేలో ప్రీమియం చెల్లింపుల కాలవ్యవధి ఉంటుంది.



బ్రిటన్ పార్లమెంటేరియన్లకు 'స్ప్రెడింగ్ జాయ్'



లండన్: జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్ తన స్వీయ జీవిత చరిత్ర 'స్ప్రెడింగ్ జాయ్'ను బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులకు అందజేశారు. బ్రిటిష్ సౌత్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ కామర్స్ (బీఎస్ఐసీసీ) లండన్‌లోని గ్రిమాండ్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు మార్టిన్ డే, వీరేంద్ర శర్మ, స్టీఫెన్ టిమ్స్ సహా బరోనెస్ ఉద్దీన్‌లకు తన ఆత్మకథను బహూకరించారు. బ్రిటిష్ పార్లమెంటేరియన్స్‌కు నా కథను తెలియజేయటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జోయ్ అలుక్కాస్ ఈ సందర్భంగా అన్నారు. కాగా ఇటీవల తన ఆత్మ కథను భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా జోయ్ అలుక్కాస్ అందజేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-2-2024	
విశాఖ	555–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	542–00
విజయవాడ	542–00
రిటైల్ ధర (డజను)	72.00
18-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	554–00
వరంగల్	556–00
రిటైల్ ధర	6.15

ఎల్‌అండ్‌టీ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,389 **టార్గెట్:** రూ. 4,020

ఎందుకంటే: ఎల్‌అండ్‌టీ ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో రూ. 39,300 కోట్ల అమ్మకాలు సాధించింది. వీటిలో సర్వీసుల ఆదాయం కలసిలేదు. ఇది మా అంచనాలకంటే 2 శాతం అధికంకాగా.. ఎగ్జిక్యూషన్‌లో సీజనల్‌గా మెరుగైన పనితీరు కనబరిచింది. కీలకమైన నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు త్రైమాసికవారీగా నామమాత్ర వృద్ధితో 7.5 శాతాన్ని తాకాయి. వార్షికంగా ఇవి 1 శాతం నీరసించడంతో మా అంచనాలు 8.6 శాతాన్ని అందుకోలేకపోయాయి. అయితే ఇతర అంశాలలో కంపెనీ ప్రగతిని అందుకుంది. వార్షిక ప్రాతిపదికన 26 శాతం వృద్ధితో రూ. 76,000 కోట్ల విలువైన ఆర్డర్లను సాధించింది. ఇవి మా అంచనాలు రూ. 61,000 కోట్లను మించాయి. ఫైనాన్స్ మినహా నికర వర్కింగ్ క్యాపిటల్(ఎన్‌డబ్ల్యూసీ) అమ్మకాలలో 16.6 శాతంగా నమోదైంది. వెరసి మా అంచనాలను అందుకోగా.. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి)లో మరింత మందగించే వీలుంది. ఆర్డర్‌బుక్‌లో మధ్యప్రాచ్యం నుంచి పెరుగుతున్న కాంట్రాక్టులు, ఈ ఏడాది తొలి 9 నెలల్లో ఫిక్స్‌డ్ ధరల కాంట్రాక్టుల వాటా 30–35% నుంచి 43%కి బలపడటం సానుకూల అంశాలు. దీంతో సిమెంట్, స్టీల్ తదితర కమోడిటీ ధరల పెరుగుదల రిస్కులున్నప్పటికీ సమీపకాలంలో పెద్దగా ప్రభావం కనిపించకపోవచ్చు.



ఐకియో లైటింగ్ | ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 301 **టార్గెట్:** రూ. 390

ఎందుకంటే: ఐకియో లైటింగ్ దేశీయంగా లైట్ ఎమిటింగ్ డయోడ్ (ఎల్‌ఈడీ–లెడ్) తయారీలో ఉంది. 2016లో ఏర్పాటైన కంపెనీ లెడ్ లైటింగ్ సొల్యూషన్లు అందిస్తోంది. ప్రధానంగా భవిష్యత్‌కు నష్టం వాటిల్లకుండా సొంత అవసరాలకు అనుగుణమైన తయారీ (సస్టెయినబిలిటీ)పై దృష్టిపెట్టి నడుస్తున్న కంపెనీ తక్కువ విద్యుత్‌ను వినియోగించే లెడ్ ప్రొడక్టులను రూపొందిస్తోంది. తద్వారా దేశీ సస్టెయినబిలిటీ లక్ష్యాలకు మద్దతుగా నిలుస్తోంది. 2019–20 నుంచి 2022–23 వరకూ గత నాలుగేళ్లలో కంపెనీ ఆదాయం వార్షికంగా 18 శాతం పుంజుకోగా.. నిర్వహణ లాభం(ఇబిటా) మరింత అధికంగా 27 శాతం ఎగసింది. ఇందుకు విభిన్నతరహా ప్రొడక్టులు (ప్రొడక్ట్ మిక్స్), నిర్వహణ సామర్థ్యం, బ్రాండ్ పటిష్టత దోహదపడ్డాయి. బలమైన కస్టమర్లు, పునరావృత ఆర్డర్ల నేపథ్యంలో గత కొన్నేళ్లలో కంపెనీ ఆర్థికంగా బలపడింది. వెరసి కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాక రుణాలను తిరిగి చెల్లించింది. దీంతో రుణరహిత కంపెనీగా ఆవిర్భవించింది. దీంతో గతేడాది(2022–23)లో వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తగ్గించుకుంది. కోవిడ్–19 అనిశ్చితిలో సైతం పనితీరును మెరుగుపరచుకుంటూ వచ్చింది. ఫలితంగా 2019–20లో నమోదైన 17 శాతం ఇబిటా మార్జిన్లు గతేడాదికల్లా 22 శాతానికి ఎగశాయి. పరిశ్రమలోని ప్రత్యర్థి సంస్థలతో పోలిస్తే నిలకడ, పోటీతత్వాన్ని ప్రదర్శించింది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్లు

కోటక్ ఎంఎఫ్ నుంచి టెక్నాలజీ ఫండ్

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తాజాగా కోటక్ టెక్నాలజీ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 26తో ముగుస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించే నిధులను టెక్నాలజీ, టెక్నాలజీ ఆధారిత రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తారు. ఎప్పటికప్పుడు మారిపోతున్న సాంకేతిక రంగంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులను అందించేందుకు ఫండ్ ప్రయత్నిస్తుంది. ప్రపంచంలోని టాప్ 10 ఐటీ సర్వీసుల కంపెనీల్లో 8 భారతీయ సంస్థలు ఉన్నాయని కేఎంఏఎంసీ ఎండీ నీలేష్ షా తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికి దేశీ ఐటీ కంపెనీలు మార్జిన్లపరంగా మెరుగైన పనితీరు కనపర్చాయని వివరించారు. ఈ నేపథ్యంలో పటిష్టమైన వృద్ధి అవకాశాలు ఉండి, సముచిత వేల్యుయేషన్‌లో లభిస్తున్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు షా పేర్కొన్నారు.

బరోడా బీఎన్‌పీ పారిబాస్ ఇన్నోవేషన్ ఫండ్

బరోడా బీఎన్‌పీ పారిబాస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఇన్నోవేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 28తో ముగుస్తుంది. ఈ ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీము ద్వారా సేకరించిన నిధులను ఇన్నోవేషన్ థీమ్‌ను బట్టి ఇన్వెస్ట్ చేస్తారు. ఇందుకోసం ప్రధానంగా మూడు కేటగిరీల వినూత్న కంపెనీలను ఫండ్ గుర్తించింది. కొత్త ఆవిష్కరణలు చేసే దిగ్గజ సంస్థలు (డిజిటల్ నేటివ్స్), టెక్నాలజీలు..సప్లై టూల్స్ లాంటివి అందించే సంస్థలు (ట్రాన్స్‌ఫార్మర్స్), మారే మార్కెట్‌కు అనుగుణమైన నవకల్పనలతో వృద్ధి చెందే సంస్థలు (లెగసీ కంపెనీలు) వీటిలో ఉంటాయి.

స్మార్ట్ సిప్ అంటే ఏంటి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఈక్విటీ మార్కెట్ ఎప్పటికప్పుడు నూతన గరిష్ట స్థాయిలను తాకుతోంది. కనుక ఈ పరిస్థితుల్లో స్మార్ట్ సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని సూచిస్తారా..? – డి. వెంకట రమణ

స్మార్ట్ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (స్మార్ట్ సిప్) అనేది రెగ్యులర్ సిప్‌తో పోలిస్తే వినూత్నమైనది. ప్రతి నెలా సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసే మొత్తం అప్పటి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా స్మార్ట్‌గా మారిపోతుంది. కొన్ని పారామీటర్ల ఆధారంగా మార్కెట్ల విలువలు ఖరీదుగా ఉన్నాయా? లేక చౌకగా ఉన్నాయా అన్నది ఆల్గోరిథమ్ నిర్ణయిస్తుంది. మార్కెట్లు పూర్తి విలువ మేర ట్రేడ్ అవుతున్నాయని ఆల్గోరిథమ్ (సాఫ్ట్‌వేర్) భావిస్తే, అప్పుడు సిప్‌లో కొంత భాగమే ఈక్విటీ పెట్టుబడిగా వెళుతుంది. మిగిలిన మొత్తాన్ని లిక్విడ్ ఫండ్‌కు తరలిస్తుంది. ఒకవేళ స్టాక్ విలువలు చౌకగా ఉన్నాయని భావిస్తే అప్పుడు పెట్టుబడిలో అధిక భాగం స్టాక్స్‌కే కేటాయిస్తుంది. లిక్విడ్ ఫండ్‌కు పరిమితంగానే వెళుతుంది. స్మార్ట్ సిప్ ఇదే మాదిరిగా పనిచేస్తుంది. ఈ విధానం ఇన్వెస్టర్లకు ఎంతో మేలు చేస్తుంది. ఎందుకంటే ఈక్విటీ వ్యాల్యూషన్లు ఖరీదుగా ఉన్నప్పుడు తక్కువ మొత్తమే పెట్టుబడిగా వెళుతుంది. అదే ఈక్విటీ వ్యాల్యూషన్ చౌకగా మారినప్పుడు సిప్‌లో అధిక భాగం ఈక్విటీలకు వెళుతుంటుంది. మార్కెట్లో అనుకూల సమయాన్ని ఎవరూ అంచనా వేయలేరు. ఓ పద్ధతి ప్రకారం, క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లడమే కీలకం. ఇందుకు స్మార్ట్‌సిప్ వీలు కల్పిస్తుంది. నిజానికి సాధారణ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ఉద్దేశం కూడా పెట్టుబడులకు సంబంధించి రిస్క్‌ను తగ్గించడమే. మార్కెట్లు ఎప్పుడు దిద్దుబాటుకు గురవుతాయి? ఎప్పటి వరకు ర్యాలీ చేస్తాయి? అని ఎవరూ చెప్పలేరు. అటు ర్యాలీల్లోనూ, ఇటు పతనాల్లోనూ ప్రతి నెలా క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టడం సిప్ ద్వారా సాధ్యపడుతుంది. మార్కెట్లు ఖరీదుగా మారాయా? చౌకగా ఉన్నాయా? అని చూడక్కర్లేదు. దీని వల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తాన్ని సమకూర్చుకోవడం సాధ్యపడుతుంది. స్టాక్స్ ధరలు దిద్దుబాటుకు గురైనప్పుడు సిప్ పెట్టుబడితో ఎక్కువ ఫండ్ యూనిట్లు సమకూరుతాయి. దీర్ఘకాలంలో సంపద సృష్టికి కావాల్సినది క్రమశిక్షణ. అందుకు సిప్ వీలు కల్పిస్తుంది. కనుక మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నాయని చెప్పి స్మార్ట్‌సిప్‌ను పరిశీలించక్కర్లేదు. మీరు రెగ్యులర్ సిప్ మార్గంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

నా పెట్టుబడుల్లో సింహ భాగం ఈక్విటీల్లోనే ఉన్నాయి. రిటైర్మెంట్‌కు మూడేళ్లు మిగిలి ఉంది. ఇప్పుడు ఈక్విటీ పెట్టుబడులను డెట్ ఫండ్స్‌లోకి మళ్లించుకోవచ్చా? నా లాభం రూ.లక్షకు మించే ఉంటుంది. కనుక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇలా డెట్‌లోకి మళ్లించిన త ర్వాత ప్రతి నెలా ఇంత చొప్పున సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ద్వారా తీసుకుందామని అనుకుంటున్నా ను. డెట్ ఫండ్ నుంచి ప్రతి నెలా బ్యాంక్ ఖాతాకు జమ అయ్యే మొత్తంపైనా పన్ను పడుతుందా? – త్యాగస్ నరేంద్రన్

అవును. రెండు సందర్భాల్లోనూ మూలధన లాభంపై పన్ను పడుతుంది. అయినప్పటికీ రెండింతల పన్ను చెల్లించినట్టు కాదు. పెట్టుబడిపై వచ్చే రాబడిపైనే పన్ను అమలవుతుంది. దీర్ఘకాల లక్ష్యానికి చేరువ అవుతున్న క్రమంలో మూడేళ్ల ముందుగానే ఈక్విటీ పెట్టుబడులను స్థిరాదాయ సాధనాల్లోకి మళ్లించుకోవడం మంచి ఆలోచనే అవుతుంది. లక్ష్యానికి చేరువ అవుతున్నప్పుడు పెట్టుబడులు తక్కువ అస్థిరతలతో కూడిన సాధనాల్లో ఉండడం ఎంతో అవసరం. ఇలాంటప్పుడే సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) అక్కరకు వస్తుంది. ఈక్విటీ ఫండ్స్ నుంచి మీ పెట్టుబడులను ఎస్‌డబ్ల్యూపీ ద్వారా డెట్ ఫండ్స్‌లోకి మళ్లించుకోవడం వల్ల మార్కెట్ కనిష్టంలో ఉన్నప్పుడు వైదొలిగే రిస్క్‌ను తప్పిస్తుంది.

రయ్.. రయ్..

- విస్తరణలోనూ యకహోమా జోరు
- అచ్యుతాపురం వద్ద రూ.3,079 కోట్లతో ఏటీసీ టైర్ల తయారీ యూనిట్
- 2022 ఆగస్టులో సీఎం జగన్ చేతుల మీదుగా ఉత్పత్తి ప్రారంభం
- 2వ దశలో రూ.680 కోట్లతో ప్యాసింజర్ వాహనాల టైర్ల తయారీ యూనిట్



సాక్షి, అమరావతి: జపాన్‌కు చెందిన ఒక భారీ మల్టీ నేషనల్ కంపెనీ ఏపీలో విస్తరణ దిశగా వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. జపాన్‌కు చెందిన యకహోమా గ్రూపు.. అలయన్స్ టైర్స్ కంపెనీ (ఏటీసీ) పేరుతో రూ.3,079 కోట్ల భారీ పెట్టుబడితో టైర్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తొలి దశలో రూ.1,750 కోట్ల వ్యయంతో హాఫ్ హైవే టైర్లు (భారీ యంత్ర పరికరాలకు వినియోగించే టైర్లు) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకోసం 2019 నవంబర్‌లో ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేసింది. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) 2020 నవంబర్‌లో ఆమోదం తెలిపారు. వెనువెంటనే అనకాపల్లి పరిధిలోని అచ్యుతాపురం వద్ద ఏపీఐఐసీ భూమి కేటాయించడంతో నిర్మాణ పనులు ప్రారంభించింది. 2022 జూలైలో తొలి టైరును ఉత్పత్తి చేసింది. ఈ యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2022 ఆగస్టు 16న వాణిజ్యపరంగా ప్రారంభించారు. రోజుకు 132 టన్నుల రబ్బరును వినియోగించడం ద్వారా ఉత్పత్తి చేసిన టైర్లను 120కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో విస్తరణ

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుండటంతో యకహోమా గ్రూపు ప్యాసింజర్ వాహనాల టైర్లను తయారు చేసే యూనిట్ నిర్మాణ పనులను ప్రారంభించింది. సుమారు రూ.680 కోట్ల పెట్టుబడితో ప్యాసింజర్ కారు టైర్ల తయారీ లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. దేశీయ ప్యాసింజర్ కార్లకు డిమాండ్ భారీగా పెరగడంతో దానికి తగ్గట్టుగా ఏటా 17 లక్షల టైర్ల తయారీ సామర్థ్యంతో విస్తరణ పనులు మొదలు పెట్టింది. ఈ యూనిట్‌ను 2024 చివరి త్రైమాసికానికి అందుబాటులోకి తీసుకు రావాలని యకహోమా గ్రూపు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం 28 లక్షల టైర్లుగా ఉన్న ఏటీసీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా 45 లక్షల టైర్లకు చేరుకోనుంది. 2007లో 7 లక్షల టైర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఇండియాలో అడుగుపెట్టిన ఈ గ్రూపు వేగంగా విస్తరిస్తోంది. ఇండియాలో ఇప్పటికే రెండు యూనిట్లు.. తిరువన్‌వేలి, దోహేజ్‌ల్లో ఉండగా, మూడవ యూనిట్‌ను అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసింది. ఈ యూనిట్ పూర్తి స్థాయి సామర్థ్యం అందుబాటులోకి వస్తే 2,300 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో 75 శాతం మంది స్థానికులకే ఉపాధి కల్పించనున్నారు.

ఆ టైటిల్ ఏంటి.. ట్రైలర్‌లో సీన్లేంటి?

'గాంజా శంకర్'పై టీఎస్ నాబ్ నజర్!

- మార్చాలంటూ హీరో, దర్శకుడు, నిర్మాతకు నోటీసులు
- కొద్ది కాలంగా అభ్యంతరకరమైన సినిమా టైటిల్స్, సీన్లు, ట్రైలర్‌లపై దృష్టి
- గతంలో బేబీ చిత్రంలో దృశ్యాలపై కూడా స్పందించిన అధికారులు



సందీప్ శాండిల్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్-నాబ్) అధికారులు అవసరమైన సందర్భాల్లో సినిమాల 'సెన్సార్ బోర్డు' బాధ్యతల్నీ చేపడుతున్నారు. ఆయా చిత్రాల్లో మాదకద్రవాల వినియోగాన్ని ప్రేరేపించేలా ఉన్న సీన్లు, టైటిల్స్ మార్చాల్సిందిగా ఆదేశిస్తున్నారు. గతంలో ఆనంద్ దేవరకొండ హీరోగా వచ్చిన 'బేబీ' చిత్రంపై స్పందించిన అధికారులు తాజాగా సాయి ధరమ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందించిన 'గాంజా శంకర్'ను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సినిమా టైటిల్ మార్చాలని, చిత్రంలోని సన్నివేశాల్లో సైతం గంజాయి పండించడం, విక్రయించడం, వినియోగించడాలను ప్రోత్సహించేవిగా లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ మేరకు టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య శనివారం హీరో సాయి ధరమ్‌తేజ్, నిర్మాత ఎస్.నాగ వంశీ, దర్శకుడు సంపత్ నందిలకు నోటీసులు జారీ చేశారు.

'బేబీ'లో వివాదాస్పదమైన ఓ సీన్...

మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న ఓ డ్రగ్ పార్టీపై టీఎస్ నాబ్ అధికారులు గతేడాది దాడి చేశారు. ఆ ఫ్లాట్‌లో కనిపించిన సీన్‌కు అప్పట్లో విడుదలైన 'బేబీ'సినిమాలోని సీన్లకు మధ్య సారూప్యత ఉందని అధికారులు తేల్చారు. దాంతో మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రేరేపించేలా ఉన్న ఆ సన్నివేశాలకు సంబంధించి చిత్ర యూనిట్‌కు నోటీసులు ఇచ్చారు. దీంతో అభ్యంతరకరమైన సీన్లు వచ్చినప్పుడు సినిమాలో వార్నింగ్ నోట్ వచ్చేలా దర్శకుడు చర్యలు తీసుకున్నారు.

తాజాగా మరోసారి తెరపైకి వివాదం...

గత ఏడాది సెప్టెంబర్ నాటి 'బేబీ' చిత్రం తర్వాత ఈ వివాదం మళ్లీ తెరపైకి రాలేదు. తాజాగా శుక్రవారం ట్రైలర్ విడుదలైన గాంజా శంకర్ చిత్రం విషయంలో టీఎస్ నాబ్ కలగజేసుకుంది. ఈ సినిమా టైటిల్‌తో పాటు ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు సైతం యువత... ప్రధానంగా విద్యార్థులను గంజాయి వినియోగం, విక్రయం వైపు ఆకర్షించేలా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ చిత్ర కథానాయకుడు గంజాయి వ్యాపారిగా కనిపిస్తున్నాడని, దీని ప్రభావంతో పలువురు ఆ దారిలో వెళ్లే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య 'గాంజా శంకర్' సినిమా హీరోతో పాటు దర్శకనిర్మాతలకు నోటీసులు జారీ చేశారు. సినిమా టైటిల్‌తో పాటు అభ్యంతరకరమైన, గంజాయి, డ్రగ్స్ వైపు యువతను మళ్లించేలా ఉన్న వాటిని మార్చాలని స్పష్టం చేశారు. సినిమా పేరులో ఉన్న గాంజా అనే పదం తీసేయాలని కోరారు. అలా కాని పక్షంలో ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలీవుడ్ చిత్రాలపై ఎన్సీబీ సహాయంతో...

ఈ నోటీసుల ప్రతిని టీఎస్-నాబ్ అధికారులు తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, డైరెక్టర్స్ అసోసియేషన్లతో పాటు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు పంపారు. అయితే బాలీవుడ్ చిత్రాల్లో డ్రగ్స్‌కు సంబంధించిన సీన్లు అనేకం ఉంటున్నాయి. ఇప్పటి వరకు వీటి విషయం ఎవరూ పట్టించుకోలేదు. టీఎస్ నాబ్ అధికారులు మాత్రం వీటినీ తీవ్రంగా పరిగణించాలని యోచిస్తున్నారు. బాలీవుడ్ చిత్రాల్లోనూ డ్రగ్స్‌ను ప్రేరేపించేలా సీన్లు లేకుండా చూడాలని, ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ అధీనంలోని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోను (ఎన్సీబీ) కోరనున్నారు. ఆ విభాగం లెక్కల ప్రకారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 14 కోట్ల మంది డ్రగ్స్ వినియోగదారులు ఉన్నారు. డ్రగ్స్ ప్రేరేపించే చిత్రాలను సీరియస్‌గా తీసుకోకుంటే భవిష్యత్‌తరాలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ.

సీఎంను కలిసిన వక్ఫ్ బోర్డు పాలకమండలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వక్ఫ్ బోర్డు నూతన పాలకమండలి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలిసి జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, ఇతర సభ్యులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త బోర్డు ఏర్పాటు చేసినందుకు సభ్యులు సీఎం రేవంత్‌ను సన్మానించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.